అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

శనివారం13-5-2023 సమగ్ర తెలుగు దినపత్రిక




హుసాముద్దీన్‌కు
## కాంస్యం
గాయంతో సెమీస్ బౌట్‌కు దూరం

టీమ్ ఇండియా కాంస్య తీన్‌మార్

వివరాలు 10లో

సంపుటి : 9 సంచిక : 132 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar www.navatelangana.com 10 పేజీలు వెల: 6.50



65 రాయితీ సేవల్లో 11 మాత్రమే పునరుద్ధరణ

# రైలు దోపిడీ

## కోవిడ్ తర్వాత 320 ప్యాసింజర్ రైళ్లు రద్దు

ఆర్థికాభివృద్ధి అంటే ఇప్పుడున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ, మరింత మెరుగైన సేవల్ని విస్తరించి వృద్ధిని సాధించడం... ఇది ఎకనామిక్స్‌లో ప్రాథమిక సూత్రం. నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి అయ్యాక, ఈ సూత్రం తిరగబడింది. సంక్షేమం అటకెక్కింది. ఉన్న వాటికే పేర్లు మార్చి జనం జేబుల్ని కొల్లగొడ్తూ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపిత ఆర్థిక దాష్టీకాన్ని అమల్లోకి తెచ్చారు. దానికి కోవిడ్ సంక్షోభాన్ని చక్కగా వాడుకున్నారు. దక్షిణ మధ్య రైల్వేలో ఏ నెలకు ఆ నెల ఆదాయం పెరుగుతున్నదంటూ ప్రజల్ని భ్రమల్లో ముంచెత్తుతుంటే, వాస్తవం ఏంటా అని 'నవతెలంగాణ' విశ్లేషణ చేసింది. విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. కోవిడ్‌కు ముందు సామాన్యుడికి అందుబాటులో ఉండే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి, వాటి పేర్లు, నెంబర్లు మార్చేసి, అవే రైళ్లలో ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తున్నారనే వాస్తవాలు వెల్లడయ్యాయి. దానికి తోడు కోవిడ్‌కు ముందు వివిధ కేటగిరిల ప్రజలకు రైల్వేశాఖ 65 రకాల రాయితీలు ఇచ్చేది. కోవిడ్‌ను సాకుగా చూపి వాటిలో 54 రకాల రాయితీలను ఎత్తేశారు. 'ప్రభుత్వం వ్యాపారం చేయదు' అని ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటు సాక్షిగా ప్రకటన చేసిన విషయం తెలిసిందే. మరి దేశవ్యాప్తంగా ఇప్పుడు రైల్వేశాఖ చేస్తున్నది ఏమిటో 'కమల గళాలే' సమాధానం చెప్పాలి. ప్రజలూ వాస్తవాల్ని గమనించాలి!

ఏదీ ఉచితం కాదంటున్న మోడీ సర్కార్

### వాటికే 'స్పెషల్స్' బోర్డు తగిలించి ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు
### ప్రయాణీకులను అడ్డంగా దోచుకుంటున్న దక్షిణ మధ్య రైల్వే

ఎస్ఎస్ఆర్ శాస్త్రి

రైల్వే ఆదాయం పెరుగుతుందంటే, వారి సేవలు విస్తరించాయనుకుంటే పొరపాటే! రైలు ప్రయాణీకులను మోడీ ప్రభుత్వం అడ్డంగా మోసం చేస్తూ, ఖజానాను నింపుకుంటున్నది. ఆ మోసాలకే రకరకాల పేర్లు పెట్టి, లేని రద్దీని సృష్టించి, దానికి అనుగుణంగా చార్జీలు పెంచి ప్రయాణీకుల్ని నిలువునా బాదేస్తుంది. ఏ రాష్ట్రానికి వెళ్తే ఆ రాష్ట్రంలో స్వదేశీ 'వందే భారత్' ప్రారంభోత్సవాల పేరుతో ప్రచారార్భాటం చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ దేశంలోని ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి, వాటికే స్పెషల్ ట్రైన్స్ అని బోర్డులు తగిలించి, ఎక్స్‌ప్రెస్ రైలు చార్జీలను ముక్కుపిండి వసూలు చేస్తూ, 'దేశభక్తి'ని చాటుకుంటున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రజలు రైలు ప్రయాణానికి దూరం అవుతున్నారు. చౌకైన రైలు ప్రయాణాన్ని కేంద్ర ప్రభుత్వం ఖరీదు చేసింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కోవిడ్ తర్వాత ఆదాయం పెరిగిందంటూ ఇటీవల ఆ జోన్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ప్రకటించారు. సేవలు ఏం పెరిగాయా అని విశ్లేషిస్తే, కోవిడ్‌కు ముందు జోన్ పరిధిలో 340 ప్యాసింజర్ రైళ్లు తిరిగేవి. కోవిడ్ తర్వాత వాటిలో 60 రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్చి, టిక్కెట్ రేట్లు పెంచి, రైలు నిలిచే స్టేషన్ల సంఖ్యను తగ్గించారు. మరో 250 రైళ్లను ప్యాసింజర్ స్పెషల్ ట్రైన్స్ అని పేరు మార్చి వాటిలోనూ ఎక్స్‌ప్రెస్ రైళ్ల చార్జీలను వసూలు చేస్తున్నారు. రైలు ఆగే స్టేషన్ల సంఖ్యను కుదించారు. 10 రూట్లలో ప్యాసింజర్ రైళ్లను అసలు పునరుద్ధరించలేదు. 20 ప్యాసింజర్ రైళ్లను స్పెషల్ ట్రైన్స్‌గా పేరు మార్చి, యథాప్రకారం నడుపుతున్నారు. ప్యాసింజర్ రైళ్లు పేదలకు తక్కువ ఛార్జీతో ప్రయాణ సౌకర్యం కల్పించేవి. మోడీ ప్రభుత్వం వాటిని సామాన్యుడికి దూరం చేసింది. అలాగే గతంలో ప్యాసింజర్ రైళ్లు ఆగే స్టేషన్ల సంఖ్యను కూడా కుదించడంతో సమీప గ్రామాల ప్రజలకు రైలు ప్రయాణం దూరం...

5లో

**వందే భారత్ భారం...**

వేగంగా వెళ్తుందని చెప్తున్న వందే భారత్ రైలులో చార్జీలు ఎక్కువ. సాధారణ, ఎక్స్‌ప్రెస్ రైళ్లలోకంటే టిక్కెట్ ధర రెట్టింపు ఉంటుంది. వందే భారత్ రైళ్లలో రద్దీ పెంచడం కోసం సాధారణ, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో బోగీలను కుదిస్తున్నారు. ఫలితంగా రిజర్వేషన్ల వెయిటింగ్ లిస్ట్ చాంతాడంత పెరిగి, ప్రయాణీకులు తప్పనిసరిగా వందేభారత్ రైళ్లలో ప్రయాణం చేసే పరిస్థితులు కల్పిస్తున్నారు. దీనితో ఆ రైళ్లలో ఆక్యుపెన్సీ రేషియో పెరుగు తున్నదని ప్రచారం చేస్తున్నారు. అసలు ప్రయాణీకుల అవసరాలకు తగినట్టు రైళ్లను నడపడంలో ఆ శాఖ పూర్తిగా విఫలమైందని రవాణారంగ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### టికెట్ల ముద్రణ ఇక ఔట్‌సోర్సింగ్ !

ప్రింటింగ్ ప్రెస్సులు మూసివేయనున్న రైల్వేశాఖ

వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

5లో..



హిందుత్వ శక్తులతో
# ప్రమాదం

## బీజేపీ ప్రభుత్వాల ప్రోద్బలం..భారత ప్రజాస్వామ్యానికి ముప్పు


- సామాజికవేత్తలు,మేధావులు
- మైనారిటీలు అభద్రతలో ఉన్నారని ఆందోళన

న్యూఢిల్లీ : దేశంలో హిందుత్వ శక్తుల చర్యలు ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ హిందుత్వ శక్తులు దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయనీ, వీటి తీరు దేశ ప్రజాస్వామ్యానికి చాలా ముప్పు తీసుకొస్తుందని సామాజిక కార్యకర్తలు, మేధావులు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగానికి రక్షణగా నిలవాల్సిన కేంద్రంలోని ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి వ్యవహరిస్తున్నదని తెలిపారు. అధికార బీజేపీ ప్రోద్బలంతో హిందుత్వ శక్తులు రెచ్చిపోతున్నాయని అన్నారు. ఇది దేశానికి ఏ మాత్రమూ శ్రేయస్కరం కాదనీ, దేశాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తుందని తెలిపారు.


ముఖ్యంగా, ఆరెస్సెస్ కార్యకలాపాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. దేశంలోని అమాయకపు యువతకు భావోద్వేగంతో కూడిన అంశాలను నూరిపోస్తూ వారిని రెచ్చగొడుతున్నారని అన్నారు. హిందుత్వ, హిందూ రాష్ట్ర వంటి భావోద్వేగ, సున్నిత అంశాలను ఆరెస్సెస్,దాని పరివార శక్తులు ఆయుధంగా మలచుకొని దేశ ప్రజాస్వామ్యానికి ముప్పును తీసుకొస్తున్నాయని అన్నారు.

2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆరెస్సెస్, దాని అనుబంధ సంస్థలు, ఇతర హిందుత్వ సంస్థలు ఇలాంటి ప్రయత్నాలను తీవ్రతరం చేశాయనీ, ముఖ్యంగా మోడీ సర్కారులూ అనేక ముఖ్యమైన లక్ష్యాలను సాధించిందని ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. ఇందుకు దేవుళ్ల విగ్రహాలు, గుడుల నిర్మాణాలను చూపెడుతున్నాయన్నారు. ఇటు అమెరికా అధ్యక్షుడు జోబిడెన్ ఆహ్వానంతో మోడీ ఆ దేశంలో పర్యటించడాన్ని ఆయనను ఒక రాజనీతిజ్ఞుడిలా చూపెడుతున్నాయని తెలిపారు. ముస్లింల సామూహిక హత్యలు, పోలీసుల ద్వారా న్యాయవ్యతిరేక హత్యలు, దేశం ప్రజాస్వామ్య సూచికలు, భారీ నిరుద్యోగం, అస్తవ్యవస్థ ...

5లో



### అందరి చూపు కర్నాటక వైపు..



**నేడే ఎన్నికల ఫలితాలు**

- ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- మధ్యాహ్నానికే పూర్తి ఫలితాలు?

బెంగళూరు : కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను శనివారం ప్రకటించనున్నారు. దేశ రాజకీయాల్లో కీలకమైన కర్నాటక ఎన్నికల వైపే అందరిదృష్టి కేంద్రీకృతమైంది. హంగ్ వస్తుందని, కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతుందని సర్వేలు వెల్లడించాయి. దీంతో ఇటు ...

5లో

### అదానీపై దర్యాప్తునకు సెబీకి గడువు పెంపు

**మూడు నెలలు అనుమతి ఇచ్చిన సుప్రీం**

- అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై నిపుణుల నివేదిక స్వీకరణ




నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

అదానీ గ్రూప్-హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వివాదంపై దర్యాప్తునకు గడువును మరో ఆరు నెలలు పొడిగించాలని సెబీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పార్దివాలాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. గడువును ఆరు నెలలపాటు పొడిగించలేమని ...

5లో

రాహుల్ గాంధీకి శిక్ష విధించిన
### జడ్జి పదోన్నతి నిలిపివేత..



**68 మంది న్యాయాధికారులకు జిల్లా జడ్జిలుగా పదోన్నతి చట్ట వ్యతిరేకం**

- నోటీసులు ఇచ్చాక కూడా గుజరాత్ ప్రభుత్వం ఉత్తర్వులు
- కేసు పెండింగ్‌లో ఉన్నదని తెలిసి కూడా పదోన్నతా..?
- బీజేపీ సర్కార్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం

వివరాలు 5లో..

## సీఎం గారూ.. మాట నిలబెట్టుకోండి

వీఆర్ఏ జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో హరగోపాల్

### ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- అండగా ఉంటాం..ప్రత్యక్ష కార్యాచరణలో పాల్గొంటాం : ప్రజా, కార్మిక, సామాజిక సంఘాల నేతల భరోసా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా వాగ్దానం చేశారు. ఉద్యమ కాలంలోనూ తెలంగాణ వస్తే కాంట్రాక్టు వ్యవస్థనే ఉండబోదని కేసీఆర్ అనేక సార్లు చెప్పారు. కానీ సీఎంగా తొమ్మిదేండ్ల కాలంలో ఇచ్చిన మాటను మర్చిపోయారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోతే విశ్వసనీయత కోల్పోతారు. వీఆర్‌ఏల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రజల మద్దతు ఉంటే ఎంతటి సమస్యయినా పరిష్కారం కావాల్సిందే. అందుకు తెలంగాణ ఉద్యమమే నిదర్శనం. ఏ ఒక్కరితో తెలంగాణ రాలేదు. ప్రజా ఉద్యమంతోనే సాధ్యమైంది' అని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వీఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆ సంఘం సెక్రటరీ జనరల్ దాదేమియ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమస్యను సర్పంచ్‌ల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం అంటే వీఆర్‌ఏ నుంచి సీఎం దాకా అని చెప్పారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో సీఎం, దేశంలో పీఎం చుట్టూనే పాలన ...

2లో

### పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణ

లండన్ ఇన్వెస్ట్‌మెంట్ రౌండ్‌టేబుల్‌లో మంత్రి కేటీఆర్



వివరాలు 2లో..

కలెక్టరేట్ ఎదుట
## రైతు ఆత్మహత్యాయత్నం

**పెద్దపల్లిలో ఘటన...విషమంగా ఆరోగ్యం**



నవతెలంగాణ-పెద్దపల్లి

తన సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఓ రైతు పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ధర్మారం మండలం ఖిలా వనపర్తికి చెందిన రామచంద్రారావు తన భూమి పత్రాల ఫోర్జరీ గురించి అధికారులకు తెలిపేందుకు కలెక్టరేట్‌కు వచ్చాడు. ఎంతసేపైనా అధికారులెవరూ తనను పట్టించుకోవడం లేదని ఆవేదన చెంది కార్యాలయం ఆవరణలో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని పోలీసులు, స్థానికులు పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్టు సమాచారం. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. అన్నదమ్ముల మధ్య భూ వివాదం ఉందని, ఇందులో భాగంగా పత్రాలను ఫోర్జరీ చేశారని రామచంద్రరావు ఆరోపిస్తున్నారు.

జేపీఎస్‌లకు నోటీస్
## ఉపసంహరించుకోవాలి

**వారి సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్**



నవతెలంగాణ-కంఠేశ్వర్

యూనియన్ పెట్టుకున్నందుకు.. సమ్మె చేస్తున్నందుకు జేపీఎస్‌లను తొలగిస్తామని ప్రభుత్వం ఇచ్చిన నోటీసును ఉపసంహరించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ ...

5లో

## మసక బారుతున్న బాల్యం

**శ్రమ దోపిడీ...హక్కుల ఉల్లంఘన**



చిన్నారులు ఆడుతూ పాడుతూ, తుళ్లుతూ కేరింతలు కొడుతూ ఆనందోత్సాహాలతో గడిపితేనే భవిష్యత్తులో మానవ వనరులు అభివృద్ధి చెందుతాయి. ఎల్లలు లేని మనోవికాశమే బాలల పురోభివృద్ధికి బాటలు వేస్తుంది. అయితే ఇప్పుడు ప్రపంచ దేశాలలో మనకు కన్పిస్తున్న దృశ్యం ఏమిటి ? వంద కోట్ల మంది బాలలు ఆటపాటలకు, చదువులకు దూరమయ్యారు. కార్మికులుగా మారిన వారి జీవితాలు మసక బారుతున్నాయి. మన దేశంలోనూ బాల కార్మికుల సంఖ్య అధికంగానే ఉండి కలవరపెడుతోంది. 2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్న లక్ష్యం నీరుకారిపోతోంది. పైగా ఆ లక్ష్యం చేరుకోలేనంత దూరంలో ఉండి పోయింది. ప్రస్తుతం దేశంలో 80 లక్షల మంది చిన్నారులు బాల కార్మికులుగా పని చేస్తూ అందమైన బాల్యాన్ని కోల్పోతున్నారు.

- పేదరికానికి సాక్షులుగా బాల కార్మికులు
- ఉచిత, నిర్బంధ విద్య ఎక్కడ ?

న్యూఢిల్లీ:బాల కార్మిక వ్యవస్థ చిన్నారుల శ్రమను దోచుకునేందుకు, వారి హక్కులను హరించేందుకు దోహదపడటమే గాక.. సామాజిక న్యాయానికీ అవరోధంగా మారింది. బాలలు గౌరవప్రదంగా జీవించే హక్కును కాలరాస్తోంది. మన దేశంలో 1986, 2016 సంవత్సరాలలో బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టాన్ని, 2009లో విద్యా హక్కు చట్టాన్ని రూపొందించినప్పటికీ దేశంలోని బాలలు అక్రమ రవాణాకు గురవుతూనే ఉన్నారు. విద్యకు దూరమై నిరక్షరాస్యులుగా మిగులుతున్నారు. వారి శారీరక-మానసిక ఆరోగ్యం బలహీనమవుతోంది.

చిన్నారులు అందమైన బాల్యాన్ని కోల్పోవడంతో భవిష్యత్తులో నాణ్యమైన మానవ వనరుల పెట్టుబడిని రాబట్టే విషయంలో రాజీ పడాల్సి వస్తోంది.

భారత్‌లో బాల కార్మికుల సంఖ్య ప్రస్తుతం అనేక దేశాల జనాభాను దాటి పోయింది. కైలాష్ సత్యార్థి ఫౌండేషన్, 2011 జనాభా లెక్కల అంచనాల ప్రకారం 2023 నాటికి దేశంలో సుమారు 78 లక్షల మంది బాల కార్మికులు ఉన్నారు. వీరిలో 57 శాతం మంది బాలలు కాగా మిగిలిన 43 శాతం మంది బాలికలు. 2021లో జనాభా లెక్కల సేకరణ జరగకపోవడంతో బాల కార్మికుల కచ్చితమైన సంఖ్య తెలియడం లేదు.

**పేదరికమే కారణం**

దేశంలో పేదరికం ఎక్కువగా ఉందనడానికి ప్రత్యక్ష సాక్షులు బాల కార్మికులే. వీరు అల్పాదాయ కుటుంబాలలో మనకు కన్పిస్తుంటారు. ఒక పిల్లవాడు బాల కార్మికుడిగా మారితే అతని తదుపరి తరం కూడా పేదరికంలో మగ్గాల్సి వస్తోంది. వీరు విద్య, ఆరోగ్యం, సామాజిక-ఆర్థిక అవకాశాలు వంటి ...

2లో

ప్రపంచ గమనం

# అమెరికా ఆజ్యంతో మండుతున్న ఉక్రెయిన్ రావణ కాష్టం!

నెల్లూరు నరసింహారావు



సోవియట్ పతనం తర్వాత ఇక నాటో అవసరం ఉండదని అందరూ అనుకున్నారు. అయితే నాటో మెల్లమెల్లగా రష్యా చుట్టూ విస్తరించనారంభించింది. మొదటి విస్తరణ బిల్ క్లింటన్ కాలంలో 1999లో జరిగింది. చెక్ రిపబ్లిక్, హంగరి, పోలెండ్ నాటోలో చేరాయి. రెండవ విస్తరణ 2004లో జరిగింది. బల్గేరియా, ఇస్టోనియా, లత్వియా, లిథ్యూనియా, రుమేనియా, స్లొవేకియా, స్లొవేనియా దేశాలు నాటోలో చేరాయి. ఇలా నాటో తమ దేశం చూట్టూ విస్తరించటంపట్ల రష్యా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. అయినా.. రష్యా హెచ్చరికలను అమెరికా నాయకత్వంలోని పశ్చిమ దేశాలు పెడచెవిన పెట్టాయి. రష్యన్లు గణనీయంగా నివసించే రష్యా పొరుగుదేశాలైన ఉక్రెయిన్, జార్జియాలను కూడా తమ కూటమిలో చేర్చుకోవాలని వచ్చిన ప్రతిపాదనలను గమనంలోకి తీసుకున్నామని నాటో కూటమి దేశాలు 2008లో ప్రకటించాయి. అలా ఉక్రెయిన్, జార్జియా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం రోజురోజుకూ పెరగటం మొదలైంది. 2008లో జార్జియా నుంచి వేరుపడదలచిన ప్రాంతాలకు రష్యా మద్దతిచ్చింది. అలా జార్జియాను కట్టడిచేసి రష్యా తన వైఖరిని చెప్పకనే చెప్పింది. అలాగే ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరితే ఆ దేశం మిగలదని పుతిన్ హెచ్చరించారు. అయినప్పటికీ అమెరికా జోక్యం ఆగలేదు. 2014 ఫిబ్రవరిలో ప్రజలచేత ఎన్నుకోబడిన, రష్యా అనుకూల ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యానుకోవిచ్‌ను అమెరికా కుట్రపన్ని కూలదోసింది. అలా అమెరికా, ఐరోపా దేశాలు ఆలోచనారహితంగా రష్యా సరిహద్దులోని ఉక్రెయిన్‌ను తమ బలమైన స్థావరంగా మార్చుకునే ప్రయత్నం చేశాయి. దానికి ప్రతీకారంగా పుతిన్ క్రిమియాను స్వాధీనం చేసుకున్నారు.

ప్రస్తుతం అమెరికా అనాలోచిత చర్యల పర్యవసానాన్ని మనం చూస్తున్నాం. జార్జియా, ఉక్రెయిన్‌లను నాటోలో చేర్చుకోవటమంటే అది రష్యా అస్థిత్వాన్ని ప్రశ్నించటమే అవుతుందని పుతిన్ ప్రకటించారు. రష్యా ఇంతగా నిరసన తెలుపుతున్నా 2009లో అల్బేనియా, క్రొయేషియాలను కూడా నాటోలో చేర్చుకున్నారు. 2013కు ముందు అమెరికా ఉక్రెయిన్‌లోని వివిధ శక్తులను తనవైపు తిప్పుకోవటానికి కనీసం 5బిలియన్ డాలర్లను వెచ్చించింది. 2014లో ప్రజలచేత ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన విక్టర్ యానుకోవిచ్‌ను అమెరికా కుట్రపూరితంగా కూలదోసి పచ్చి రష్యా వ్యతిరేక ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చింది. దీనితో ఉక్రెయిన్‌కు వ్యతిరేకంగా రష్యా నిర్ణయాత్మకంగా వ్యవహరించవలసి వచ్చింది. క్రిమియాను స్వాధీనం చేసుకోవాలని పుతిన్ తన సైన్యాన్ని ఆదేశించాడు. ఆ తరువాత దాన్ని రష్యాలో విలీనం చేశాడు. రష్యన్లు గణనీయంగా నివసించే తూర్పు ఉక్రెయిన్‌లో చెలరేగిన తిరుగుబాటుకు రష్యా తన మద్దతునిచ్చింది.

ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న స్థితిలో, అమెరికా మద్దతుతో సైనికంగా బలోపేతమౌతున్న నేపథ్యంలో 2022 ఫిబ్రవరి 24న ఉక్రెయిన్ పైన సైనిక చర్య పేరుతో రష్యా యుద్ధాన్ని ప్రకటించింది. ఈ యుద్ధాన్ని ఎటువంటి కారణంలేకుండా రష్యా ప్రకటించిందని పశ్చిమ దేశాల మీడియా ఊదరగొట్టింది. అయితే నాటో సెక్రటరీ జనరల్, జెన్స్ స్టోల్టెన్ బర్గ్ వాషింగ్టన్ పోస్టుకు మంగళవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన విషయాలు వాస్తవాలను బయటపెట్టాయి. ఆయన ఇలా చెప్పాడు: "ఉక్రెయిన్ యుద్ధం 2022లో ప్రారంభం కాలేదు. అది 2014లోనే మొదలైంది. అప్పటినుంచి నాటో కూటమి దేశాలు తమ రక్షణ బడ్జెట్లను పెంచుకున్నాయి". అంటే ఉక్రెయిన్ యుద్ధం 2022 ఫిబ్రవరిలో రష్యా సైనిక చర్యతో ప్రారంభం కాలేదు. అది ఎనిమిదేండ్లకు ముందే 2014లో ప్రారంభమైంది.

స్టోల్టెన్ బర్గ్ 2014లోనే ఉక్రెయిన్ యుద్ధం మొదలైందని చెప్పారుకానీ, అది ఎలా మొదలయిందో వివరించలేదు. ఇంతకుముందే చెప్పినట్టు ఉక్రెయిన్ ప్రజలచేత అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన విక్టర్ యానుకోవిచ్ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రష్యా వ్యతిరేక ఫాసిస్టు శక్తులను ఎగదోయటానికి అమెరికా 5బిలియన్ డాలర్లకు పైగా వెచ్చించిదని అమెరికా సహాయ విదేశాంగ కార్యదర్శి విక్టోరియా న్యూలాండ్ గొప్పగా చెప్పుకున్నారు. ఆ తర్వాత అధ్యక్షుడైన పెట్రో పొరొషెన్కో రష్యన్లు గణనీయంగావుండే తూర్పు ఉక్రెయిన్‌లో దమనకాండను సాగించి 14,000 మంది రష్యన్ మాట్లాడే ప్రజల మరణాలకు కారకుడయ్యాడు. ఈ చర్య రష్యా అస్థిత్వానికి సవాలు విసిరే చర్య తప్ప మరొకటి కాదు. ఈ చర్యలన్నీ క్రిమియాలోని సెవాస్టొపోల్ రేవులోగల రష్యా నల్ల సముద్ర నౌకాదళాన్ని తరలించి దాన్ని అమెరికా నౌకాదళ స్థావరంగా మార్చాలనే కుట్రవున్నట్టు రష్యా భావించింది. అటువంటి చర్యను నిర్వీర్యం చేయటానికి రష్యా క్రిమియాను ఒక రిఫరెండం ద్వారా తనలో కలుపుకుంది.

ఉక్రెయిన్ యుద్ధంలో ఇప్పటికే ఇరువైపులా లక్షలాదిమంది మరణించారు. ఒక కోటిమందికి పైగా ఉక్రెయిన్ ప్రజలు కాందిశీకులుగా మారి వివిధ దేశాలలో తలదాచుకుంటున్నారు. అయినా వందలాది బిలియన్ల సాయుధ, ఆర్థిక సహాయంతో అమెరికా నాయకత్వంలోని నాటో కూటమి దేశాలు యుద్ధాన్ని ఎగదోస్తున్నాయి. రష్యామీద దాడిచేయటానికి దాదాపు 50వేల ఉక్రెయిన్ సైన్యానికి పశ్చిమ దేశాలు శిక్షణనిచ్చాయి. ఉక్రెయిన్ వెంటనే రష్యాపైన దాడి చెయ్యాలని అమెరికా వత్తిడి తెస్తోందని న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్టు ఇటీవల రాశాయి. అయితే ఉక్రెయిన్ చేయబోయే ప్రతిదాడి ప్రభావం పైనే ఉక్రెయిన్ భవిత ఆధారపడివుంది. 'తమ ప్రతిదాడిపైన ప్రపంచంలో అతి అంచనాలున్నాయి... ఇది నిరాశకు దారితీసే అవకాశం ఉంది. 'విజయం' అనేది మహా అయితే ఒక 10కిలోమీటర్ల భూభాగాన్ని తిరిగిపొందటంగా ఉండొచ్చు"అని ఉక్రెయిన్ రక్షణ మంత్రి, ఒలెక్సీ రెజ్నికోవ్ వాషింగ్టన్ పోస్టుకు చెప్పారు.

ఏదైనా జరిగి ఉక్రెయిన్ చేయనున్న ప్రతిదాడి విఫలమైతే (విఫలమయ్యే అవకాశాలే ఎక్కువ) ఉక్రెయిన్‌కు మరో అవకాశం ఉండదని చెక్ రిపబ్లిక్ అధ్యక్షుడు పెట్ర పావెల్ గార్డియన్‌తో మాట్లాడుతూ అన్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు బైడెన్ తన పరువు, ప్రతిష్టనంతా ఈ యుద్ధాన్ని గెలవటంపైనే పెట్టారు. అమెరికా, నాటో దేశాలు ప్రత్యక్షంగా రష్యాతో తలపడకుండా పరోక్షంగా ఉక్రెయిన్‌తో దాడిచేయించి రష్యాను గెలవలేవని అందరికీ తెలిసిపోయింది. అదే జరిగితే మానవాళి భవితను ప్రశ్నార్థకంచేసే మూడవ ప్రపంచ యుద్ధం ఆరంభమైనట్టే!

## 15 నుంచి ఇంటర్ ప్రవేశాలు

- జూన్ 1 నుంచి ప్రథమ సంవత్సరం తరగతులు
- అడ్మిషన్లకు తుది గడువు 30
- షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం విడుదల చేశారు. ఈనెల 15వ తేదీ (సోమవారం) నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మొదటివిడత ప్రవేశాల ప్రక్రియ జూన్ 30వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమ వుతాయని వివరించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కూడా అదే రోజు నుంచి తరగతులు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. రెండో విడత ప్రవేశాల ప్రక్రియ తేదీలను తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇంటర్‌నెట్ మార్కుల మెమోతో ఇంటర్‌లో ప్రవేశం పొందొచ్చని సూచించారు. కాలేజీలో చేరిన తర్వాత ఎస్‌ఎస్‌సీ ఒరిజినల్ మెమో, టీసీ ఇవ్వాలని కోరారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు పది శాతం, బీసీలకు 29 శాతం (ఏ-7, బీ-10, సీ-1, డీ-7, ఈ-4), వికలాంగులకు మూడు శాతం, ఎన్‌సీసీ, క్రీడాకారులకు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ వారికి ఐదు శాతం, ఎక్స్ సర్వీస్‌మెన్, రక్షణ శాఖలో పనిచేసిన వారి పిల్లలకు మూడు శాతం, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈడబ్ల్యూఎస్)కు పది శాతం చొప్పున ఇంటర్ ప్రవేశాల్లో రిజర్వేషన్లుంటాయని తెలిపారు. అన్ని కేటగిరీల్లోనూ అమ్మాయిలకు 33 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఇంటర్ ప్రవేశాలకు విద్యార్థుల ఆధార్ నెంబర్ తప్పనిసరి అని తెలిపారు.

# పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణ

## లండన్ ఇన్వెస్ట్‌మెంట్ రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయ గమ్యస్థానమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. లండన్ పర్యటనలో ఉన్న ఆయన భారత హైకమిషనర్ విక్రం కె.దురైస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్‌మెంట్ రౌండ్ టేబుల్ సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన పలు కంపెనీల ప్రతినిధులు, ఇతరులకు తెలంగాణలోని పెట్టుబడి అవకాశాల గురించి వివరించారు. రాష్ట్రంలో ప్రాథమిక సమస్యలన్నింటిపై దృష్టి సారించి, వాటి పరిష్కారానికి ప్రయత్నించామని అన్నారు. అనంతరం ఇన్నోవేషన్, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపైన తొమ్మిదేండ్లుగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.

ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించి వ్యవసాయ రంగం, ఐటీ నుంచి మొదలుకుని అన్ని రంగాల్లో రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధ్యమైందని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వేగవంత మైందని వెల్లడించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో అనుమతుల విధానం గురించి ప్రత్యేకంగా మంత్రి కేటీఆర్ ప్రస్తావించారు. అత్యంత వేగంగా, పారదర్శకంగా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే ఈ విధానం ఇప్పటికే అనేక ప్రశంసలను అందుకుందని, ఫలితాలను ఇచ్చిందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో టెక్నాలజీ ఆధారిత కంపెనీల పెరుగుదలతో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఫుడ్ ప్రాసెసింగ్, మొబిలిటీ, టెక్స్‌టైల్ వంటి రంగాలలో ఉన్న పెట్టుబడి అవకాశాలను కేటీఆర్ వివరించారు. హైదరాబాద్ నగరంలో ఉన్న ఇన్నోవేషన్ ఎకో సిస్టం, పరిశోధనా సంస్థలు, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలతో ఆయా రంగాల్లో అభివృద్ధి వేగంగా కొనసాగుతున్నదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యూకే విద్యాసంస్థలు కింగ్స్ కాలేజ్, క్రాన్ ఫీల్డ్ యూనివర్సిటీ వంటి ప్రసిద్ధ సంస్థలతో చేసుకున్న భాగస్వామ్యాల ఏర్పాటును ప్రస్తావించారు. రాష్ట్రానికి పెట్టుబడులతో ముందుకు రావాలని, అలాంటి సంస్థలకు సహకరించేందుకు సంసిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఇండియన్ హై కమిషనర్ విక్రమ్ కే దురైస్వామి మాట్లాడుతూ హెవీమిషనరీ, ఏవియేషన్, డిఫెన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎడ్యుకేషన్ వంటి రంగాల్లో యూకే కంపెనీలతో భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలను వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, విభిన్న సంస్కృతుల సమ్మేళనమైన తెలంగాణ.. పెట్టుబడులు పెట్టేందుకు ఒక అద్భుతమైన గమ్య స్థానమని తెలిపారు. తొమ్మిదేండ్లలో సాధించిన అద్భుతమైన ప్రగతిని బ్రిటిష్ భారత వ్యాపారవేత్త కరెంట్ బిల్లీమోరియా ప్రస్తావించారు. నూతన సచివాలయం, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహం వంటి వాటిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రగతి, ముఖ్యంగా ఆర్థిక ప్రగతి, సంపద సృష్టి వంటి అంశాలను వివరించారు. తన సొంత రాష్ట్రం తెలంగాణ ఎదుగుతున్న తీరుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, తెలంగాణ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఎన్నారై అఫైర్స్ ప్రత్యేక కార్యదర్శి ఈ.విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

### లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ ఆధ్వర్యంలో టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా కొనసాగుతున్న మంత్రి కేటీఆర్ పర్యటన విజయవంతంగా ప్రారంభమైంది. హైదరాబాద్ నగరంలో టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని ఏర్పాటు చేసేందుకు లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ముందుకొచ్చింది. ఈ కేంద్రం ఏర్పాటుతో సుమారు 1000 మందిని ఈ ఏడాది చివరి నాటికి నియమిం చుకోనున్నట్టు సంస్థ తెలిపింది. మంత్రి, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ సీఐఓ అంతోని మేక్ కార్తీతో జరిగిన సమావేశం అనంతరం ఈ విషయాన్ని ప్రకటిం చారు. హైదరాబాద్‌లో టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సంబంధించిన ఒక అవగాహన ఒప్పందాన్ని పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ రాష్ట్ర ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్స్, ఎన్నారై అఫైర్స్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, అంతోనీ మెక్‌కార్తీ మధ్య మంత్రి కేటీఆర్ సమక్షంలో జరిగింది. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేసే టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెంట్ ద్వారా హైదరాబాద్ నగరంలోని బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగానికి అద్భుతమైన ఊతం లభించనుంది. ఈ రంగంలో హైదరాబాద్ నగరంలో మరిన్ని ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించనుంది. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ ప్రపంచంలో 70 దేశాలలో ఫైనాన్షియల్ మార్కెట్ రంగంలో కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. 190 దేశాల్లోని తన ఖాతాదారులకు సేవలను అందిస్తున్నది. తన విస్తతమైన కార్యకలాపాలతో ప్రపంచంలోని ఫైనాన్షియల్ సేవారంగంలో దిగ్గజ సంస్థగా లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ ఒకటిగా నిలిచింది.

# సీఎం గారూ.. మాట నిలబెట్టుకోండి

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రీకృతమైందని అన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో వీఆర్‌ఏల సమస్య కచ్చితంగా రాజకీయ ఎజెండా అవుతుందని, ఆ దిశగా వారు తమ ఉద్యమాన్ని కొనసాగించాలని కోరారు. అన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు కూడా వీఆర్‌ఏలకు అండగా ఉండాలని సూచించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులు 40వేలు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు 80వేల మంది ఉన్నారంటూ అసెంబ్లీలో సీఎం లెక్కలు చెప్పారని గుర్తుచేశారు. కానీ 11వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులే ఉన్నారంటూ జీఓ నెం.16 జారీచేశారని, కానీ 5544 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ సీఎం ఫైల్ మీద సంతకం చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో జేపీఎస్‌ల సమ్మె, వీఓఏల సమ్మెతోపాటు వీఆర్‌ఏలు కూడా సమ్మె చేయడానికి సిద్ధమవుతున్నారంటే ఈ ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగులను ఏండ్లుగా మోసం చేస్తుందనేది విదితమవుతున్నదని అన్నారు. 75 షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల కనీసవేతనాలకు సంబంధించిన జీఓలను ఎనిమిదేండ్ల నుంచి పెండింగ్ పెట్టారని గుర్తుచేశారు. తెలంగాణ వస్తే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని కంపెనీల్లో అన్ని జెండాలు పీకేసి గులాబి జెండాలనే పెట్టారని, కానీ కంపెనీల కార్మికులకు ఎర్రజెండానే దిక్కయిందని అన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ కంపెనీలకు నీళ్లు, నిధులు కేటాయిస్తున్నారని, కార్మికులను మాత్రం మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వీఆర్‌ఏల సమ్మెకు ఉద్యోగ సంఘాలు, ఎన్‌జీఓ సంఘాలు, ట్రెసా ఎందుకు మద్దుతివ్వడంలేదని ప్రశ్నించారు. వీఆర్‌ఏల ఐక్యత, ప్రజల మద్దతుతో ప్రభుత్వం మెడలు వంచేదాకా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ జేపీఎస్‌లు సమ్మె చేస్తే ప్రభుత్వం స్పందించకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నదని అన్నారు. కనీస వేతనాల కోసం కార్మికులు, ఉద్యోగులు పోరాటాలు చేసినా పట్టించుకోని ప్రభుత్వం ఎమ్మెల్యేలు ఏం పోరాటం చేశారని వేతనాలు పెంచిందని ప్రశ్నించారు. జేఏసీ కో-కన్వీనర్ వంగూరు రాములు మాట్లాడుతూ 80రోజుల సమ్మె కారణంగా 75మంది వీఆర్‌ఏలు ఆత్మహత్య చేసుకున్నారని, కొంత మంది అనారోగ్యంతో చనిపోయారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని అన్నారు. ఆ కుటుంబాలను ఆదుకునే దిక్కులేక రోడ్డున పడ్డాయని అన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పాలడుగు సుధాకర్, రైతు సంఘం సహాయ రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్, జేఏసీ కో-కన్వీనర్లు వెంకటేష్, మాధవనాయుడు, టీఎన్‌టీయూసీ నాయకులు ప్రసాద్, ఏఐయూటీయూసీ నాయకులు ఆంజనేయులు, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ, జేఏసీ కో-కన్వీనర్లు రఫి, నాయకులు బి.రాములు, చందు, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమ కార్యాచరణ

వీఆర్‌ఏల పోరాటాన్ని ఉధృతం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. గ్రామాల్లోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రజా, కార్మిక, సామాజిక సంఘాలను కలుపుకుని ప్రజా ఉద్యమంగా మార్చాలని నిర్ణయించింది.

- ఈనెల 18న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో కుటుంబ సభ్యులతో ప్రదర్శనలు, స్థానిక ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేయాలి.
- 25న అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ ప్రదర్శనలు చేసి కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేయాలి. అన్ని ఉద్యోగ, ప్రజా, కార్మిక, సామాజిక సంఘాలను ఆహ్వానించాలి.
- 30న చాలో హైదరాబాద్‌లో భాగంగా సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద ధర్నా చేయాలి. అన్ని జిల్లాల్లోని వీఆర్‌ఏలు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలి.

# మసక బారుతున్న బాల్యం

(మొదటిపేజీ తరువాయి)

విషయాలలో రాజీ పడాల్సి వస్తోంది. జీవితంలో ఎన్నో అవకాశాలను కోల్పోవాల్సి వస్తోంది. సమాన అవకాశాల విషయంలో బాలలకు ఉండే హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయి. శ్రమ దోపిడీ పెరుగుతోంది. సామాజిక న్యాయం, స్వేచ్ఛా జీవనం కలగా మిగిలిపోతున్నాయి.

### అమలుకు నోచుకోని నిర్బంధ విద్య

భారత రాజ్యాంగం ప్రకారం 6-14 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించాల్సి ఉంటుంది. చిన్నారులు పేదలైనా, ధనికులైనా విద్యకు దూరం కాకూడదన్నదే దీని ప్రధాన ఉద్దేశం. అయితే అది అమలుకు నోచుకోవడం లేదు.

ఫలితంగా బాల కార్మికుల సంఖ్య పెరుగుతోంది. వారి ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోంది. పైగా బడి పిల్లలకు ఉచితంగా బట్టలు, ఆహారం, ఇతర అవసరాలను సమకూర్చడంలో కూడా వైఫల్యం కన్పిస్తోంది. విద్యా రంగంలో పురోభివృద్ధి సాధించామని చెప్పుకుంటున్నప్పటికీ పిల్లలు పెద్ద సంఖ్యలో మౌలిక విద్యకు దూరమవుతున్నారు.

### కోరలు లేని చట్టాలు

మరోవైపు దేశంలో బాల కార్మిక చట్టాలు కోరలు తీసిన పాము చందం గా తయారయ్యాయి. ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ఉపయో గపడడం లేదు. 1986లో వచ్చిన చట్టంతో పోలిస్తే 2016లో వచ్చిన కొత్త చట్టం విద్యా హక్కుకు భంగం కలిగించే ఏ విధమైన పనినీ బాలలతో చేయించరాదని నిర్దేశిస్తోంది. అయితే ఈ చట్టంలో అస్పష్టతలు కన్పిస్తు న్నాయి. బాలలతో పని చేయించడానికి కనీస వయసును ఇందులో నిర్ణయిం చలేదు. ప్రమాదకరమైన వృత్తిలో బాలలు ఉపాధి పొందడాన్ని నిషేధించ లేదు. కుటుంబ పనులలో వారిని భాగస్వాములను చేయడంపై కూడా ఎలాంటి ఆంక్షలు విధించలేదు. దీంతో ఈ చట్టం అమలు ఓ అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. దేశంలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపే విషయంలో చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నాలు లోపించాయని అర్ధమవుతోంది. బాలలకు గౌరవ ప్రదమైన జీవనాన్ని అందిరలేని దేశాన్ని విఫల జాతిగా అభివర్ణించాల్సి ఉంటుంది. ఎనభై లక్షల మంది బాలల ప్రాథమిక హక్కులకు భంగం వాటిలుతున్న నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారానికి దేశంలోని అన్ని విభాగాలు నడుం బిగించాల్సిన అవసరం ఉంది. యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలంటే ముందుగా బాల కార్మికులను గుర్తించాలి. అన్ని విభాగాలు జోక్యం చేసుకొని, అవసరమైన చర్యలు చేపట్టాలి. చిన్నారులకు మంచి జీవనాన్ని అందించినప్పుడే దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుంది.

# రెజ్లర్లకు మద్దతుగా 18న దేశవ్యాప్త ఆందోళన

## ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ లైగింక వేధింపులకు వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు మద్దతుగా ఈనెల 18న దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. శుక్రవారం ఏపీ, తెలంగాణ భవన్‌లో బి. వెంకట్ మీడియాతో మాట్లాడారు. రెజ్లర్లకు మద్దతుగా ఈనెల 18 నుంచి ఏఐఏడబ్ల్యూయూ, సీఐటీయూ, ఐద్వా, ఎస్‌ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ తదితర సంఘాలతో దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని అన్నారు.జంతర్ మంతర్ లో మహిళా రెజ్లర్లు ఆందోళన చేస్తున్నారని, ఇది మోడీ ప్రభుత్వానికి సిగ్గు చేటని అన్నారు. డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనపై రెజ్లర్లు లైంగిక ఆరోపణలు చేస్తున్నారని, బ్రిజ్ భూషణ్ ను ఎంపీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

### ఏపీ హైకోర్టు తీర్పు హర్షణీయం

జీవో నంబర్ 1ని రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు గొప్ప తీర్పు ఇచ్చిందని, ఈ తీర్పును ఏఐఏడబ్ల్యూ యూ స్వాగతిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని చాలా స్పష్టంగా కోర్టు చెప్పిందని అన్నారు. బ్రిటిష్ పాలనలో జాతీయ ఉద్యమాన్ని ఆపేందుకు తీసుకొచ్చిన జీవోను జగన్ అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు సభ పెట్టుకునే హక్కునూ కాలరాస్తున్నారని అన్నారు. జగన్ సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జీవో నంబర్ 1 సమయంలో చాలా మంది నేతల పై కేసులు పెట్టారని, వాటిని ప్రభుత్వం ఉపసహంరించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 1 విషయంలో జగన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఏపీకి జగన్ వల్లే రాజధాని కూడా లేకుండా పోయిందని, అమరావతే రాజధాని అని జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని లేక రైతులు ఆందోళన చేస్తున్నారని, రైతుల ఉసురు తీయొద్దని హితవు పలికారు. ఎవరైనా మీటింగ్ పెట్టుకుంటే అవి పెట్టకుండా పోలీసులు కేసులు పెడుతున్నారని, ఈ హక్కు ఎవరు ఇచ్చారని విమర్శించారు. ప్రజలను రోడ్ల పైకి రానివ్వడం లేదని, జగన్‌ను ఇలానే తిరగనివ్వకపోతే ఇప్పుడు ఇలా ఉండేవారా? అని ప్రశ్నించారు. రైతులు అకాల వర్షాల వలన ఇబ్బందులు పడుతున్నారని, అకాల వర్షాలతో పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవడానికి కేంద్రం ముందుకు రావాలని కోరారు.

# యాసంగి జొన్నకూ మద్దతు ధర

- ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది : సీఎం కేసీఆర్

నవతెలంగాణ- హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పండిన యాసంగి జొన్న పంటకు మద్దతు ధర చెల్లించి రాష్ట్ర ప్రభుత్వమే సేకరించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మార్క్ ఫెడ్‌ను రాష్ట్ర నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం నియమించింది. 2022-23 యాసంగి సీజన్లో పండించిన జొన్న(హైబ్రిడ్) పంటకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు సంబంధించి మార్క్ ఫెడ్ యండీ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. యాసంగి సీజన్లో పండిన మొత్తం 65,494 మెట్రిక్ టన్నుల జొన్న పంటను కొనుగోలు చేసేందుకు కావాల్సిన రూ.219.92 కోట్ల రూపాయలకు రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీ ఇవ్వనుంది. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామరెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట్, గద్వాల్ జిల్లాల పరిధిలో జొన్న పంటను పండించిన దాదాపు లక్షమంది రైతులకు లబ్ది చేకూరనుంది.

# జేపీఎస్‌లను చర్చలకు పిలిచేది లేదు : సీఎస్

నవతెలంగాణ- హైదరాబాద్ బ్యూరో

జేపీఎస్‌ల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. వారిని చర్చలకు పిలిచేది లేదని సీఎస్ శాంతికుమారి స్పష్టం చేశారు. విధుల్లో వున్న జేపీఎస్‌ల జాబితాను శనివారం మధ్యాహ్నంలోపు పంపాలంటూ కలెక్టర్‌ను ఆమె ఆదేశించారు. సమ్మె విరమించని వారితో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, వారి స్థానంలో తాత్కాలిక కార్యదర్శులను నియమించాలని సూచించారు. ఏ గ్రామంలో అయితే సెక్రటరీలు విధులకు హాజరుకాలేదో అదే గ్రామానికి చెంది.. డిగ్రీ పూర్తిచేసి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారిని తాత్కాలిక ప్రాతిపదికన సెక్రెటరీలుగా నియమించాలని సీఎస్ కలెక్టర్లను ఆదేశించారు.

# ధాన్యం కొనుగోలుకు కేంద్ర నిబంధనలు అడ్డు

- పౌరసరఫరాలశాఖ కమిషనర్ అనిల్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ధాన్యంలో 17 శాతంపైగా తేమ ఉంటే కొనుగోలుకు కేంద్ర నిబంధనలు అడ్డుగా ఉన్నాయని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి జాప్యానికి ఆస్కారం లేకుండా 7,175 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గతేడాది కన్నా 7.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా కొనుగోలు చేసినట్టు స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన 19.62 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 18.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే రైస్ మిల్లులకు తరలించినట్టు పేర్కొన్నారు.

# ఆస్తుల విభజనపై కౌంటర్ దాఖలు చేయండి

- తెలంగాణ, కేంద్ర ప్రభుత్వాలకు సుప్రీం కోర్టు ఆదేశం
- నాలుగు వారాలు గడువు

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజనకు సంబంధించి విశ్రాంత న్యాయమూర్తితో కమిటీ వేయాలని సుప్రీంకోర్టుకు ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. కేంద్రం అభిప్రాయం తెలుసు కున్న సుప్రీంకోర్టు ఈ అంశాన్ని పరిశీలి స్తామని పేర్కొంది. రూ.1,42,601 కోటకు సంబంధించి ఆస్తుల విభజనపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. గత విచారణ సందర్భంగా నోటీసులు ఇచ్చి ఐదు నెలలు గడిచినా తెలంగాణ ప్రభుత్వం ఇంకా కౌంటరు దాఖలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించగలదా అని అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) నటరాజన్‌ను అడిగిన ధర్మాసనం, కౌంటరు ఎందుకు దాఖలు చేయలేదని తెలంగాణ తరపు న్యాయవాదిని ప్రశ్నిం చింది. చివరి అవకాశంగా నాలుగు వారాలు గడువు ఇవ్వాలని తెలంగాణ న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. ఆస్తుల విభజన విభజన చట్టంలోని అంశమని, విభజన చట్టంలోని షెడ్యూల్ 9,10ల్లో ఉన్న సుమారు రూ.1.42 లక్షల కోట్లు విభజించకపోవడం సరికాదని సింఘ్వి పేర్కొన్నారు.

# 18న హైద్రాబాద్‌లో ఇండ్ల స్థలాల కోసం జర్నలిస్టుల 'మహాధర్నా'

## టీడబ్ల్యూజేఎఫ్ ఆఫీసు బేరర్ల నిర్ణయం

**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్**

ఇండ్ల స్థలాల కోసం ఈనెల 18 (గురువారం)న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జర్నలిస్టుల "మహాధర్నా " నిర్వహించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం అన్‌లైన్‌లో జరిగిన రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం తీర్మానం చేసింది. ఈ ధర్నాలో అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొనాలని పిలుపునిచ్చింది. హైదరాబాద్‌తో పాటు మేడ్చల్ -మల్కాజ్‌గిరి , రంగారెడ్డి , వికారాబాద్ , యాదాద్రి - భువనగిరి , సూర్యాపేట , నల్లగొండ ,వరంగల్ , మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో జర్నలిస్టులను ఎక్కువగా సమీకరించనున్నట్టు ప్రకటించింది. మహాధర్నా ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందనీ, సాయంత్రం 4 గంటలకు ముగుస్తుందని తెలియజేసింది. రాష్ట్రంలోని ఫెడరేషన్ అన్ని జిల్లా కమిటీలు మహాధర్నాను విజయవంతం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ ఆన్‌లైన్ ఆఫీసు బేరర్ల సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కె. వెంకటేశ్ అధ్యక్షత వహించగా ఇతర ఆఫీసు బేరర్లు ఇ చంద్రశేఖర్, వై. ప్రభాకర్, ఎస్.కె సలీమ, బి. జగదీశ్, బి. రాజశేఖర్, గుడిగ రఘు, కె. నిరంజన్, వి. జగన్. టి. శ్రీనివాస్, పి. భిక్షపతి, బి. దయాసాగర్, కె.అనిల్‌రెడ్డి, టి.కృష్ణ, ఆర్.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా జర్నలిస్టులు ఇండ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా జాప్యం చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఇండ్లస్థలాల పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇండ్లస్థలాల సాధన కోసం రెండు నెలలుగా నాలుగు దశల కార్యక్రమాన్ని ఫెడరేషన్ చేపట్టిందని గుర్తు చేశారు. తొలి దశలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టుల సంతకాల సేకరణ, రెండో దశలో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందజేసినట్టు చెప్పారు. మూడో దశలో అన్ని జిల్లాల కలెక్టరేట్లు, జిల్లా కేంద్రాల్లో రిలే దీక్షలు చేపట్టినట్టు వివరించారు. నాలుగో దశలో హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టినట్టు తెలిపారు. ఈకార్యక్రమానికి భారీగా జర్నలిస్టులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు సేవలందించే వారికి శిక్షలా....?

## అంతర్జాతీయ నర్సుల దినోత్సవంలో సుజావతి



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ప్రజలకు సేవలందించిన నర్సులను శిక్షిస్తారా? అంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని రిటైర్డ్ నర్సుల నాయకురాలు సుజావతి ప్రశ్నించారు. ప్రధానమంత్రి మన్ కీ బాత్ వినలేదంటూ 30 మంది నర్సింగ్ విద్యార్థులకు శిక్ష విధించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. మోడీ సర్కార్ నియంతృత్వంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రిటైర్డ్ నర్సులు సుజావతి, విశ్వశాంతి తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వేడుకలను నిర్వహించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ 203వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి సుజావతి మాట్లాడుతూ పీఆర్సీ, పీఆర్సీకి మధ్య చాలా గడువు ఉంటుండంతో తమ సర్వీసుల్లో ఒక పీఆర్సీ కోల్పోయినట్టు తెలిపారు. ఇప్పటికే వేయాల్సిన పీఆర్సీ ఆలస్యమైందనీ, దాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏండ్ల తరబడి ప్రభుత్వ సేవలందించిన తమకు నగదురహిత ఉచిత వైద్యసేవలనందించాలని డిమాండ్ చేశారు.

### అమ్మకు కలలుంటాయి....

నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రదర్శించిన 'అమ్మకు కలలుంటాయి...' అనే డాక్యుమెంటరీ ఆకట్టుకుంది. పదవీ విరమణ పొందిన వారికి కూడా అవసరాలు, కోరికలుంటాయనీ, వాటిని గుర్తించాలనే సందేశం ఆకట్టుకుంది. ఇద్దరు తల్లులు ప్రధాన పాత్రలుగా ఉన్న ఈ డాక్యుమెంటరీ ఆహుతులను ఆకట్టుకుంది.

### నైటింగేల్ బయోగ్రఫీ

నర్సింగ్ వృత్తికి ఆద్యురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ జీవిత చరిత్రకు సంబంధించిన డాక్యుమెంటరీ ఆలోచింపజేసింది. యుద్ధ సమయంలో ఆమె కనబరిచిన సేవాగుణం, ప్రేమ తర్వాతి తరాలకు ఆదర్శప్రాయంగా నిలిచాయి. బ్రిటన్ వైద్య విభాగంలో జరిగిన అవకతవకలపై అక్కడి రాణి ఎలిజబెత్ ఎదుట ప్రస్తావించడం, నైటింగేల్ పట్టుదలతో రాయల్ కమిషన్ ను సాధించడంతో ఆమెను దానికి చైర్‌పర్సన్ చేశారు. వైద్య విభాగంలో అవకతవకతలపై ఆమె నివేదిక సమర్పించడంతో, నాటి ప్రభుత్వం ఆ నివేదికను బయటపెట్టలేదు. అయితే ఆ నివేదికలోని అనేక ప్రజోపయోగకర అంశాలను అమల్లో పెట్టారు. తర్వాతి కాలంలో ఆమె కృషి ఫలితంగా నర్సింగ్ అనేది ఒక వృత్తిగా మారింది. ప్రపంచ ఆరోగ్య సేవా రంగంలో నైటింగేల్ వేసిన ఈ అడుగు చరిత్రలో కీలకంగా మిగిలిపోయింది. ఈ వేడుకల్లో సీనియర్ నర్సులు రాజ్య లక్ష్మి, కుమారి సులోచన పాల్గొన్నారు.

# శాంతియుత పోరాటాలను ఓడించలేరు

- కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్
- నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ




**నవతెలంగాణ - బంజారా హిల్స్**

శాంతియుత పోరాటాలను, నిరసన కార్యక్రమాలను ఎవరూ ఎన్నటికీ ఓడించలేరని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ అన్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఆస్పత్రి అవుట్ గేట్ నుంచి పంజాగుట్ట ఇన్‌గేట్ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు హామీలను మీరే నెరవేర్చడంలో విఫలమైతే ఎలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏప్రిల్ 25వ తేదీ నుంచి కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా నిమ్స్ యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వెంటనే యూనియన్ నాయకత్వంతో చర్చలు జరపాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం రాతపూర్వకంగా హామీ ఇవ్వాలన్నారు.

నిమ్స్ హాస్పిటల్లో పనిచేస్తున్న కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని, రిటైర్ అయిన కార్మికులకు ఉచితంగా వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదీ వరకు సమస్యలను పరిష్కరించాలని లేకపోతే కార్మికులు, సీఐటీయూ అనుబంధ సంఘాలు, ఇతరుల మద్దతు కూడగట్టి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలయ్య, నిమ్స్ సెక్యూరిటీ యూనియన్ కార్యదర్శి శశి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐడీపీఎల్ సంస్థలో రూ. 1000 కోట్ల స్క్రాప్ స్కాం

- టీఎస్‌టీఎస్ చైర్మెన్ పాటిమీది జగన్ మోహన్‌రావు సంచలన ఆరోపణలు

**నవతెలంగాణ-కూకట్‌పల్లి**

ఐడీపీఎల్ సంస్థలో రూ.1000 కోట్ల స్క్రాప్ స్కాం జరిగిందని టీఎస్‌టీఎస్ చైర్మెన్ పాటిమీది జగన్ మోహన్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు. ఇండియన్ డ్రగ్స్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ కంపెనీలోని విలువైన యంత్రాలను అంగడి సరుకల్లా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. వేల కోట్ల రూపాయల ఆస్తులు ఉన్న ఈ సంస్థ తాళాలు దొంగ చేతికి అప్పగించిన చందంగా ఉందన్నారు. ఇన్‌చార్జి మేనేజర్‌గా పని చేస్తున్న వ్యక్తి పాతబడి పోయిన రూ.1000 కోట్ల విలువ గల యంత్రాలను సుమారు 67 కోట్లకు టెండర్లు పిలిచారన్నారు. దేశంలోనే అతిపెద్ద ఆక్సిజన్ ప్లాంట్, వందల సంఖ్యలో గ్లాస్ ప్రొటెక్ట్ కేటెల్స్, రియాక్టర్స్, పదుల సంఖ్యలో బస్సులు, ట్రక్కులు, ఫైర్ ఇంజన్‌లు ,లారీలు, అత్యంత సామర్థ్యంగల మేజర్ ఇరిగేషన్ పంపులు, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యంత్రాలు, లక్షల టన్నుల స్టీలు, బాయిలర్‌లు, వీటిని ఏ కమిటీతో లెక్కించినా వెయ్యి కోట్లకు తక్కువగా ఉండదన్నారు. అలాంటి పబ్లిక్ సెక్టార్ ప్రాపర్టీని రూ.67 కోట్లకే టెండర్లు వేసి విక్రయించారని, ఎక్జిక్యూటివ్ పర్సనల్ మేనేజర్ విజయ్‌కుమార్ సహకారంతో టెండర్లు ఈ విక్రయాలు జరిపించారని ఆరోపణలు చేశారు. విజయ్ కుమార్ బీజేపీ జాతీయ నాయకునికి సమీప బంధువు కావడంతో ఈ స్క్రాప్ కుంభకోణం పూర్తిగా ఆయన కనుసన్నల్లోనే జరుగుతోందని తెలిపారు. ఈ విక్రయాన్ని రీకాల్ చేయాలని కేంద్ర రసాయనిక శాఖ మంత్రి మనీష్ పాండ్యకు రిప్రజెంటేషన్ ఇవ్వనున్నామని, పోస్ట్ కార్డుల ద్వారా కేంద్ర మంత్రికి తెలియజేయాలని నిర్ణయించామని ఐడీపీఎల్ మాజీ ఉద్యోగులు ఈ సందర్భంగా తెలిపారు.

సంపాదకీయం

# చెంపపెట్టు...



సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన రెండు తీర్పులు కేంద్రానికి చెంపపెట్టులాంటివి. అందులో ఒకటి ఢిల్లీలో ఎన్నికైన ప్రజాప్రభుత్వం అంశం కాగా, రెండోది మహారాష్ట్రలో గవర్నర్ వ్యవహార శైలికి సంబంధించినది. అయితే ఈ రెండు తీర్పులూ గవర్నర్ల వ్యవస్థను వెలేత్తిచూపేవిగానే ఉన్నాయి. అయితే తెరవెనక కథ నడిపే కేంద్రమే అసలు దోషి అని చెప్పక తప్పదు. ఎందుకంటే ఢిల్లీ ప్రభుత్వాన్ని

> గవర్నర్ల వ్యవస్థకి సంబంధించిన ఈ రెండు తీర్పులూ కేంద్రానికి పరోక్ష హెచ్చరికల్లాంటివి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీకల్లాంటివి.బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికైన బీజేపీయేతర ప్రభుత్వాలను కూలదోయడం, కుదరకుంటే ఇబ్బం దులకు గురిచేయడం, ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు పొడవడం కేంద్రానికి ఓ విధానంగా సాగుతోంది. ఇందుకు గవర్నర్‌ల వ్యవస్థను అడ్డుపెట్టుకోవడం ఆనవాయితీగా మారింది. ఫలితంగా అనేక రాష్ట్రాల్లో గవర్నర్లకు, ముఖ్యమంత్రులకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కేంద్రానికీ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కూడా పాలకపక్షానికి వత్తాసు పలికే గవర్నర్‌ల వ్యవహార శైలికి ఈతీర్పు చెంపపెట్టులాంటిది.

ఇబ్బందులు పెడుతున్న లెఫ్టినెంట్ గవర్నర్ వ్యవహారంగానీ, మహారాష్ట్ర ప్రభుత్వం సంక్షోభంలో గవర్నర్ కోష్యారి ఏకపక్ష వైఖరి గాని కేంద్రం కనుసన్నుల్లో అక్కడి ప్రభుత్వాలను అస్థిరపరిచేవిగా ఉన్నాయన్నది బహిరంగ రహస్యమే.ఈ తీర్పులు దాన్ని మరింత బహిర్గతపరిచే అంశాలే కావడం ఇక్కడ గమనించాల్సిన విషయం. ప్రధానంగా ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం ఎన్నికైనప్పటినుంచి ఏదోరకంగా కేంద్రం ఇబ్బంది పెట్టే ప్రయత్నాలే చేస్తోంది. ఢిల్లీ పాలనాధికారులు ఎవరి పరిధిలో పనిచేయాలి?అనే విషయమై అనేకమార్లు వివాదాలు చోటుచేసుకున్నాయి.

సాధారణంగా రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలను ఆయా రాష్ట్రాల అధికారులు అమలు జేయాలి. కానీ, ఢిల్లీ కేంద్ర పాలిత ప్రాంతం గనుక ఆ సూత్రం వర్తించదన్నది కేంద్రం వాదన. దేశ రాజధానిలో రాష్ట్రపతి, ప్రధాని, విదేశీ రాయబారుల వంటి సెలబ్రెటీలు నివసిస్తారు గనుక వారి శాంతిభద్రతలు తామే చూస్తున్నాం గనుక పాలనా సర్వీసులపై నియంత్రణాధికారం తమదేనని అంటోంది. దానికి సంబంధించి 2015లో ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ విషయమై ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. 2019లో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసింది. దీనిపై ఢిల్లీ ప్రభుత్వం మళ్లీ అప్పీ లుకు వెళ్లగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైవీ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా కీలకమైన తీర్పునిచ్చింది. ఢిల్లీలో ఎన్నికైన ప్రజా ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు లెఫ్టినెంట్ గవర్నర్ కట్టుబడి ఉండాలని సర్వోన్నత న్యాయ స్థానం స్పష్టం చేసింది.దీనికితోడు పాలనా సర్వీసులపై ఢిల్లీ ప్రభుత్వానికి అధికారం లేదంటూ ద్విసభ్య ధర్మా సనంలోని జస్టిస్ అశోక్ భూషణ్ ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక విజయం.

ఇక మహారాష్ట్ర రాజకీయ సంక్షోభానికి సంబంధించిన విషయంలోనూ అప్పటి గవర్నర్ వ్యవహరించిన తీరును కోర్టు తప్పుపట్టింది.రాష్ట్ర శాసనసభలో బలాబలాల పరిస్థితి తెలుసుకోకుండా, బలపరీక్ష కోరడం అనైతికమని తేల్చింది. ఈ కేసులో అప్పుడున్న ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రేను బలపరీక్షను కోరే ముందు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితిని గవర్నర్ అంచనా వేయడంలో విఫలమయ్యారని స్పష్టం చేసింది. గవర్నర్‌ది తప్పని సుప్రీంకోర్టు మందలించినా ఇదేమీ తనను శిక్షించినట్టు కాదని కోష్యారి ప్రకటించడం వెనుక అంతర్యాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉన్నది. నడిపించేదంతా నాయకులైనప్పుడు ఇలాంటి వారంతా తప్పు చేసి కూడా తమదేం లేదన్నట్టుగా వ్యవహరిస్తారు. కోష్యారి కూడా మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించడం ఆయన అవివేకమనిగాక ఇంకేమనుకోవాలి?ఉద్ధవ్ థాక్రే కూడా తొందర పాటు నిర్ణయం తీసుకున్నారని, పార్టీ చీలిక నేపథ్యంలో బలపరీక్షను ఎదుర్కోకుండానే రాజీనామా చేయడం వల్ల ఆయన రాజీనామాను రద్దుచేసి, మళ్లీ ముఖ్యమంత్రిగా చేయలేమని కోర్టు పేర్కొంది. రాజీనామా చేయకుండా థాక్రే సంయమనం పాటించి వుంటే ఆయన్ని తిరిగి సీఎంగా కూర్చోబెట్టవచ్చని చెప్పింది. అయితే తీర్పుననుసరించి థాక్రే గ్రూపునకు చెందినవారు షిండేను రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగారు. ఇది కొంతకాలం మహారాష్ట్ర రాజకీయాల్లో మరింత నిప్పురాజేసే అవకాశాలున్నాయి.

గవర్నర్ల వ్యవస్థకి సంబంధించిన ఈ రెండు తీర్పులూ కేంద్రానికి పరోక్ష హెచ్చరికల్లాంటివి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీకల్లాంటివి.బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికైన బీజేపీయేతర ప్రభుత్వాలను కూలదోయడం, కుదరకుంటే ఇబ్బందులకు గురిచేయడం, ఫెడరల్ స్ఫూర్తికి తూట్లు పొడవడం కేంద్రానికి ఓ విధానంగా సాగుతోంది. ఇందుకు గవర్నర్‌ల వ్యవస్థను అడ్డుపెట్టుకోవడం ఆనవాయితీగా మారింది. ఫలితంగా అనేక రాష్ట్రాల్లో గవర్నర్లకు, ముఖ్యమంత్రులకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కేంద్రానికీ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కూడా పాలకపక్షానికి వత్తాసు పలికే గవర్నర్‌ల వ్యవహార శైలికి ఈతీర్పు చెంపపెట్టులాంటిది.

# మణిపూర్ అల్లర్లకు బీజేపీ బీజం

సత్య

దేశం సురక్షితమైన చేతుల్లో ఉందన్నారు. పెద్ద నోట్ల రద్దు, ఆర్టికల్ 370 ఎత్తివేత, జమ్మూ- కాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడంతో ఉగ్రవాదుల వెన్ను విరిచినట్లు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. పెద్దన్న అమెరికాతో ఒప్పందం చేసుకొని కీలక సమాచారాన్ని మార్పిడి చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు ఆర్భాటం చేశారు. నిజమే కామోసనుకొని జనం సంతోషించారు. కేంద్ర ప్రత్యక్ష పాలనలో ఉన్న కాశ్మీరులో గత పక్షం రోజుల్లోనే పది మంది సైనికుల ప్రాణాలు తీశారు ఉగ్రవాదులు. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా మిలిటరీ గ్రామాలను నిర్మిస్తోందంటూ అమెరికా ఇచ్చిన సమాచారంతో మీడియా పెద్ద ఎత్తున వార్తలిచ్చింది. ఇప్పుడు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల గురించి ఎలాంటి సమాచారమూ ఇచ్చినట్లు వార్తల్లేవు. మరో రాష్ట్రం మణిపూర్. ఇక్కడ బీజేపీ పాలన ఉంది. ఇది రాసిన సమయానికి అక్కడ జరిగిన హింసాకాండలో 60మంది మరణించినట్లు వార్తలు. వారెలా మరణించిందీ తెలియదు. రాష్ట్రమంతటా ఇంటర్నెట్ బంద్, కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు ఇచ్చి ఆర్టికల్ 355ను ప్రకటించి కేంద్ర బలగాలకు అప్పగించారు. శాంతి భద్రతలను కాపాడడంలో విఫలమైనా రాష్ట్రపతి పాలన పెట్టలేదు, స్వంత పార్టీ కదా!

> మణిపూర్ భూ సంస్కరణల చట్టం ప్రకారం గిరిజనులు నివసించే కొండ ప్రాంతాల్లో గిరిజనేతరులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకొనేందుకు, భూములు కొనేందుకు వీల్లేదు. గిరిజనేతరులు ఇంఫాల్ లోయ ప్రాంతానికే పరిమితం కావాలి. అక్కడ రాష్ట్రంలోని భూమిలో పదిశాతమే ఉంది. గిరిజనులు ఎక్కడైనా స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవచ్చు. గిరిజనేతరుల్లో ఎక్కువ మంది హిందువులు, గిరిజనులంతా క్రైస్తవులు. అసెంబ్లీలోని 60స్థానాలకు గాను 40చోట్ల మెయితీలే గెలుపోటములను ప్రభావితం చేస్తారు. వారి మద్దతు కోసమే రాష్ట్రాన్ని బీజేపీ అగ్ని గుండంగా మార్చిందా? విస్తారమైన భూమిని ఏదో ఒక పద్ధతిలో స్వంతం చేసుకోవాలని ఈ సామాజిక తరగతి చూస్తున్నదనే ఆరోపణ ఉంది.

చిత్రం ఏమిటంటే కర్నాటక ఎన్నికల్లో ప్రచారంలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ ఇంత జరుగుతున్నా ఒక్క మాట మాట్లాడిన పాపాన పోలేదు. విలేకర్లతో మాట్లాడేందుకు ఎలాగూ ముందుకు రారు, కనీసం ఒక ప్రకటన లేదా బహిరంగ సభల్లో మాట్లాడితే నోటి ముత్యాలు రాలుతాయన్నట్లు ఉన్నారు. కల్పిత కట్టుకథలతో కేరళ సమాజాన్ని అవమానపరిచేందుకు తీసిన కేరళ స్టోరీ సినిమా గురించి మాట్లాడతారు, ప్రతిపక్షాలు ఉగ్రవాదులతో చేతులు కలిపినట్లు, మద్దతు ఇచ్చినట్లు రాళ్లు వేసేందుకు తీరిక దొరుకుతుంది గానీ కాశ్మీర్, మణిపూర్ గురించి ప్రస్తావించడానికి తీరిక దొరకదు. ఢిల్లీలో రెజ్లర్ల మీద పోలీసు జులుం గురించి మాట్లాడరు. స్వంత పార్టీ ఎంపీ మీద పోక్సో కేసు పెట్టినా అరెస్టు లేదు. కర్నాటకలో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రధాని 30ట్వీట్లు పెట్టారు. వాటిలో సగం కాంగ్రెస్, జేడీఎస్ మీద దాడికి దిగారు. మణిపూర్, కాశ్మీరు, రెజ్లర్ల ఉదంతాలపై ట్వీట్ల ద్వారా కూడా స్పందించలేదు. జై భజరంగభళీ... అంటూ మతం పేరుతో ఓట్లడిగేందుకు నోరు వచ్చిందన్న విమర్శలొచ్చిన సరే... పదే పదే ప్రస్తావించారు. అడిగేవారెవరు, నిబంధనలను అమలు జరిపేదెవరు? ప్రపంచ నేతగా, విశ్వగురువుగా భక్తుల నుంచి నీరాజనాలు అందు కుంటున్న నరేంద్రమోడీ కాశ్మీరు, మణిపూర్‌లో జరుగుతున్న ఉదంతాలు అల్పమైనవని, వాటి మీద స్పందించడం తన స్థాయికి తగదని మౌనముద్ర దాలుస్తున్నారా?

మణిపూర్ అగ్నిగుండంగా మారేందుకు హైకోర్టు ఇచ్చిన సలహా కారణమైంది. న్యాయమూర్తుల సలహాలు చిచ్చు రేపేవిగా ఉండకూడదు, వాటి పర్యవసానాలను కూడా గమనంలో ఉంచుకోవాలి. రాష్ట్ర జనాభాలో 53శాతంగా ఉన్న మెయితీ సామాజిక తరగతికి చెందిన వారు తమను షెడ్యూలు కులాల జాబితాలో చేర్చాలని చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. అది వీలవుతుందో కాదో చట్టబద్ధమో కాదో స్పష్టంగా చెప్పాల్సిన కోర్టు... వారి కోర్కెను పరిశీలించాలని ఏప్రిల్ 20న రాష్ట్ర ప్రభుత్వానికి సలహా ఇచ్చినట్లు వార్తలొచ్చాయి. దాన్ని గనుక అమలు జరిపితే గిరిజనులుగా ఉన్న కుకీలు, నాగాలు తమ భూములు కోల్పోతామని భయపడ్డారు. అక్కడి బీజేపీ ప్రభుత్వం వారి అనుమానాలను తీర్చేందుకు పూనుకోలేదు. ఏప్రిల్ 28న సీఎం బిరేన్ సింగ్ చురుచందపూర్ అనే చోట ఒక జిమ్‌ను ప్రారంభించేందుకు రానుండగా, ముం దురోజు నిరసనకారులు దాన్ని తగుల బెట్టారు. గిరిజన-గిరిజనేతర ప్రాంతాల న్నింటా కనిపిస్తే కాల్చివేత ప్రకటించి ప్రభు త్వం మరింత రెచ్చ గొట్టింది. గిరిజన విద్యార్థి సంఘం మే మూడో తేదీన చురుచంద పూర్‌లో గిరిజన సంఘీభావ ప్రదర్శనకు పిలుపునిచ్చింది. ఆ సందర్భంగా హింసాకాండ చెలరేగింది. గిరిజనేతర ప్రాంతాల్లోని గిరిజనుల మీద, చర్చిల మీద దాడులు జరిపారు. అప్పటి నుంచి రాష్ట్రం అగ్నిగుండంగా మారింది.



మణిపూర్ భూ సంస్కరణల చట్టం ప్రకారం గిరిజనులు నివసించే కొండ ప్రాంతాల్లో గిరిజనేతరులు స్థిర నివాసం ఏర్పాటు చేసుకొనేందుకు, భూములు కొనేందుకు వీల్లేదు. గిరిజనేతరులు ఇంఫాల్ లోయ ప్రాంతానికే పరిమితం కావాలి. అక్కడ రాష్ట్రంలోని భూమిలో పదిశాతమే ఉంది. గిరిజనులు ఎక్కడైనా స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవచ్చు. గిరిజనేతరుల్లో ఎక్కువ మంది హిందువులు, గిరిజనులంతా క్రైస్తవులు. అసెంబ్లీలోని 60స్థానాలకు గాను 40చోట్ల మెయితీలే గెలుపోటములను ప్రభావితం చేస్తారు. వారి మద్దతు కోసమే రాష్ట్రాన్ని బీజేపీ అగ్ని గుండంగా మార్చిందా? విస్తారమైన భూమిని ఏదో ఒక పద్ధతిలో స్వంతం చేసుకోవాలని ఈ సామాజిక తరగతి చూస్తున్నదనే ఆరోపణ ఉంది. అందుకు గాను పక్కనే ఉన్న మయన్మార్ నుంచి అక్రమంగా గిరిజనుల వలసలను ప్రోత్సహిస్తున్నట్లు ఆ తరగతి ఆరోపిస్తోంది. అక్రమ వలసలన్నది ఒక సాకు మాత్రమే అని గిరిజనులు అంటున్నారు. వాస్తవాలను వివరించి రెండు సామాజిక తరగతుల్లో ఉన్న అనుమానాలు, అపోహలను తొలగించటంలో గతంలో ఉన్న ప్రభుత్వాలతో పాటు వర్తమాన బీజేపీ కూడా విఫలమైంది, మతం పేరుతో ఓటు బాంకు ఏర్పాటుకు పూనుకుంది. తాజా పరిణామాల్లో మణిపూర్‌లో తిరిగి ఉగ్రవాదం తలెత్తితే బీజేపీదే బాధ్యత అవుతుంది.

కాశ్మీరులో నిజంగా ఉగ్రవాదులను, ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించారా? వాస్తవాలేమిటి? బీజేపీ చేసు కుంటున్న ప్రచారంలో నిజమెంత? ఇక్కడ ఉగ్రవాదాన్ని ఐదు దశలుగా విభజించాలి. ఎప్పుడు ఎవరి పాలనలో ఏం జరిగిందో దక్షిణాసియా టెర్రరిజం పోర్టల్ వివరాలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. 1988 నుంచి 1997వరకు కాంగ్రెస్ పాలన. 1998 నుంచి 2003 వరకు ఎన్‌డీఏ వాజ్‌పేయి ఏలుబడి, 2004 నుంచి 2013వరకు తిరిగి కాంగ్రెస్ పాలన. 2014 నుంచి ఇప్పటి వరకు నరేంద్రమోడీ అధికారం.2019 ఆగస్టు నుంచి కాశ్మీరు కేంద్రపాలిత ప్రాంతంగా మారింది. కాశ్మీరులో నిజంగా ఉగ్రవాదులను, ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించారా? వాస్తవాలేమిటి? బీజేపీ చేసుకుంటున్న ప్రచారంలో నిజమెంత? ఇక్కడ ఉగ్రవాదాన్ని ఐదు దశలుగా విభజించాలి. ఎప్పుడు ఎవరి పాలనలో ఏం జరిగిందో దక్షిణా సియా టెర్రరిజం పోర్టల్ వివరాలు అందరికీ అందు బాటులో ఉన్నాయి. 1988 నుంచి 1997 వరకు కాంగ్రెస్ పాలన.1998 నుంచి 2003 వరకు ఎన్‌డీఏ వాజ్‌పేయి ఏలుబడి, 2004 నుంచి 2013 వరకు తిరిగి కాంగ్రెస్ పాలన. 2014 నుంచి ఇప్పటి వరకు నరేంద్రమోడీ అధికారం. 2019 ఆగస్టు నుంచి

> పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో గోవాలో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సిఓ) సమా వేశానికి హాజరైనప్పుడే ఉగ్రవాదులు మన పారా ఎస్‌ఎఫ్(స్పెషల్ ఫోర్సెస్) దళానికి చెందిన ఐదుగురు కమాండోలను చంపారు. అదే జమ్మూ ప్రాంతంలో ఏప్రిల్ 20న ఐదుగురు సైనికులను చంపారు. తాజా ఉదంతాలను చూసినప్పుడు ఉగ్రవాదులు కాశ్మీరు నుంచి జమ్మూకు తమ కుట్రలను విస్తరింప చేసినట్లు కనిపిస్తోంది. చిన్న బందాలుగా దాడులు చేసేందుకు శిక్షణ పొందినట్లు కూడా చెబుతున్నారు. అది పాకిస్థాన్‌లో తప్ప మన గడ్డమీద సాధ్యం కాదు. వీటి గురించి మనకు అమెరికా ఎందుకు సమాచారం అందించటం లేదన్నది ప్రశ్న

కాశ్మీరు కేంద్రపాలిత ప్రాంతంగా మారింది. కాశ్మీరులో ఆర్టికల్ 370 రద్దు, కొత్తగా భద్రతా దళాలకు అధికారం ఇచ్చినట్లు ప్రచారం చేసుకున్న కాలంలో జరిగిన పరిణామాలను చూసినప్పుడు ఉగ్రవాదం పూర్తిగా నిర్మూలన కాలేదు. వాజ్‌పేయి పాలనతో పోల్చినపుడు అదే కాశ్మీరులో ఆర్టికల్ 370 ఉండగా కూడా కాంగ్రెస్ ఏలుబడిలో ఉగ్రవాదం తగ్గినట్లు అంకెలు చెబుతున్నాయి. పలు కారణాలతో ఉదంతాలు తగ్గినప్పుడు తమ ఘనతగాను, లేనప్పుడు పాక్ కుట్రగానూ వర్ణిస్తే కుదురు తుందా? తగ్గినపుడు పాక్ దూరంగా ఉందని చెబుతారా?

పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో గోవాలో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సిఓ) సమా వేశానికి హాజరైనప్పుడే ఉగ్రవాదులు మన పారా ఎస్‌ఎఫ్(స్పెషల్ ఫోర్సెస్) దళానికి చెందిన ఐదుగురు కమాండోలను చంపారు. అదే జమ్మూ ప్రాంతంలో ఏప్రిల్ 20న ఐదుగురు సైనికులను చంపారు. తాజా ఉదంతాలను చూసినప్పుడు ఉగ్రవాదులు కాశ్మీరు నుంచి జమ్మూకు తమ కుట్రలను విస్తరింప చేసినట్లు కనిపిస్తోంది. చిన్న బందాలుగా దాడులు చేసేందుకు శిక్షణ పొందినట్లు కూడా చెబుతున్నారు. అది పాకిస్థాన్‌లో తప్ప మన గడ్డమీద సాధ్యం కాదు. వీటి గురించి మనకు అమెరికా ఎం దుకు సమాచారం అందించటం లేదన్నది ప్రశ్న. పూంచ్‌లో ఏప్రిల్ 20న జరిపిన దాడిలో ఉపయోగించిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా మిలిటరీ వదలి వెళ్లినవని గుర్తించారు. వాటిని అక్కడి తాలిబాన్లు మన దేశం లోని ఉగ్రవాదులకు అందిస్తే తప్ప దొరికేవి కాదు. మరోవైపున ఉగ్రవాదులు స్థానికంగా, విదేశాల నుంచి నిధులు సేకరిస్తున్న ఇటీవల జాతీయ దర్యాప్తు సంస్థ జరిపిన సోదాల్లో దొరికిన సమాచారం వెల్లడించింది. పెద్దనోట్ల రద్దుకు ఉగ్ర వాదులకు నిధులు దొరక్కుండా చేయడం ఒకటని చెప్పారు. మరి ఇప్పుడు దీనికి ఏ సాకు చెబుతారు? పాత నోట్లు రద్దు చేసి కొత్తగా రెండు వేల నోట్లు ముద్రించి మరింత పెద్ద మొత్తాలను సులభంగా అందచేసేందుకు అదే మోడీ సర్కార్ వీలు కల్పించింది. •



# అమ్మ ఇచ్చిన పునర్జన్మ

మహర్జాతకుడమ్మా... వీడు!

అన్న మాటను నేను, అమ్మ ఒడిలో ఉన్నపుడు, మా తాత మాచన పుండరీకం అన్నాడట. ఆ మంచి మాట విన్న మా అమ్మ ఆ! ఏదో పెద్దాయన కదా, మనవడిపై ప్రేమతో పెద్దాయన అలా అని ఉంటాడులే... అని సంబరపడింది. నాకు నాలుగు పదులు దాటాక కానీ అమ్మకు తాత ఆ..మాట ఎందుకన్నాడో బోధపడలేదు. గతేడాది మే 31న హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం వారు... మేడం, మీ అబ్బాయిని ఇంటర్వ్యూ చేయమని ఢిల్లీ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. మాచన రఘునందన్ లాంటి వాళ్ళు సమాజానికి ఎంతో అవసరం. ఓ ఆదర్శ అధికారిగానే గాక, స్ఫూర్తి దాయక వ్యక్తి మీ అబ్బాయి అని వారు వ్యాఖ్యానించడం అమ్మకు ఎంత ఆత్మ సంతృప్తి కలిగిందో. అమ్మ ఎదురు గుండా... నన్ను ఓ ప్రభుత్వ ఛానల్ వారు ఏకధాటిగా గంట పాటు ప్రత్యక్ష ప్రసారంలో ఇంటర్వ్యూ చేయడం. అమ్మ కు అమేజింగ్ ఎక్స్పీరియన్స్. ఓ కొడుకుగా అమ్మకు నేను అంతకంటే ఏం... చేయగలను.

రెండు దశాబ్దాలకు పైగా... ఎవ్వర్ని పడితే వాళ్ళను,ఎక్కడ పడితే అక్కడ... సార్... ధూమపానం అలవాటు మానండి మహాప్రభో.. పొగాకు ఆరోగ్యంపై పగ బడుతుంది. కన్న వాళ్లకు పుత్ర శోకం కలిగించకండి. అని రెండు దశాబ్దాలకు పైగా జన బాహుళ్యానికి ప్రార్థన చేస్తున్న ఈ...మీ హితైషి "మాచన"... బతికే ఉన్నాడు, అంటే జన్మనిచ్చిన అమ్మే పునరజన్మనూ... ఇచ్చింది.

నేను ఎస్సెస్సీ చదువుతున్న రోజుల్లో... ఓ సాయంకాలం ట్యూషన్ అయ్యాక ఇంటికి బయల్దేరా... అప్పటికే ఉరుములు, మెరుపులతో వర్షం దంచికొట్టింది. చెల్లి, తమ్ముడు వర్షం ఆరంభంకంటే ముందే ఇల్లు చేరారు. ముషీరాబాద్, న్యూ బాకారంలో బ్యాంక్ ఆఫ్ బరోడా కాలనీ దారిలో దయాశ్ మోహన్ స్టీల్ ఇండస్ట్రీస్ వెనుక మా ఇల్లు ఉండేది. ఇంటికి చేరేందుకు ఓ వీధి గుండా వెళ్లే వాళ్ళం.ఆ వీధి మలుపులో, ఓ విద్యుత్ స్తంభం ఉంది. గాలి దుమారం దెబ్బకు పోల్ పై నుంచి హై టెన్షన్ కరెంటు వైరు తెగి కింద పడింది. దారికి అడ్డంగా... సరిగా సాయంత్రం ఐదు గంటలకు, నేను ట్యూషన్ అయిపోయాక అరగంట లో ఆ వీధి మలుపుకు వచ్చేశా.

అమ్మ పాపం... నాలుగున్నర నుంచి తెగి పడిన విద్యుత్ తీగ సమీపంలోనే ఉంది. ఆ దారిన వెళ్లే వాళ్ళను బతిమాలుతూ... ఉంది. 'బాబూ కాస్త మా అబ్బాయి రఘు కనపడితే?! జాగత్తగా రమ్మని' చెప్పండీ. అంటూ... అలా చెప్పి, చెప్పి ఆమె గొంతు తడారిపోయింది.నేను వచ్చే వరకు తల ఎత్తి చూస్తూ..నే ఉంది. నేను కొద్ది దూరంలో కనపడగానే..ఒక్క సారిగా, "ఆగు! అక్కడే ఉండు, నేనొస్తున్న" అంటూ... జాగ్రత్తగా... గోడవారగా ఉన్న ఓ చిన్న అరుగుపై నుంచి నా వద్దకు చేరుకుంది. ఏమైందమ్మ అంటే... కరెంటు తీగ కింద పడింది. షాక్ తగులుతుందని నీకు చెప్పడానికి గంట నుంచిక్కడే ఉన్నా అందీ. తమ్ముడికో, చెల్లికో చెప్పొచ్చు కదా... అన్నా! వాళ్ల ఏమరుపాటుకు కరెంటు షాక్ కొడితే ఎలా? అని ప్రశ్నించింది. అలా... నాకు జన్మనిచ్చిన అమ్మ మరలా... నన్ను మృత్యు గండం నుంచి గట్టెక్కించింది. క్షణకాలం కూడా... కనురెప్ప వాల్చకుండా... కాపలా కాసి, కన్న బిడ్డను విద్యుదాఘాతం నుంచి తప్పించి, మరు జన్మనూ... ప్రసాదించింది. డిగ్రీ అయ్యాక "నేను సివిల్స్ ప్రిపేర్ అవుతా అమ్మా" అంటే... ఏమో రా నాన్నా ఒప్పుకుంటారో లేదో ఎంత కావాలేంటీ అని అడిగింది. ఓ లక్ష అవ్వచ్చు అన్నా... సరే చూద్దాం అంది. నేను తేలిగ్గా తీసుకుందేమో అనుకున్నా... తన ఆభరణాలు, మంగళసూత్రాలు తనఖా పెట్టి కొంత డబ్బు సర్దింది. నాకు స్వతహాగా డబ్బు దాచుకునే అలవాటు మా నాన్న గారు అభిమన్యు (టీచర్) నేర్పడం వల్ల పోగైన పైకంతో సివిల్స్ సాధన కోసం ప్రయత్నం చేశా. ఇంత చేసిన అమ్మకు నేను ఇంతవరకు ఏనాడూ... ఒక్క చీర కొని ఇవ్వక పోయినా... తను మాత్రం అడపా దడపా... నా ఆర్థిక ఇబ్బందిని అడిగి తెలుసుకుని యధాశక్తి సాయం ఇప్పటికీ చేస్తుంది. నాన్న మమ్మల్ని తన డ్యూటీ హడావిడిలో పెద్దగా పట్టించుకోక పోయినా... అమ్మ మాత్రం అండ, దండగా ఇప్పటికీ తన కను పాపల్లానే చూసుకుంటుంది. విజయమ్మ భలే బిడ్డని కన్నావమ్మా... నీ కొడుకు అందరిచేత, బీడీ, సిగరెట్లు, పొగాకు మాన్పించి ఇళ్లలో వెలుగు నింపుతున్నాడని వాళ్లు వీళ్లు అంటుంటే అమ్మ కళ్లలో ఆ ఆనందమే వేరు. అధికారిని అయినప్పటికీ సాదాసీదాగా ఉండటం, బంధు మిత్రులతో కలుపుగోలుగా వుండటం అలవాటు. ఒక్కోసారి నా అత్యుత్సాహాన్ని గమనించి ఎందుకంత అవసరమా?! ఆఫీసర్‌లా హుందాగా ఉండు అంటూ ఇప్పటికీ ఓ గొప్ప వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా సూచిస్తుంది.


అమ్మ... నన్ను చెడు నుంచి కాపాడే, కాపాడుకునే, ఓ "అమ్ము" లా..నే నిర్ధయాన్నిస్తుంది. ఆపదలో అభయంగా ఉంటుంది.

(మే 14 అంతర్జాతీయ మాతృ దినోత్సవం)

- మాచన రఘునందన్, 9441252121

# స్ఫూర్తి నింపిన ఆదివాసీ కల్చరల్ ఫెస్ట్ 'రేలా పండుగ'

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం 3వ రాష్ట్ర మహాసభల సందర్భంగా మే 3,4 తేదీల్లో ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలు 'రేలా పండుగ' భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో అత్యంత కోలాహలంగా జరిగాయి. 5,6 తేదీల్లో భారీ సాంస్కృతిక ర్యాలీ, బహిరంగసభ, ప్రతినిధుల సభ ఎంతో స్ఫూర్తిదాయ కంగా నిలిచాయి. ఆది వాసీలతో పాటు నాయకులకు కూడా కొత్త ఉత్తేజాన్నిచ్చాయి.ఈ ఉత్సవాలలో సుమారు 500మంది కళాకారులు పాల్గొన్నారు. మహాసభ నిర్దేశించిన కర్తవ్యాలను ముందుకు తీసుకు పోవాల్సిన నూతన కమిటీ ఎన్నికతో 6వ తేదీ సాయంత్రం మహా సభలు ముగిశాయి. ర్యాలీ, బహిరంగసభ, మహా సభలలో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఏఏఆర్ఎమ్) జాతీయ నేత బృందాకరత్ పాల్గొన్నారు.ఈ మహాసభలు జరిగిన తీరు, కళాకారుల ప్రదర్శన, ఆదివాసీల పోరాటం, సంస్కృతి ఇక్కడ చర్చించుకోవడం ప్రత్యేకతను సంతరించు కుంది. ప్రస్తుతం దేశంలోని భిన్నత్వాన్ని, బహుళత్వాన్ని ధ్వంసం చేసే శక్తులు అధికారంలో ఉన్నాయి. ఒకే మతం, ఒకే సంస్కృతి, ఒకే భాష పేరుతో ఆధిపత్య వాదాన్ని రుద్దుతూ ఆదివాసీ సంస్కృతిని, కళలను కూడా ధ్వంసం చేస్తున్నాయి. వాస్తవానికి ఆది వాసులు ఏ మతానికి చెందరు. వారి సాంప్రదాయాలు, అలవాట్లు అన్నీ భిన్నమైనవి. పెళ్ళిలో బ్రాహ్మణుడు ఉండడు. సమ్మక్క, సారక్క అడవి దేవతల జాతరలో కూడా కోయ తెగ పద్ధతులు, పూజలు ఉంటాయి. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఏ మతాల ఆచారాలకు వీరికి పొంతన లేదు. ఇటీవల మిషనరీలు, అనేక రకాల రంగుల మాలలు ధరించే వారు, డిజె సంస్కృతి, గణేష్ మండపాలు, శోభాయాత్రలు అడవుల్లోకి చొచ్చుకు వస్తున్న కొద్దీ ఆదివాసీ సంస్కృతి ఉనికి, అస్తిత్వం ప్రమాదంలో పడిపోయాయి. ప్రకృతితో ముడిపడి ఉండే వైవిధ్యభరితమైన వీరి సంస్కృతిని కాపాడు కోవాలనే పలువురి ఆకాంక్షలకు ఆదివాసీ గిరిజనసంఘం (టీఏజీఎస్) ఆచరణ రూపం ఇచ్చింది.ఈ క్రమంలో జరిగిన మహాసభలు ఆదివాసీ సంస్కృతిపై ఆధిపత్యపు మతరంగులు పులిమే పాలకులను ఎదిరించి, ధిక్కరించి పోరాడే శక్తినిచ్చాయి.వారి డిమాండ్లు, ఆకాంక్షలకు అనుగుణంగా నూతన ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచాయి.



బండారు రవికుమార్

## ఆదివాసీ కళారూపాల వేదికగా నిలిచిన 'రేల పండుం'

రేల పండుగను కోయభాషలో "పండుం" అంటారు. సాంస్కృతిక ఉత్సవాలకు "రేలా పండుం" అని నిర్వాహకులు పేరు పెట్టారు. అంటే రేలా పండుగ అన్నమాట. 450 కిమీ దూరంలో ఉన్న ఆదిలాబాద్ మొదలుకొని ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం వరకూ విస్తరించి ఉన్న ఆదివాసీ ప్రాంతాల నుండి గోండు, కోయ, నాయక్‌పోడు, కోలాం, ప్రధాన్, డోలీ, మన్నెవార్లు, ఛత్తీస్‌గఢ్ నుండి వచ్చిన వలస ఆదివాసీలు ఇలా అనేక తెగల సాంస్కృతిక, కళారూపాలను ఆయా కళాకారులు అత్యంత వ్యయప్రయాసలకోర్చి భద్రాచలం చేరుకుని తమ సాంప్రదాయ కళలు, నృత్యాలను ప్రదర్శించారు. జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో "రేలా పండుం" ఏర్పాటు అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. మొదటి రోజు వర్షం వలన రెండు గంటలు ఆలస్యంగా కార్యక్రమాలు మొదలయ్యాయి. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆదివాసీ కళాకారుడు సకినం రామచంద్రయ్య ప్రారంభించారు. ఆదివాసీ సంస్కృతిలో భాగమైన గుస్సాడీ, రేలా, డోలు, తప్పెట్లు, చెచోయ్, కొమ్ముకోయ, సకినండోలు వంటి అనేక కళా రూపాలతో పాటు ఆదివాసీ యువతీ యువకుల్లో దాగిఉన్న ప్రత్యేకమైన నృత్యాలు, పాటలు, వేణువు వంటి కళారూపాలను ప్రదర్శించడానికి "రేలా పండుగ" వేదికగా నిలిచింది. వీటి ఆధారంగా ఆదివాసులను కళారంగంలో బహుముఖ ప్రజ్ఞాశాలురుగా ప్రేక్షకులు గుర్తించగలిగారు. కళారూపాలను వీక్షించిన గిరిజన, గిరిజనేతర ప్రేక్షకులు ఒకేచోట ఇన్ని రకాల విభిన్నమైన, సహజమైన కళారూపాలను వీక్షించడం అరుదుగా వచ్చే అవకాశం అన్నారు. మళ్ళీ ఇలాంటివి చూసే అవకాశం వస్తుందో రాదో అని కళాకారులను కొనియాడారు. సాధారణంగా సాంస్కృతిక ఉత్సవా లలో ప్రేక్షకులు శ్రద్ధగా కూర్చుని వీక్షిస్తారు. కానీ టీఏజీఎస్ నిర్వహించిన ఈ 'రేలా పండుం"లో ప్రేక్షకులు సైతం ఎరీనాలోకి వచ్చేసి కళాకారులతో పాటు నృత్యాలు చేసేంత ఉత్సహాన్ని నింపాయి. రెండురోజుల పాటు రాత్రి 10.30గంటల వరకూ ఈ కార్యక్రమాలు నడిచాయి. ప్రతిరోజూ "ఈరోజు ఉత్సవాలలో ఇంత టితో ముగిశాయి" అని మైక్‌లో ప్రకటించాక, అప్పటివరకూ విడివిడిగా నృత్యాలు చేసిన బృందాలన్నీ ఒక్కుమ్మడిగా గ్రౌండ్ మధ్యలోకి వచ్చి ప్రేక్షకులతో కలిసిపోయి నృత్యం చేసేవారు. ఆడ, మగ, పిల్లా, పాప, ముసలీ తేడాలేకుండా వందలాదిమంది ఒక్కటిగా నృత్యం చేయడంలో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ముగింపులో బలవంతంగా అక్కడినుండి గ్రౌండ్ బయటకు కదలడం కనిపించింది.పట్టణంలోని అనేకమంది ప్రముఖులు, ఆదివాసీ రంగంలోని ముఖ్యులు వచ్చి మధ్య మధ్యలో సాంస్కృతిక బృందాలకు, కళాకారులకు ఆకర్షణీయమైన మెమెంటోలు అందజేశారు. సోషల్ మీడియా వేదికల మీద ఈ కార్యక్ర మాలను అనేకమంది అప్‌లోడ్ చేయడం కనిపించింది. ప్రేక్షకులు తమ మొబైల్, కెమెరాల ద్వారా ఫొటోలు, వీడియోలు తీశారు. సాంస్కృతిక సంబరాలు ఆదివాసీ తెగల ఐక్యతకు నిదర్శనంగా నిలిచాయి.5వ తేదీ సాయంత్రం జరిగిన ప్రజా ప్రదర్శనపై "రేలా పండుం" ప్రభావం పడింది. 3,4తేదీల్లో ప్రదర్శిం చిన కళారూపాలన్నీ భద్రాచలం పట్టణ పురవీధుల్లో ప్రదర్శనలో పాల్గొని ర్యాలీకి ప్రత్యేక శోభను సంత రింపజేశాయి. ప్రజాతంత్ర ఉద్యమానికి భద్రాచలం మన్యంలో మళ్ళీ పూర్వ వైభవం రానున్నదా అనే ఆసక్తి ప్రజల్లో కనబడింది.



## పోరాట ఘట్టాలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

బహిరంగసభలో బృందాకరత్, తమ్మినేని వీరభద్రం విభిన్నమైన అంశాలపై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు ఆదివాసీలను ప్రకృతి, సహజ వనరుల నుండి దూరం చేసి, బడా కార్పొరేట్ల కోసం విధ్వం సం చేస్తున్నాయనీ అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి అనేక సమ స్యలను ప్రస్తావించారు. జాతీయ స్థాయిలో క్రీడలు, పర్వతారోహణ, ఇతర రంగాలలో రాణించిన విద్యార్థు లకు, మంచిర్యాల జిల్లా 'కోయ పోషగూడెం' భూ పోరాటంలో మిలిటెంట్‌గా నిలిచిన మహిళలకు బృందా కరత్ చేతుల మీదుగా సన్మానం చేశారు. ఆదేరోజు రాత్రి ప్రతినిధుల సభ ప్రారంభమైంది. 6వ తేదీ సాయంత్రం వరకూ సాగింది. గ్రూపు చర్చలు, ప్రెజెంటేషన్‌లను బృందాకరత్ పర్యవేక్షించి అనంతరం దిశానిర్దేశం చేస్తూ మాట్లాడారు. ప్రతినిధుల సభలో తొలుత రాష్ట్ర కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. ఈ కాలంలో నిర్బంధాలను లెక్కచేయకుండా గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకూ జరిగిన పోరాటాలు, విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక కృషిని మహాసభ సమీక్షించింది. జీఓ 3 విషయంలో కరోనా కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల సమన్వయంతో జరిగిన కృషి, ఏజెన్సీ బంద్ కార్యక్రమాలు, హరితహారం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ, పోలీసుల దాడులపై రాజీలేని పోరాటాలు, ఐటిడిఏ, కలెక్టరేట్ ముట్టడులు, పాద యాత్రలు చెప్పుకోదగ్గవి. జిల్లాలు, రంగాలవారీగా గ్రూపు చర్చలు జరిగాయి. అమరులు కుంజా బొజ్జి, సున్నం రాజ య్య ప్రాంగణంలో జరిగిన ఈ సభల ప్రారంభంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబూరావు

> టీఏజీఎస్ నిర్వహించిన ఈ "రేలా పండుం"లో ప్రేక్షకులు సైతం ఎరీనాలోకి వచ్చేసి కళాకారులతో పాటు నృత్యాలు చేసేంత ఉత్సహాన్ని నింపాయి. రెండురోజుల పాటు రాత్రి 10.30గంటల వరకూ ఈ కార్యక్రమాలు నడిచాయి. ప్రతిరోజూ "ఈరోజు ఉత్సవాలలో ఇంతటితో ముగిశాయి" అని మైక్‌లో ప్రకటించాక, అప్పటివరకూ విడివిడిగా నృత్యాలు చేసిన బృందాలన్నీ ఒక్కుమ్మడిగా గ్రౌండ్ మధ్యలోకి వచ్చి ప్రేక్షకులతో కలిసిపోయి నృత్యం చేసేవారు. ఆడ, మగ, పిల్లా, పాప, ముసలీ తేడాలేకుండా వందలాదిమంది ఒక్కటిగా నృత్యం చేయడంలో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది.

సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు, న్యాయవాది పాయం రవివర్మ, నాయకులు, ప్రతినిధులు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన పలురకాల బహు ముఖ కార్యక్రమాలు, పోరాట ఘట్టాలతో ఆ జిల్లావారు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను బృందాకరత్, డాక్టర్ మిడియం బాబూరావు ఆసక్తిగా తిలకించారు.

## సమన్వయంతో ఉత్తేజాన్ని నింపిన మహాసభలు

మహాసభ 34మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నది. కొత్తగా అనేకమంది యువతీయువకులు 25- 30ఏండ్ల యువత ఎక్కువ మంది ఎన్నిక కావడం విశేషం.13మంది ఆఫీస్ బేరర్స్‌తో సహా అధ్యక్షులుగా పార్లమెంట్ మాజీ సభ్యులు డాక్టర్ మిడియం బాబూ రావు తిరిగి ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా యువకుడు పూసం సచిన్ నూతనంగా ఎన్నికయ్యారు. రానున్న కాలానికి రాసిలోనూ, వాసిలోనూ మరిన్ని బహుముఖ కార్యక్రమాలకు, పోరాటాలకు పదును పెట్టేందుకు ఆచరణలో ముందుకుతీసుకుపోయే నమ్మకాన్ని మహాసభలు కలిగించాయని చెప్పాలి. భద్రాచలం నియోజకవర్గ కన్వీనింగ్ కమిటీ, పట్టణ కమిటీ అధ్వర్యంలో మహాసభల జయప్రదం కోసం ఏర్పాటు చేసిన కమిటీలు అన్నీ కష్టపడి పని చేశాయి. కల్చరల్ ఫెస్ట్ కమిటీ, ఫుడ్ కమిటీ, వసతుల కమిటీ, ట్రాన్స్ పోర్ట్ కమిటీ, కాలేజి గ్రౌండ్ బహిరంగసభ వేదిక కమిటీ, కాన్ఫరెన్స్ హాల్ కమిటీ, అలంకరణ కమిటీ, సోషల్ మీడియా కమిటీ ఇలా అనేక విభాగాలు కష్టపడ్డాయి. అన్ని విభాగాలను మచ్చా వెంకటేశ్వర్లు, కల్చరల్ ఫెస్ట్‌ను బండారు రవికుమార్, మెస్రం రాజు, ఏజె రమేష్ సమన్వయం చేశారు. రాబోయే కాలంలో ఆదివాసీల సంస్కృతిని కనుమరుగు చేసి అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్న కేంద్ర బీజేపీ నాయకత్వంపై తిరుగుబాటు చేయడంతో పాటు సమరశీల పోరాటాలకు ఈ మహాసభలు కొత్త భీజాన్ని వేస్తాయి.అలాగే నూతనంగా ఎన్నికైన నాయకత్వానికి పోరాటాలు దిక్సూచిగా నిలుస్తాయి. •

# మానవి



## వేసవిలో చర్మ సంరక్షణకు...


రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. సూర్య కిరణాలు, తేమ, గాలిలోని కాలుష్య కారకాల వల్ల చర్మం నిస్తేజంగా, జిడ్డుగా మారుతుంది. చెమట తెచ్చే చిరాకు కూడా ఎక్కువే. చర్మం నల్లబడిపోతుంటుంది. పొడిబారి పోతుంది. వీటితో పాటు అనేక సమస్యలు వస్తుంటాయి. అందుకే బయటకు వెళ్తే సన్ స్క్రీన్ లోషన్ రాసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. దీనితో పాటు కొన్ని చర్మ సంరక్షణలు కూడా తీసుకోవాలి.

**కొత్తిమీర :** మనకు ఇండ్లలో తప్పనిసరిగా కొత్తమీరను కూరల్లో వాడేందుకు నిల్వ చేస్తుంటారు. ఇందులోని పోషకాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మంలోని ట్యాక్సిన్లను బయటకు పంపడంలో చక్కగా పనిచేస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చర్మాన్ని అందంగా మారుస్తాయి.

**పసుపు :** వంటల్లో తప్పనిసరిగా ఉపయోగించే పసుపులో యాంటీ ఆక్సిడెంట్ గుణాలతో పాటు, అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. చర్మ కణజాలాన్ని మెరుగుపరుస్తుంది. చర్మ వాపును తగ్గిస్తుంది. చర్మం ఆకర్షణీయమైన రంగులో ఉండేందుకు సహాయపడుతుంది. దీనిని పేస్టు రూపంలో చర్మంపై అప్లై చేసుకోవచ్చు.

**వేప :**

వేప గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. దీనితో అనేక ఆయుర్వేద ప్రయోజనాలు ఉంటాయి. చర్మ సంరక్షణలోనూ వేప చాలా బాగా దోహద పడుతుంది. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలతో చర్మాన్ని డిటాక్స్ చేస్తుంది. చెమటతో మూసుకుపోయిన చర్మ రంధ్రాలను తెరిచేందుకు సహాయకారిగా ఉంటుంది. మొటిమలను నివారించడంలోనూ దీని పాత్ర ఎక్కువే. వేపను నూనె రూపంలో, పొడి రూపంలో చర్మ సంరక్షణకు ఉపయోగించవచ్చు.




# పట్టిన చీడ వదలకపోతే..?

"ఒకసారి పెండ్లి జరిగిందంటే ఇక అంతే. ఎన్ని సమస్యలు వచ్చినా, చెడైనా, మంచైనా భర్తతోనే" అంటారు కొందరు. పెండ్లి అంటే అందరూ నూరేండ్ల పంట అంటారు. పంటకు చీడలు, పురుగులు పట్టాయి అనుకోండి ఏం చేస్తాం? వాటికి పురుగు మందులు, ఎరువులు చల్లి ఆ చీడను తొలగిస్తాం. అలాగే పెండ్లితో ముడి వేసుకున్న రెండు జీవితాలకు ఏదైనా సమస్య వస్తే... వాటిని కూడా ఓర్పు, సహనం అనే ఎరువులు వేసి బాగు చేసుకునేందుకు ప్రయత్నిస్తాం. అయినా సమస్య పరిష్కారం కాకపోతే... ఏం చేయాలి... అలాంటిదే ఈ వారం ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చిన పల్లవి కథ.

పల్లవికి ప్రస్తుతం 24 ఏండ్లు. నాలుగేండ్ల కిందట ప్రేమ పెండ్లి చేసుకుంది. అప్పటి నుండే ఆమెకు సమస్యలు మొదలయ్యాయి. ఆ సమస్యల మధ్యే ఇద్దరు పిల్లలు పుట్టారు. ఇంట్లో భర్త, అత్తయ్య, పిల్లలు ఉంటారు. అసలు తన సమస్య ఏంటని పల్లవిని అడిగితే "మేడమ్ మా అత్త కూడా మాతో పాటు పడుకుంటాననంటుంది. మేము గదిలో ఏం చేస్తున్నామో, ఎలా చేస్తున్నారో చూస్తానంటుంది. అదేం ఆలోచనో నాకు అర్థం కాలేదు. మేమిద్దరం తన ముందే కాపురం చేయాలి అంటుంది. ఏం జరిగినా తన ముందే జరగాలంటుంది. లేదంటే మా ఇద్దరిని ఒక గదిలో పడుకోవద్దంటుంది.

ఆమె అలా అంటున్న రవి ఏమీ అనడు. రెండు మూడు నెలల తర్వాత నా భర్త కూడా తల్లికే సపోర్ట్ చేశాడు. తను కూడా అమ్మ చెప్పినట్టు చేద్దాం అన్నాడు. ఇక చేసేది లేక చివరికి ఒప్పుకున్నాను. కానీ నాకు ఇదంతా నరకంలా ఉంది. నా సమస్య ఎవరికి చెప్పుకోలేకపోయాను. తిరిగి మా అమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళిపోదామన్నా వాళ్ళకు ఇష్టం లేకపోయినా ప్రేమించి మరీ పెండ్లి చేసుకున్నాను. ఆ బాధతోనే మా నాన్న చనిపోయారు. ఇంకా ఏ ముఖం పెట్టుకొని అక్కడకు వెళ్ళను. పైగా ఈ మధ్య నాకు ఇష్టం లేదన్నా హింసిస్తున్నాడు. బలవంతంగా తన కోర్కెలు తీర్చుకుంటున్నాడు.

నెట్‌లో వీడియోలు చూపించి అలా చేయాలంటాడు. అది కాకుండా పక్క నుంచి వాళ్ళ అమ్మ సలహాలు. ఇప్పుడు నేను అతనికి ఓ యంత్రాన్ని మాత్రమే. ఒక సారి ఇన్ఫెక్షన్ వచ్చి డాక్టర్ దగ్గరకు వెళితే ఆమె ఆశ్చర్య పోయింది. 'లోపల అవయవాలు ఎందుకు ఇంతగా దెబ్బతిన్నాయి. అసలు ఏం జరిగిందో చెప్పు. చెబితేనే నేను చికిత్స చేయగలను. లేకపోతే కష్టం' అంది. ఒకపక్క నాకు బ్లీడింగ్ విపరీతంగా అవుతుంది. కూర్చోలేని పరిస్థితిలో ఉన్నాను. అలాగే బాధపడుతూ డాక్టర్‌కి విషయం చెప్పాను.

దానికి ఆమె 'ఎందుకు ఇతనితో అన్ని బాధలు భరిస్తున్నావు. వదిలేసి మీ అమ్మ దగ్గరకు వెళ్ళిపో లేకపోతే, ఇది ఇలాగే కొనసాగితే చచ్చిపోతావు. నీ పిల్లలు అనాథలవుతారు. నీ భర్త పెద్ద సైకోలా కనిపిస్తున్నాడు. అతనితో వుంటే నీకు ఇబ్బందులు తప్పవు' అని చెప్పింది. ఇంటికి వెళ్ళిన తర్వాత మా అమ్మకు ఫోన్ చేసి ఆరోగ్యం బాగోలేదని చెప్పాను. అమ్మ వెంటనే వచ్చింది. 'జరిగింది ఏదో జరిగిపోయిందని నన్ను, రవిని, పిల్లలను ఇంటికి తీసుకువెళ్ళింది.

మా అమ్మ నాకు దగ్గరైనందుకు చాలా సంతోషించాను. అక్కడ కొన్ని రోజులు ఉన్నాము. నాకు తగ్గిన తర్వాత మళ్ళీ మా ఇంటికి వెళ్ళాం. అప్పటి నుండి అప్పుడప్పుడు అమ్మ దగ్గరకు వెళ్ళే వాళ్ళం. కానీ రవికి మాత్రం ఇష్టం లేదు. వెళ్ళిన వెంటనే తిరిగి తీసుకువచ్చేవాడు. అమ్మకు ఎప్పుడైనా ఫోన్ చేసినా స్పీకర్ ఆన్ చేయమనేవాడు. కొంత కాలానికి రవి వాళ్ళ అమ్మ చనిపోయింది. ఇక నా కష్టాలు సగం తీరాయి అనుకున్నాను.

అయితే రవి మాత్రం సైకోలాగే ప్రవర్తించేవాడు. పిల్లల ముందే సెక్స్ చేసేవాడు. ఎంత చెప్పినా వినేవాడు కాదు. అది కూడా చాలా అసహ్యంగా. ఒకసారి అతని ప్రవర్తనతో స్పృహ తప్పి పడిపోయాను. ఆస్పత్రిలో చేర్పించారు. మా అమ్మ వచ్చింది. డాక్టరు చికిత్స చేయకుండా, పోలీసులకు ఫిర్యాదు చేస్తాను అంది. నాతో "నీకు ఇంతకు ముందే చెప్పాను. అతన్ని వదిలేసి వెళ్ళిపోమని చెప్పాను. అయినా వినలేదు. పైగా అతనిలో కూడా ఎలాంటి మార్పు లేదు' అన్నది.

రవిని మార్చుకోవడానికి ప్రయత్నం చేస్తా అని చెప్పి వచ్చాను. ఆ ప్రయత్నం కూడా చేశాను. కానీ రవిలో మార్పు మాత్రం రాలేదు. ఇక విసిగిపోయి మా అమ్మ దగ్గరకు వచ్చేశాను. దాంతో రవి నాపైన, మా అమ్మపైన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మా ఇద్దరినీ పిలిస్తే అసలు విషయం చెప్పాను. మొత్తం విన్న పోలీసులు నన్ను ఇంటికి వెళ్ళమన్నారు. అయితే రవి 'నా భార్యను నాతో పంపించకపోతే చచ్చిపోతాను అంటూ తల గోడకేసుకొని కొట్టుకున్నాడు. దాంతో పోలీసులు అతన్ని ఆస్పత్రికి తీసుకువెళ్ళి చికిత్స చేయించారు. కానీ ఇప్పుడు నాకు రవిని చూస్తేనే భయం వేస్తుంది. ఇప్పుడు ఏం చేయాలో నాకు అర్థం కావడంలేదు. అందుకే మీ దగ్గరకు వచ్చాను. మీరే నాకు సహాయం చేయాలి" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

> రవి మాత్రం సైకోలాగే ప్రవర్తించేవాడు. పిల్లల ముందే సెక్స్ చేసేవాడు. ఎంత చెప్పినా వినేవాడు కాదు. అది కూడా చాలా అసహ్యంగా. ఒకసారి అతని ప్రవర్తనతో స్పృహ తప్పి పడిపోయాను. ఆస్పత్రిలో చేర్పించారు. మా అమ్మ వచ్చింది. డాక్టరు చికిత్స చేయకుండా, పోలీసులకు ఫిర్యాదు చేస్తాను అంది. నాతో "నీకు ఇంతకు ముందే చెప్పాను. అతన్ని వదిలేసి వెళ్ళిపోమని చెప్పాను. అయినా వినలేదు. పైగా అతనిలో కూడా ఎలాంటి మార్పు లేదు' అన్నది.

ఆమె బాధను, అనుభవించిన కష్టాల గురించి విన్న లీగల్ సెల్ సభ్యులు రవిని పిలిపించారు. అతను ఎవరు ఏం చెప్పినా వినే పరిస్థితుల్లో లేడు. నా భార్యను నాతో పంపించాల్సిందే అంటున్నాడు. పల్లవికి అతనితో వెళ్ళడం ఏ మాత్రం ఇష్టం లేదు. 'ఆమె లేకుండా నేను ఉండలేను. తను లేకుంటే పిచ్చివాడినై పోతాను. నా భార్య అంటే నాకు చాలా ఇష్టం. నాకు ఎలా నచ్చితే తనతో ఉంటాను. వద్దని చేప్పే హక్కు ఎవరికి లేదు. పల్లవికి కూడా లేదు. నాతో రానంటే తనపై కేసు పెడతాను. భర్త అడిగినప్పుడు దగ్గరకు రాకపోతే కేసు పెట్టవచ్చు కదా! ఆ కేసే తనపై పెడతా' అంటూ ఇక్కడ కూడా తలను గోడలకు కొట్టుకోవడం మొదలుపెట్టాడు.

మేము అతనిని వారించి నచ్చచెప్పడానికి ప్రయత్నించాం. కానీ అతను వినే పరిస్థితిలో లేడు. వెంటనే పోలీసులను పిలిపించాము. పోలీసులు రవిని చూస్తూనే 'వాడు పెద్ద సైకోగాడు. వీడు ఎంత చెప్పినా, ఎలా చెప్పినా వినడు. ఏం చేయమంటారు' అంటూ వెళ్ళిపోయారు. ఇక మేమే ఆలోచించి అతను మానసిక జబ్బుతో బాధపడుతున్నాడని సైక్రియార్టిస్ట్ దగ్గరకు పంపించాం. ప్రస్తుతం వాళ్ళు రవికి చికిత్స చేస్తున్నారు. పల్లవి పిల్లలను తీసుకువెళ్ళి ఉద్యోగం చేసుకుంటూ అతనికి, హైదరాబాద్‌కు దూరంగా వుంటుంది.

పిల్లలు తెలిసీ తెలియక చేసిన తప్పులను తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. పిల్లల గురించి తల్లిదండ్రుల కంటే ఎవరూ బాగా ఆలోచించ లేరు. కాబట్టి ఎలాంటి విషయం అయినా సరే మొదట తల్లిదండ్రులకు చెప్పండి. వాళ్ళు మొదట తిట్టినా తర్వాత అర్థం చేసుకుంటారు. మీకు ఒక మంచి మార్గం చూపిస్తారు. ఏదో తొందరపాటుతో ఒక పని చేసినా సరే దాన్ని ధైర్యంగా మీ తల్లిదండ్రులకు చెప్పండి. గతంలో తప్పు చేశాము. ఇప్పుడు ఏమనుకుంటారో అనుకోవద్దు. ఇలా అనుకొని పిల్లలు వారి సమస్యలను ఇంకా ఎక్కువ చేసుకుంటున్నారు. తల్లిదండ్రులకు మించిన మంచి మార్గదర్శి శ్రేయోభిలాషి అంటూ ఎవరు ఉండరు. దీనికి పల్లవి జీవితం ఓ చక్కటి ఉదాహరణ. కూతురు కష్టంలో ఉన్నానని చెప్పిన వెంటనే ఆ తల్లి వచ్చి ఆదరించింది. కూతురికి అండగా నిలిచింది.

– వరలక్ష్మి, 9948794051

## రైలు దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

అయ్యింది.సికింద్రాబాద్-రేపల్లె (ట్రైన్ నెంబర్-57651) ప్యాసింజర్‌ను ఎక్స్‌ప్రెస్‌గా మారుస్తూ, రైలు నెంబర్‌ను -17645గా మార్చారు. ఎక్స్‌ప్రెస్ రైలు టిక్కెట్ ఛార్జీని వసూలు చేస్తున్నారు. అలాగే కాకతీయ ప్యాసింజర్ రైలును కూడా ఎక్స్‌ప్రెస్‌గా మార్చి ట్రైన్ నెంబర్‌ను మార్చేశారు. ఇలాంటి జిమ్మిక్కులతో సామాన్యుడి జేబులు కొల్లగొట్టి రైల్వే ఆదాయం పెంచుకొని, తామేదో ఘనకార్యం సాధించినట్టు మోడీ సర్కార్ ప్రచారం చేసుకుంటున్నది.

**రాయితీల పునరుద్ధరణ లేదు...**

కోవిడ్‌కు ముందు పలు కేటగిరీల్లో రైల్వేశాఖ ప్రజలకు రాయితీలు ఇచ్చేది. సీనియర్ సిటిజన్లు, జర్నలిస్టులు, క్రీడాకారులు సహా మొత్తం 65 కేటగిరిల్లో రాయితీలు ఇచ్చేది. కోవిడ్‌ను సాకుగా చూపి మోడీ ప్రభుత్వం వాటన్నింటినీ రద్దు చేసింది. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధులు, వికలాంగులు, కిడ్నీ, కేన్సర్ రోగులు, పార్లమెంటు సభ్యులు, కేంద్రమంత్రులు సహా 11 కేటగిరిల్లో మాత్రమే రాయితీ ఇస్తున్నారు. గతంలో వికలాంగులకు సహాయకులుగా మరో వ్యక్తికి టిక్కెట్ రాయితీ ఇచ్చేవారు. ఇప్పుడు దాన్నీ ఎత్తేశారు. రాయితీలు కొనసాగించాలని పలుమార్లు జర్నలిస్టు సంఘాలు రైల్వే అధికారులు, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చాయి. సీనియర్ సిటిజన్లకు రాయితీలు పునరుద్ధరించాలని పౌరసమాజం నుంచి అనేక విజ్ఞాపనలు వెళ్లినా, మోడీ సర్కార్ ఏమాత్రం స్పందించలేదు. సామాజిక బాధ్యతను విస్మరించి, ఆదాయమే పరమావధిగా రైళ్లను నడుపుతున్నారు.

**సీట్లు, బెర్తుల బ్లాకింగ్**

రైళ్లలో లేని రద్దీని సృష్టించేందుకు రైల్వేశాఖ సీట్లు, బెర్తుల్ని బ్లాక్ చేస్తున్నది.సహజంగా రైలులో ఎన్ని సీట్లు ఉంటాయో వాటన్నింటినీ రిజర్వేషన్ కోటాలో పెట్టాలి. అలా కాకుండా కేవలం 50 శాతం సీట్లను మాత్రమే రిజర్వేషన్ కోటాలో పెట్టి, మిగిలిన సీట్లను 'తత్కాల్' పేరుతో అధిక ధరలకు టిక్కెట్లు అమ్మేస్తున్నారు. ఫలితంగా రైలు ప్రయాణం సామాన్యులకు భారంగా మారుతున్నది.

## అందరి చూపు కర్నాటక వైపు..

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయాల్లోనూ, అటు దేశ ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. కాగా శనివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఈ నెల 10న కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. మొత్తం 224 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈసారి ఎన్నికల్లో కర్నాటక చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 73.19 శాతం ఓటింగ్ నమోదయింది. దీంతో ఫలితాలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకుని ఉంది. ఎన్నికల్లో వినియోగించిన ఇవిఎంలను పటిష్ట భద్రతతో స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచారు. శనివారం జరిగే ఓట్ల లెక్కింపు కోసం కర్ణాటక వ్యాప్తంగా 36 ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలీసుల బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు జరగనుంది. మధ్యాహ్నం 12 గంటల సమయానికే ఎన్నికల ఫలితాలపై పూర్తి స్పష్టత వస్తుందని ఎన్నికల అధికారులు చెబుతున్నారు. ఫలితాలపై మూడు ప్రధాన పార్టీలూ ఆశాజనకంగా ఉన్నాయి. మ్యాజిక్ ఫిగర్ (113) కంటే ఎక్కువ స్థానాలను సాధిస్తామని బీజేపీ, కాంగ్రెస్, జేడీ(ఎస్) ధీమాగా చెబుతున్నాయి. సీపీఐ(ఎం) నాలుగు స్థానాల్లో పోటీ చేసింది.

## జేపీఎస్‌లకు నోటీస్ ఉపసంహరించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. వారి సమస్యను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పంచాయతీ కార్యదర్శుల సమ్మె శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపి జేపీఎస్‌లతో మాట్లాడారు. జేపీఎస్‌ల సమ్మెకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ అండగా ఉందని చెప్పారు.వీరి సమస్యలపై చర్చించి సామరస్యంగా పరిష్కరించకుండా ప్రభుత్వం అణచివేత ధోరణికి పాల్పడటం సరికాదన్నారు. యూనియన్ పెట్టుకోవడం ఉద్యోగుల హక్కు అని, ప్రభుత్వ ఉద్యోగులకు, పారిశ్రామిక కార్మికులకు ప్రతి ఒక్కరికీ యూనియన్లు పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు ఉందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామని తాము చెప్పలేదని, ఒకవేళ చేయాల్సి వస్తే కమిటీ వేసి పర్ఫామెన్స్ ఆధారంగా చేస్తామని పాలకులు అంటున్నారని, ఇది చాలా అన్యాయమని అన్నారు. వెంటనే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, రాజు, నవీన్, లక్ష్మీ, పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# హిందూత్వ శక్తులతో ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక విధానం వంటి చర్చలను ముందుకు రానివ్వటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశాన్ని హిందూత్వ రాష్ట్రంగా మార్చాలన్న ఆరెస్సెస్.. ఆ ప్రయత్నాన్ని తొమ్మిది దశాబ్దాల కిందే మొదలు పెట్టిందనీ, ఆ ప్రయత్నాలు మోడీ పాలనలో పుంజుకుంటున్నాయని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ సర్కారు రాజ్యాంగం ప్రకారం నడుచుకొని దేశ ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సింది పోయి.. సంఘ్ భావజాలాన్ని అమలుపర్చడానికి కృషి చేస్తున్నదన్నారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇదే పంథాను అవలంభిస్తున్నదని సామాజికవేత్తలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. సావర్కర్, గాడ్సే వంటి వ్యక్తులను బీజేపీ పార్టీ ఆరాధించటం ఆ పార్టీ ప్రభుత్వ తీరుకు నిదర్శనమన్నారు.

దేశంలోని ముస్లింలు, క్రైస్తవులు, ఇతర మైనారిటీలు అభద్రతా జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. మోడీ పాలనలో వారిపై విద్వేషం మరింతగా పెరిగిపోయిందని అన్నారు. కూడు, గూడు, గుడ్డ వంటి ప్రాథమిక అవసరాలను తీర్చి ప్రజలను ఆదుకోవాల్సింది పోయి.. ఆ అంశాల మీదే మత చిచ్చు పెడుతూ బీజేపీ రాజకీయంగా లబ్ది పొందుతున్నదని నిపుణులు అన్నారు.

యూపీలోని యోగి పాలనలో ఒక ముస్లిం గ్యాంగ్‌స్టర్‌ను పోలీసుల భద్రత నడుమే నిందితులు కాల్చటం బీజేపీ ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిదర్శనమన్నారు.



ఈ ఏడాది ఏప్రిల్‌లో బీజేపీ పాలిత మహారాష్ట్రలోని ముంబయిలో క్రైస్తవులపై జరిగిన దాడుల పట్ల క్రైస్తవ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మతం పేరుతో జరిగే రాజకీయాలకు స్వస్తి పలకాలనీ, రాజ్యాంగాన్ని పూర్తిగా అమలు పరిచి దాని విలువలను కాపాడాలని సామాజికవేత్తలు, నిపుణులు తెలిపారు. ఇలాంటి విషయంలో హిందూత్వ శక్తుల ప్రయత్నాలకు తలొగ్గకూడదని తెలిపారు. దేశంలోని దళితులు, మైనారిటీల రక్షణ విషయంలో రాజకీయ పార్టీలు ఏకమై బీజేపీ ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

## రాహుల్ గాంధీకి శిక్ష విధించిన జడ్జి పదోన్నతి నిలిపివేత..

**నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో**

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి రెండేండ్ల జైలు శిక్ష విధించిన సూరత్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హరీశ్ హస్ముఖ్ భాయ్ వర్మ పదోన్నతిని అత్యున్నత న్యాయస్థానం నిలిపివేసింది. గుజరాత్‌లో కింది కోర్టుల్లో పనిచేసే 68 మంది న్యాయాధికారులకు జిల్లా జడ్జిలుగా పదోన్నతి కల్పిస్తూ గుజరాత్ హైకోర్టు సిఫారసులు, గుజరాత్ ప్రభుత్వం ఉత్తర్వుల జారీపై సుప్రీంకోర్టు స్టే విధించింది. వీరిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి జైలు శిక్ష విధించిన సూరత్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హరీశ్ హస్ముఖ్ భాయ్ వర్మ కూడా ఉన్నారు. వీరి పదోన్నతి చట్ట వ్యతిరేకమని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది.

హరీశ్ హస్ముఖ్ భాయ్ సహా 68 మంది న్యాయమూర్తులను జిల్లా జడ్జి కేడర్ కు ప్రమోట్ చేస్తూ ఈ ఏడాది ఏప్రిల్లో గుజరాత్ హైకోర్టు సెలక్షన్ జాబితాను జారీ చేసింది. అయితే, ఈ జాబితాను సవాల్ చేస్తూ సివిల్ జడ్జి కేడర్ కు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'మెరిట్- కమ్- సీనియారిటీ' ఆధారంగా కాకుండా.. 'సీనియారిటీ- కమ్- మెరిట్' ఆధారంగా నియామకాలు చేపట్టారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్లను విచారించిన సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.ఈ పిటిషన్ పై ఇటీవల విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. గుజరాత్ ప్రభుత్వం, గుజరాత్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కు నోటీసులు జారీ చేసింది. అయితే కోర్టు నుంచి నోటీసులు వచ్చినప్పటికీ.. గుజరాత్ ప్రభుత్వం ఆ న్యాయమూర్తులకు ప్రమోషన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై తాజాగా మరోసారి విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. గుజరాత్ ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసు కోర్టులో పెండింగ్‌లో ఉందని తెలిసి కూడా ప్రభుత్వం వారికి పదోన్నతి కల్పించడం దురదృష్టకరమని కోర్టు పేర్కొంది." కోర్టు నిర్ణయానికి విభిన్నంగా ఆ న్యాయమూర్తులకు పదోన్నతి కల్పించడం చట్టవిరుద్ధం. ఆ ప్రమోషన్ జాబితా అమలుపై స్టే విధిస్తున్నాం. పదోన్నతి దక్కిన న్యాయమూర్తులు తిరిగి వారి గత పదవుల్లోకి వెళ్లిపోవాలి" అని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ధర్మాసనం తదుపరి విచారణ జరుపుతుందని స్పష్టం చేసింది.సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఆర్ షా మే 15న పదవీ విరమణ చేయనుండగా, ఈ అంశాన్ని ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కొత్త ధర్మాసనానికి కేటాయించనున్నారు.

# ఈ పోరాటం ఆగదు

### మూడు వారాలకు చేరిన రెజ్లర్ల ఆందోళన

**నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో**

లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన మూడు వారాలకు (21వ రోజు) చేరింది.

**సిట్ ఏర్పాటు : కోర్టుకు ఢిల్లీ పోలీసులు**

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ని ఏర్పాటు చేసినట్లు ఢిల్లీ పోలీసులు శుక్రవారం ఢిల్లీ ప్రత్యేక కోర్టుకు తెలియజేశారు. స్టేటస్ నివేదికను దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు ప్రతిస్పందనగా అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ జస్పాల్ ముందు ఢిల్లీ పోలీసులు నివేదిక సమర్పించారు. 'కేసు తీవ్రత దృష్ట్యా సిట్‌ని ఏర్పాటు చేశాం. సిట్ ఈ కేసును దర్యాప్తు చేస్తుంది"అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ కోర్టుకు తెలిపారు. ఈ విషయంలో స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసినట్లు తెలిపారు. కేసు స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని నివేదికను ఎవరితోనూ పంచుకోవద్దని అభ్యర్థించారు. ఈ నివేదికను ఢిల్లీ పోలీసులు సీల్డ్ కవర్‌లో దాఖలు చేశారు. సమర్పణ తరువాత, తదుపరి విచారణను మే 27కి కోర్టు వాయిదా వేసింది. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా అన్ని సాక్ష్యాలను సేకరించేందుకు ఢిల్లీ పోలీసు బృందం ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, హర్యానాలకు వెళ్లి ఆధారాలను సేకరిస్తుంది.

**18న దేశవ్యాప్త ఆందోళన: ఆరు సంఘాలు ఉమ్మడి పిలుపు**

మల్లయోధుల పోరాటానికి సంఘీభావంగా మే 18న దేశవ్యాప్తంగా ఆందోళనకు ఆరు సంఘాలు పిలుపు ఇచ్చాయి.ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాలు సంయుక్తంగా పిలుపు ఇచ్చాయి. "జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్ల నిరవధిక ధర్నా కొనసాగుతోంది. నిందితులపై బీజేపీ ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బ్రిజ్ భూషణ్, సందీప్ సింగ్‌లను అరెస్టు చేయలేదు" అని పేర్కొన్నాయి. 18న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ర్యాలీలు, ధర్నాలు, క్యాండిల్ లైట్ ప్రదర్శనలు చేయనున్నట్టు తపన్ సేన్ (సీఐటీయూ) విజూ కృష్ణన్ (ఏఐకేఎస్), బి. వెంకట్ (ఏఐఏడబ్ల్యూయూ,),మరియం ధావలే (ఐద్వా), హిమఘ్నరాజ్ భట్టాచార్య (డీవైఎఫ్ఐ), మయూఖ్ బిస్వాస్ (ఎస్ఎఫ్ఐ) ప్రకటనలో తెలిపారు.

## టికెట్ల ముద్రణ ఇక ఔట్‌సోర్సింగ్ !

- ప్రింటింగ్ ప్రెస్సులు మూసివేయనున్న రైల్వే
- వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు



**న్యూఢిల్లీ :** 2019లో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దేశంలోని ఐదు టికెట్ ప్రింటింగ్ ప్రెస్సులను మూసివేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇకపై టికెట్ల ముద్రణ బాధ్యతను ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వాలని కూడా నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయాన్ని ఆల్‌ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ (ఎఐఆర్ఎఫ్), సదరన్ రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్ఆర్ఎంయు), ఇతర కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కార్మిక సంఘాల వ్యతిరేకత దృష్ట్యా గతంలో రైల్వే శాఖ తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నప్పటికీ ఇప్పుడు మళ్లీ ముందుకు వెళుతోంది. చెన్నైలోని రోయపురం, సికింద్రాబాద్, ముంబయిలోని బైకుల్లా, పశ్చిమబెంగాల్ లోని హౌరా, ఢిల్లీలోని షాకూర్‌బస్తీ ప్రింటింగ్ ప్రెస్సులను మూసివేస్తారు. ఈ మేరకు అన్ని జోనల్ కార్యాలయాలకు సమాచారం ఇచ్చారు. ప్రెస్సులలోని సిబ్బందిని ఇతర విభాగాలలో సర్దుబాటు చేస్తారు. యంత్రాలు, ప్లాంట్లను సంబంధిత జోనల్ కార్యాలయాలు విక్రయిస్తాయి. ప్రింటింగ్ ప్రెస్సులు ఉన్న స్థలాలను 'ప్రయోజనం కలిగే రీతిలో వినియోగిస్తా'మని చెబుతున్నారు. అయితే చరాస్తులను వాణిజ్య అవసరాల కోసం అభివృద్ధి చేస్తారా లేక బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తారా అనేది తెలియరాలేదు. ప్రింటింగ్ ప్రెస్సులను మూసివేయడంతో టికెట్ల ముద్రణను రిజర్వ్‌బ్యాంక్ లేదా భారతీయ బ్యాంకుల సంఘం అనుమతితో సెక్యూరిటీ ప్రింటర్లకు ఔట్‌సోర్సింగ్ ఇస్తామని రైల్వే శాఖ తెలిపింది. కార్మికులందరూ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని రైల్వేలో అతిపెద్ద కార్మిక సంఘం ఎఐఆర్ఎఫ్ అధ్యక్షుడు కె.కన్నయ్య చెప్పారు. రైల్వేల రోజువారీ పనులకు దశాబ్దాల తరబడి ఈ ప్రెస్సులు సేవలు అందిస్తున్నాయని గుర్తు చేశారు. టికెట్ల ముద్రణ వంటి పనులను ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వకూడదని అన్నారు. ఇప్పటికే ప్రింటింగ్ ప్రెస్సులలో సిబ్బందిని కుదించారని, పదవీవిరమణ చేసిన వారి స్థానంలో కొత్త వారిని నియమించలేదని తెలిపారు.

## అదానీపై దర్యాప్తునకు సెబీకి గడువు పెంపు

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేసింది. చేసే పనిలో కాస్త హుషారు ఉండాలని తెలిపింది. దర్యాప్తు కోసం ఓ బృందాన్ని ఏర్పాటు చేయాలని, కనీస గడువును ఆరు నెలలుగా నిర్ణయించలేమని చెప్పింది. ఆగస్టు రెండో వారం తువాత తదుపరి విచారణ జరుపుతామని, అప్పటికి నివేదికను సిద్ధం చేయాలని తెలిపింది. సెబీ నిరవధికంగా సుదీర్ఘ సమయాన్ని తీసుకోకూడదని, గడువును మూడు నెలలు మాత్రం పొడిగించగలమని తెలిపింది.సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ (రిటైర్డ్) ఎఎం సప్రే కమిటీ నివేదిక సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి ఇటీవల చేరింది. ఈ విషయాన్ని ధర్మాసనం తెలిపింది. దీనిపై ఈ కమిటీ చేసిన పరిశీలనలను పరిశీలించిన తరువాత మే 15న విచారణ జరుపుతామని తెలిపింది. దర్యాప్తు కోసం గడువును పొడిగించాలని సెబీ చేసిన విజ్ఞప్తిపై ఆదేశాలను మే 15న జారీ చేస్తామని తెలిపింది.

అదానీ గ్రూప్‌పై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. రెండు నెలల్లోగా దర్యాప్తు జరిపి, నివేదికను సమర్పించాలని సెబీని సుప్రీంకోర్టు మార్చిలో ఆదేశించింది. అదే విధంగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎఎం సప్రే, మాజీ బ్యాంకర్లు కెవి కామత్, ఒపి భట్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, సెక్యూరిటీస్ లాయర్ సోమశేఖర్ సుందరేశన్, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జెపి దేవధర్‌లతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కూడా రెండు నెలల గడువును ఇచ్చింది. సెబీ మే 2 నాటికి దర్యాప్తును పూర్తి చేసి ఉండవలసింది. కానీ ఏప్రిల్ 29న సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో తమకు మరో ఆరు నెలల గడువు కావాలని అడిగింది. అలాగే అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంపై నిపుణుల కమిటీ నివేదికను అత్యున్నత న్యాయస్థానం స్వీకరించింది.

## 'ప్రభుత్వ భూమిని అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు'



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రభుత్వ భూములను విక్రయించినా, కొనుగోలు చేసినా కఠినమైన చర్యలు ఉంటాయని మేడిపల్లి తహసీల్దారు మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్ 63లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి, రాత్రికి రాత్రే ఇండ్ల నిర్మాణాలు చేపట్టి..అమ్ముకుంటున్నారని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వాటిని కూల్చివేస్తున్నట్టు పేర్కొన్నారు. కోర్టు ఆర్డర్ పేరుతో నిర్మాణాలు చేస్తున్నారని, వాటిని న్యాయ నిపుణుల సలహాతో కూల్చివేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూముల సంరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ భూముల పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## 'చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి'



నవతెలంగాణ- ఉప్పల్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపు 2023లో భాగంగా ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో ఎల్బీనగర్ జోనల్ స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ లో క్విజ్ కాంపిటేషన్ విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఈఈ నాగేందర్‌తో పాటు కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. తెలంగాణ క్రీడ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలి అని విద్యార్థులకు సూచించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ లు ఏర్పాటు చేసిన నూతన స్టేడియాల క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని కొనియాడారు.

## 'రేవంత్ రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకో'



నవతెలంగాణ-బోడుప్పల్

పీసీసీ తెలంగాణ చీఫ్ రేవంత్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, లేకుంటే బీసీ సమాజం తగిన రీతిలో బుద్ధి చెబుతుందని ఫీర్జాదిగూడ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పాశం రాజూ యాదవ్ హెచ్చరించారు. ఫీర్జాదిగూడ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి అగ్రకుల అహంకారంతో బీసీ సమాజిక వర్గం నేతలైన తలసాని శ్రీనివాస్ యాదవ్ పై విమర్శలు చేయడమే కాకుండా యాదవుల కుల వత్తిని కించపరిచారని మండిపడ్డారు. కుల వత్తుల పట్ల అగౌరవంగా మాట్లాడే సంస్కారం లేని రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తొలగించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి వాఖ్యాలు యాదవుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ఉన్నాయన్నారు. తక్షణమే యాదవులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.. లేని పక్షంలో ప్రజల్లో ఎక్కడ తిరిగినా అడ్డుకుంటామని హెచ్చరించారు.

## మా ప్లాట్‌పై రాజకీయ నాయకుల కన్ను

- ఓపన్ ప్లాట్ అంటూ బోర్డు పెట్టిన గ్రామ పంచాయతీ
- న్యాయం చేయాలని కోరుతున్న బాధిత దంపతులు



నవతెలంగాణ - ఘట్కేసర్

గ్రామానికి చెందిన కొంత మంది రాజకీయ నాయకులు తమ ప్లాట్‌పై కన్నేసి ఓపన్ ప్లాట్ అంటూ గ్రామపంచాయితీ బోర్డు పెట్టడం ఏంటని బాధితులు ఎం. ఉషారాణి దంపతులు ప్రశ్నించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘట్కేసర్ మండలం ఘణపూర్ గ్రామం సర్వే నెంబర్ 1134లోని ప్లాట్ నంబర్ 57, విస్తీర్ణం 267 చదరపు గజాలు ఉంటుందన్నారు. అయితే గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఇంచార్జి సర్పంచ్, మరికొంత మంది నాయకులు దౌర్జన్యంగా తమ ప్లాట్ లో మేం నాటిన హద్దురాళ్లను తొలగించి చదును చేస్తుండగా అడ్డుకున్నారని ఆరోపించారు. అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ ఇప్పుడు కొత్తగా పంచాయతీ కార్యదర్శి ఓపన్ ప్లాట్ అని బోర్డు పెట్టడం ఏంటని ప్రశ్నించగా.. కార్యదర్శి గతంలో ఇక్కడ పనిచేసిన పంచాయతీ అధికారులు 1986లో ఓపన్ ప్లాట్ అని ప్రభుత్వానికి నివేదికను అందించినట్లు చెప్పారని తెలిపారు.

**సబ్ రిజిస్ట్రార్ ఎలా రిజిస్ట్రేషన్ చేశారు.?**

తాము 1991లో కె. సుదర్శన్ వద్ద నుండి ఆ ప్లాట్ ను కొనుగోలు చేశాం. 1986లో ఓపన్ ప్లాట్ అని రికార్డులో ఉంటే..1991లో సబ్ రిజిస్ట్రార్ ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ఉషారాణి దంపతులు ప్రశ్నించారు. ఉద్దేశ పూర్వకంగా కొంత మంది నాయకులు మా ప్లాట్ ను ఆక్రమించుకోడానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లే అవుట్‌లో ప్లాట్ నంబర్ ఉన్నప్పటికీ ఓపన్ ప్లాట్ అంటూ గ్రామ పంచాయతీ బోర్డు పెట్టడం ఎంతవరకు న్యాయమని వాపోయారు. అధికారులు స్పందించి మా ప్లాట్ ను మాకు ఇప్పించాలని కోరారు. లేనిపక్షంలో గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయి ఓపెన్ క్రికెట్ పోటీలకు
## బడంగ్‌పేట్ ప్రభుత్వ విద్యార్థులు ఎంపిక



నవతెలంగాణ- బడంగ్‌పేట్

నియోజకవర్గం పరిధిలోని బడంగ్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఓపెన్ క్రికెట్ పోటీలను ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ నెల 8 నుండి 14వ తేదీ వరకు జోగులాంబ గద్వాల జిల్లా ఐజ పట్టణంలోని తిక్క వీరేశ్వర స్వామి ఆలయం మైదానంలో ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారని చెప్పారు. ఈ టోర్నమెంట్‌కు తమ పాఠశాల నుంచి 11 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. విజేతలైన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు..తెలంగాణ రాష్ట్ర బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేతుల మీద అందుకుంటారని తెలిపారు. ఈ టోర్నీకి దాదాపుగా 87 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. మొదటి రౌండ్‌లో పాఠశాలకు చెందిన క్రీడాకారులు గెలుపొందారని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసినట్లు చెప్పారు.

**పాఠశాల నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు..**

భరత్, మనోజ్, నవీన్, చరణ్, సాయి జగన్, బబ్లు, సూర్య, నిఖిల్, రాకేష్, కార్తీక్, వెంకట్, వరుణ్, ఈశ్వర్, సురేష్, వెంకట్ సాయి యశ్వంత్‌లు పాఠశాల నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులకు ఉపాధ్యాయులు, తల్లీదండ్రులు అభినందనలు తెలిపారు.

## విద్యుత్ అంతరాయం లేకుండా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తాం

- ఎమ్మెల్యే బలాల



నవతెలంగాణ- సంతోష్ నగర్

మలక్‌పేట్ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేసేందుకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. ఆజంపురా డివిజన్ యూపీహెచ్సీ ఆవరణలో రూ.13.35కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ డబీర్పురా సబ్ స్టేషన్ ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను నివారించేందుకు అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటుచేసి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డబీర్పురా సబ్ స్టేషన్ ఏర్పాటు ద్వారా షా కాలనీ, అంజుమన్, ఫర్హత్నగర్, షేక్ ఫయాజ్ కి చమన్, నూర్ ఖాన్ బజార్, కోమట్వాడీ, డబీరప్పురా, ఆజంపురా, నాగా బౌలి, అబ్బాస్ వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాలకు సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఆయా పరిధిలో గృహావసరాల కనెక్షన్లు 8200, వాణిజ్య సముదాయాలు 450, పరిశ్రమలు 55 సర్వీసు వినియోగదారులు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నేతలు మొహియుద్దీన్ అబ్రార్, సైఫుద్దీన్ షఫీ, టీఎస్పీడీసీఎల్ సీజీఎం నర్సింహా స్వామి, ఎస్ఇ బ్రహ్మం, ఎస్ఇ మాస్టర్ ప్లాన్ శ్రీనివాసాచారి, డీఈ హన్మంత్ రెడ్డి, ఏడీ ఈ మాస్టర్ ప్లాన్ కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొడుకు కండ్ల ముందే
## భార్యను దారుణంగా చంపిన భర్త

- అతి కిరాతకంగా కత్తితో మెడ కోసిన భర్త
- అడ్డొచ్చిన కొడుకుపైనా దాడి..
- విడాకులు పత్రం మీద సంతకం పెట్టలేదని ఘాతుకం



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురంలో దారుణం చోటు చేసుకుంది. విడాకులు ఇవ్వట్లేదని కట్టుకున్న భార్యను ఓ కానిస్టేబుల్ తమ కొడుకు ముందే అతి దారుణంగా హత్య చేశాడు. వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మునగాల మండలం నరసింహాల గూడెంకు చెందిన కుంచపు రాజ్ కుమార్‌కు 17 సంవత్సరాల క్రితం జనగామ జిల్లా దేవరుప్పులకు చెందిన శివరాత్రి ఇందయ్యా కుమార్తె శోభ(30) తో వివాహం జరిగింది. వారికి ఇద్దరు మగ సంతానం. పెద్ద కుమారుడు సాత్విక్ పదో తరగతి, రెండో కుమారుడు నితిక్ నాలుగో తరగతి చదువుతున్నారు. రాజ్‌కుమార్ ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా హైకోర్టు నాలుగో గేటు వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. అతని భార్య ఇంట్లో టైలరింగ్ పని చేస్తోంది. వారు గౌతమ్‌నగర్‌లో నివసిస్తున్నారు. ఇదిలా ఉండగా చాలా రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. రాజ్ కుమార్ భువనగిరిలోని విధులు నిర్వహిస్తున్న సమయంలో శోభ కుటుంబీకులు రాజ్ కుమార్ ప్రవర్తన సరిగ్గా లేదని, భార్యను విడాకులు కోసం వేధింపులు గురి చేస్తున్నాడని కోర్టుని ఆశ్రయించారు. రాజ్ కుమార్ ప్రవర్తన మారకపోతే విధుల నుంచి తొలగిస్తామని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామనిఈ మేరకు ఎస్‌పీఎఫ్ డీజీపీ హామీ ఇచ్చారు. అనంతరం దంపతులు గౌతమ్ నగర్‌లో నివాసముంటున్నారు. రెండు రోజుల క్రితం భార్య భర్తల మధ్య పెద్ద గొడవ జరగడంతో శోభ తన పిల్లలతో కలిసి మహేశ్వరం మండలంలోని చిన్నమ్మ ఇంటికి వెళ్ళింది. తిరిగి గురువారం పిల్లలతో సహా గౌతమ్ నగర్‌కు చేరుకుంది. అయితే భార్య విడాకులు ఇవ్వట్లేదని ఆగ్రహంతో ఉన్న రాజ్‌కుమార్ గురువారం రాత్రి నైట్ డ్యూటీ చేసి శుక్రవారం ఉదయం నేరుగా ఇంటికి చేరుకున్నాడు. భార్య ముఖం మీద పిడు గుద్దులు గుద్దడంతో భయాందోళనకు గురైన ఆమె తప్పించుకోవడానికి గేటు వరకు పరిగెత్తింది. అయితే భర్త మృగంలా వేటాడుతూ తాను కొనుగోలు చేసిన కత్తిని బయటకి తీసి శోభ మెడపై దాడి చేశాడు. ఆ సమయంలో పెద్ద కుమారుడు సాత్విక్ అడ్డుపడగా అతని రెండు చేతులకు గాయాలయ్యాయి. దాంతో అతను వెంటనే ద్విచక్ర వాహనంపై వనస్థలిపురం పోలీస్ స్టేషన్ వెళ్లి విషయాన్ని చెప్పాడు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే కొన ఊపిరితో ఉన్న శోభ తుది శ్వాస విడిచింది. నిందితుడు పరారీలో ఉండగా అతని కోసం పోలీసులు ఐదు టీంలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.

**తన కుమార్తెను చంపిన కిరాతకుడుని శిక్షించాలి**

తమ కూతురిని ఆమె భర్త అతి దారుణంగా హత్య చేశాడని తెలుసుకున్న మతురాలి శోభ తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కన్నీటిపర్వతమయ్యారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులను వేడుకున్నారు. అలాగే పోలీస్ స్టేషన్ ముందు కాసేపు బైఠాయించి నిరసన తెలిపారు.

## 'ఐఎస్ సదన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా'



నవతెలంగాణ - సంతోష్ నగర్

ఐఎస్ సదన్ డివిజన్‌ను ఆదర్శవంత ంగా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ కాలనీ పార్క్ లో శుక్రవారం చేపట్టిన నూతన కమ్యూనిటీ హాల్ భూమి పూజలో కార్పొరేటర్ ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ మెంబర్స్ పరమేశ్వర్ రెడ్డి , అచ్యుతా రెడ్డి, చిన్న కిషన్ రెడ్డి, సుధీర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, జయ ప్రకాష్, శంకర్ కుమార్ పాల్గొన్నారు.

## రవీందర్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ - వనస్థలిపురం

భారతీయ జనతా పార్టీ ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్‌కు శుక్రవారం రంగారెడ్డి జిల్లా(అర్బన్) కార్యవర్గ సభ్యుడు జి.వాసు చౌదరి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ కు పూల బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శంకర్, జీవన్, నగేష్, శివ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఏరులై పారుతున్న మురుగునీరు



నవతెలంగాణ- సంతోష్ నగర్

సైదాబాద్ మండలం ఎదురుగా డ్రయినేజీ మురుగు నీరు బయటకి పొంగిపొర్లుతుంది.. అయినా అటువైపు కన్నెత్తి చూసే అధికారి లేకపోవడం.. అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఒకప్పుడు ఎంతో గొప్పగా పేరున్న కార్యాలయం అధికారుల నిర్లక్ష్యం కారణంగా అన్ని పనులు పెండింగ్ లో పడిపోతున్నాయి. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ దుర్గాభవాని నగర్ కాలనీ ఆవరణలో బైక్ మెకానిక్ షాప్ వద్ద నిత్యం వివాదాలకు మారుతోందని మున్సిపల్ సిబ్బంది చెబుతున్న పరిస్థితి కనబడుతోంది. సర్కిల్ కార్యాలయంలోనే ఇలాంటి దుస్థితి ఉంటే ఇతర కాలనీలలో పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేనియెడల సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పలువురు కాలనీ పెద్దలు హెచ్చరించారు.

## 'నర్సులు దేవతలు, సేవా మూర్తులు'



నవతెలంగాణ-బోడుప్పల్

వైద్య రంగంలో నర్సులు కనిపించే దేవతలు, సేవా మూర్తులు అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ కొనియాడారు. ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బోడుప్పల్ యూపీహెచ్సీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడారు. మూడేండ్ల కిందట ప్రపంచాన్నే అతలాకుతలం చేసిన కరోనాను కట్టడి చేయడంలో నర్సుల పాత్ర వెలకట్టలేనిదని హర్షం వ్యక్తం చేశారు. వారు అందించిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేనివని పేర్కొన్నారు. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, రోజుల తరబడి కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి సేవలందించారని గుర్తుచేశారు. అనంతరం ఫ్లోరెన్ నైటింగేల్ జన్మదినోత్సవం సందర్భంగా నివాళు లు అర్పించి కేక్ కట్ చేశారు. తర్వాత నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సరస్వతి, యూపీహెచ్సీ వైద్య అధికారి డాక్టర్ రవీంద్ర బాబు, డీపీహెచ్ఎన్ వో పద్మ నారాపల్లి, బోడుప్పల్, ఫీర్జాదిగూడలకు చెందిన యూపీహెచ్సీల నర్సులు పాల్గొన్నారు.

## 'నర్సులు రోగులకు ప్రత్యక్ష దైవాలు'



నవతెలంగాణ-బోడుప్పల్

సేవకు ప్రతిరూపాలు.. రోగులకు ప్రత్యక్ష దైవాలు నర్సులు అని ఫీర్జాదిగూడ అంకుర హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సీ.సుమన్ అన్నారు. నర్సుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గౌరవానికి ప్రతీక నర్సు వత్తి అని కొనియాడారు. దవాఖానకు వచ్చి తిరిగి వెళ్లే వరకూ రోగికి సేవలందిస్తుంటారని చెప్పారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన ఘనత నర్సులకే దక్కుతుందన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. నర్సులను హాస్పిటల్ యాజమాన్యం మెమోంటాలతో సత్కరించారు. హాస్పిటల్ స్టాఫ్, నర్సులు పాల్గొన్నారు.

## పదిలో శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల విజయభేరి




నవతెలంగాణ-తుర్కయాంజల్

పదో తరగతి ఫలితాల్లో శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు ఆర్. శ్రీహిత్ రెడ్డి (96%), బి.లిఖిత (96%), కే. పలక్ (94%), ఆర్. లిఖిత (93%) అన్ని సబ్జెక్ట్స్‌లో ఏ1 గ్రేడ్లు సాధించినట్లు తెలిపారు. 51 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో ఏ 1 గ్రేడ్లు, 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అకాడమిక్ అడ్వైసర్ ఫాతిమా షబ్నం తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ చింతల సంగమేశ్వర గుప్తా, చైర్మన్ బిట్ల శ్రీనివాస రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఎంవో అరుణ్, కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## టెన్త్‌లో శ్రీ చైతన్య జయభేరి



నవతెలంగాణ- బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని తెలంగాణ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో జయభేరి మోగించినట్లు పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అన్నారు. మొత్తం 33 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. విద్యార్థిని ఎం.అనన్య కు జీపీఏ10/10 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీ విద్యా, ఏజీఎం వెంకట్, కో ఆర్డినేటర్ రమేష్, ప్రిన్సిపాల్ రాజేందర్, అకాడమిక్ డీన్ మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ స్కూళ్ల చదువుతోనే ఉన్నత స్థాయి'



నవతెలంగాణ-హయత్ నగర్

ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన వారు ఉన్నత స్థాయిలో ఉంటున్నారని ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో మన్సూరాబాద్ డివిజన్‌కు చెందిన చంద్రిక ఎల్బీనగర్‌ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ మొదటి సారిగా 10/10 సాధించి.. చరిత్ర సష్టించిందని కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో చంద్రికను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జక్కిడి రఘు వీర్ రెడ్డి, నవీన్, చంద్రిక తండ్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గింజనూ ప్రభుత్వం కొంటుంది



నవతెలంగాణ-తుర్కయాంజల్

రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రంగారెడ్డి జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి అన్నారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని రైతులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు సామ సంజీవరెడ్డి, కష్ణ రెడ్డి, యాదగిరి, అబ్దుల్లాపూర్ మెట్ రైతు బంధు కోఆర్డినేటర్ కందాల బలదేవ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు వేముల అమరేందర్ రెడ్డి, నాయకులు మర్రి సంపతీశ్వర్ రెడ్డి, కొండ్రు శ్రీనివాస్, అయ్యప్ప రెడ్డి, ఏవో కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్




నవతెలంగాణ-హయత్ నగర్

మహిళలు, యువతులు, బాలికలపై జరుగుతున్న అగాయిత్యాలను నివారించేందుకు రాచకొండలో కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్ ఆదేశాల మేరకు స్పెషల్ టీం ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు షీ టీం డీసీపీ శ్రీ బాల వెల్లడించారు. ఎల్బీనగర్ షీ టీం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ మాట్లాడారు. రాచకొండ షీ టీమ్స్ స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లు, రద్దీ ప్రదేశాలలో హాట్ స్పాట్ లను గుర్తించి.. 9.02.2023 నుండి 12.05.2023 వరకు మఫ్టీ లో డెకాయ్ ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. మహిళలను ఇబ్బంది పెట్టే 385 మంది ఆకతాయిలను గుర్తించినట్లు చెప్పారు. వారిపై 51 ఎఫ్ఐఆర్‌లు, 61 పెట్టి కేసులు, 118 కౌన్సెలింగ్‌లను ఇచ్చినట్లు వివరించారు. ఎల్బీనగర్ షీ టీం కార్యాలయంలో శుక్రవారం బూమిక ఎన్ జీవో కౌన్సిలర్స్ 112 మంది ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ షీ టీం వెంకట్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గాయత్రి నగర్‌లో
## కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-హయత్ నగర్

కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు హయత్ నగర్ డివిజన్ గాయత్రి నగర్‌లో వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం స్పం దించిన కార్పొరేటర్ మాట్లాడుతూ పటిష్టమైన ప్రణాళికను రూపొందించి, వీలైనంత త్వరగా గాయత్రి నగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజ్ ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, విక్రమ్, శ్రీనివాస్ చారి, మల్లికార్జున్, ప్రకాష్, సూపర్ వైజర్ బాలు నాయక్ పాల్గొన్నారు.

## పదిలో సత్తా చాటిన పెట్రోస్ హైస్కూల్



నవతెలంగాణ- సంతోష్‌నగర్

సైదాబాద్ మండలం ఆనంద్ నగర్ పరిధిలోని పెట్రోస్ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 23 మంది విద్యార్థులు 10/ 10 పివీజే పవన్, నగేష్ 9.2 సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ రావు రత్న రావు పుష్ప గుచ్ఛాలు అందజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లీదండ్రులు పాల్గొన్నారు.

## టెన్త్‌లో 'అర్క స్కూల్' ప్రభంజనం




నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి అల్మాస్ గూడలోని అర్క ఇంటర్ నేషనల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సష్టించారు. అందులో మొదటి బ్యాచ్‌లో 30 మంది విద్యార్థులు వంద శాతం ఉతీర్ణత సాధించినట్లు స్కూల్ చైర్మన్ ఏనుగు తిరుమల్ రెడ్డి తెలిపారు. సంజన శ్రీ టాప్ 1, సహస్ర చంద్రిక టాఫ్ 2, అక్షయరెడ్డి టాఫ్ 3గా నిలిచినట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను చైర్మన్ తిర్మల్ రెడ్డి అభినందించారు.

## ఇంటర్‌లో
## స్టేట్ ర్యాంక్ సాధించిన
## సంకల్ప జూనియర్ కళాశాల



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడలోని సంకల్ప జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ లో స్టేట్ ర్యాంక్ సాధించి ప్రభంజనం సష్టించారు. కే.స్వాతి ఎంపీసీలో 467/470, ఎన్.వైశాలి 467/470, శ్రీ హారిక 467/470, బైపీసీలో కే.అనూష 437/440, సెకండ్ ఇయర్ బైపీసీలో జీ.వర్ష 990/1000, టి.స్పందన 989/1000 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని ఆమె స్వగృహంలో శుక్రవారం కలిశారు. అనంతరం స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులను, కళాశాల యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల సమస్యలపై అధికారులతో చర్చించిన బీఎల్ఆర్

నవతెలంగాణ-కాప్రా

వాటర్ వర్క్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్, ప్రజా సమాచార అధికారి సుప్రియను బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాప్రా డివిజన్ వినాయక నగర్ ఛత్రపతి శివాజీ నగర్ అండర్ గ్రౌండ్ లేని కారణంగా ఆయా కాలనీలు ఎదుర్కొం టున్న సమస్యల మీద చర్చించారు. అందుకు ప్రజా సమాచార అధికారి స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి బైరి నవీన్ గౌడ్, వినాయక కాలనీ ప్రెసిడెంట్ అనిల్, సీఎస్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ పూజ, రాబీన్ సన్, ప్రియ తదితరులు పాల్గొన్నారు .



## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు

నవతెలంగాణ-కాప్రా

ఈసీఐఎల్ లోని బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్‌లో ఎస్ఎస్‌సీ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ పద్మశ్రీ అభినందనలు తెలిపారు. విద్యార్థులు తమ ప్రతిభతో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మరెన్నో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. తమ విద్యార్థులకు చక్కని విద్యను అందించి 100 శాతం ఉత్తీర్ణ సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శైలజ, వసంత, పద్మావతి, షాహీన్, శ్రీనివాస్, నిర్మల, రేఖ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు




# మున్సిపాల్టీల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- మంత్రి చామకూర మల్లారెడ్డి
- మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎంతో అభివృద్ధి పథంలో దూసుకెళ్లేలా నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు తమ విధులు మరింత ఉత్సాహంతో నిర్వహించాలని, ఈ విషయంలో ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని రాష్ట్ర కార్మిక ,ఉపాధికల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం శామీర్‌పేటలోని జిల్లా కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్





ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి అంశాలపై మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో మంత్రి మల్లారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం మేడ్చల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి దిశలో పయనిస్తోందన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధులకు ఏమాత్రం కొరతలేదని, చేపట్టాల్సిన పనులను సకాలంలో పూర్తి చేసేలా అవసరమైన ముందస్తు కార్యాచరణతో సాగాలని అధికారులకు మంత్రి వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మేడ్చల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ఆయా మున్సిపాల్టీల్లో జరుగుతున్న పనులపై ప్రత్యేకంగా ఆయా మేయర్లు మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, కమిషనర్లు, తహశీల్దార్లతో సమీక్షించి వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా మున్సిపాల్టీలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, రహదారులు, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు, వైకుంఠధామాలు, డంప్‌యార్డ్‌లు, దోభీఘాట్‌లు, స్టేడియం తదితర అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో అవసరమైన నిధులను మంజూరు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి చెప్పారు. దీంతో పాటు ప్రత్యేకంగా మేడ్చల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల తహశీల్దార్లు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్లకు సంబంధించి ఎలాంటివి పెండింగ్‌లో ఉండకుండా చూడాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించడానికి సిద్ధంగా ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించు చీఫ్ మినిస్టర్స్ కప్ 2023పై పూర్తి స్థాయిలో సమీక్షించి అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లను మంత్రి ఆదేశించారు. మేడ్చల్ నియోజకవర్గంలో ప్రభుత్వం చేపట్టే అన్ని రకాల పనులను ముందుగా చేసి మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రస్తుతం ప్రభుత్వం చేయబోయే అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలలో కూడా మంచి పేరు వచ్చేలా కృషి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి సూచించారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధి నిధులను మంచి అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించాలని అందులోనూ ప్రజలకు మేలు జరిగేలా చూడాల్సిందిగా మంత్రి తెలిపారు.

కలెక్టర్ అమోయ్ కుమార్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో ఎన్నో మంచి అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం తరపున చేపట్టే ప్రతి కార్యక్రమం ఇక్కడ నుంచే ప్రారంభం కావడం అది కూడా విజయవంతం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా మంత్రి నిధులు తీసుకువచ్చి ప్రజల అవసరాలను తీరుస్తున్నారని తెలిపారు. అందుకు ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం సహకరిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మేయర్‌లు, చైర్ పర్సన్‌లు, ప్రజాప్రతినిధులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకోగా వాటిని అప్పటికప్పుడే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీవో మల్లయ్య, ఆర్ అండ్ బీ అధికారి శ్రీనివాస్ మూర్తి,ఈఈపీఆర్ఓ రామ్మోహన్ ,ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువతను ప్రోత్సహించేందుకే క్విజ్ పోటీలు

- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-కంటోన్మెంట్

యువతను ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ ప్రారంభించడం జరుగుతుందని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తెలిపారు. బోయిన్ పల్లిలోని మహాత్మా గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో శుక్రవారం ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాయకుడు రాహుల్ సిప్లగంజి హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జులై 2న రాజీవ్





గాంధీ యూత్ ఆన్‌లైన్ పోటీలు ప్రారంభమవుతాయని, రాష్ట్రంలోని ప్రతీ గ్రామం నుండి యువత ఈ క్విజ్ పోటీలలో పాల్గొనాలని కోరారు. ప్రతీ నియోజకవర్గానికి మొదటి మూడు బహుమతులు ల్యాప్‌టాప్, ట్యాబ్, స్మార్ట్ ఫోన్ అలాగే ప్రత్యేక బహుమతులు ఉంటాయన్నారు. 16 సంవత్సరాల పైబడి ప్రతి ఒక్కరు పాల్గొనాలని, రాష్ట్రం మొత్తం 5,500 బహుమతులు ఉంటాయని అన్నారు. అయితే రాహుల్ సిప్లిగంజ్ పాడిన పాటకు ఆస్కార్ వచ్చిందని.. అవార్డు గ్రహీతను రాష్ట్ర ప్రభుత్వం అభినందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబంలో జన్మించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిన రాహుల్ సిప్లగంజ్‌కు తక్షణమే రూ. 10 లక్షలు ఇచ్చి అభినందన సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే రాహుల్‌కు కోటి రూపా రూపాయలు నజరానా ఇస్తామని ప్రకటించారు.

రాహుల్ సిప్లగంజ్ మాట్లాడుతూ... ఆన్‌లైన్ పోటీలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయ కులను ఆయన అభినందించారు.కార్యక్రమానికి తనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించిన రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో సభ అధ్యక్షులు మన్నె సతీష్, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్ ఠాగూర్, ఎన్.ఎస్.యు.ఐ జాతీయ అధ్యక్షుడు నీరజ్ కుందన్, జాతీయ కోఆర్డినేటర్ దాసరి రాజు అజయ్ కుమార్, డాక్టర్ మల్లు రవి, అద్దంకి దయాకర్, ఎన్.ఎస్.యు.ఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మహిళ అధ్యక్షురాలు సురభి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్, రోహిత్, అనిల్ యాదవ్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ లో గల పలు డివిజన్‌లలో వివిధ సమస్యలపై కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం డిప్యూటీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాప్రా సర్కిల్లో గల మల్లాపూర్, నాచారం, మీర్‌పేట్, హౌసింగ్ బోర్డ్, చర్లపల్లి, ఏఎస్ రావు నగర్‌లలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. డ్రయినేజీ వ్యవస్థ అస్తవస్తంగా మారి రోడ్లపై మురుగు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ డెంగ్యూ మలేరియా లాంటి వ్యాధులతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. రోడ్లు పరిస్థితి మరి అధ్వానంగా మారిందన్నారు. గుంతల మయమై వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. స్మశాన వాటికల సంగతి అధ్వానంగా మారిందన్నారు. అలాగే చెరువుల సుందరీకరణ పేరుతో కాంట్రాక్టర్లు, అధికార ప్రతినిధులు వారి చేతివాటం చూపిస్తూ ప్రజల సమస్యల పట్ల చిన్నచూపు చూస్తూ వారి కమిషన్లకు పరిమితమైనరన్నారు. కావున వెంటనే వీటన్నింటిపై తగు చర్యలు తీసుకోవాలని, లేనియెడల పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. హౌసింగ్ బోర్డ్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ పోలిపాక అంజయ్య, మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి వంజరి సంతోష్, మల్లికార్జున్, నవీన్, ఎండీ రిజ్వాన్,వాసు చారి, శ్రీను, పలకల నరసింహారెడ్డి, మల్లేష్ యాదవ్, చందు యాదవ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీ సాయిబాబా, శ్రావణ్ కుమార్, ఆమీర్, సన్నీ గౌడ్, అరవింద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కాప్రా



కాప్రా డివిజన్‌లోని వంపుగూడ కాలనీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పడమటి మల్లారెడ్డి కూతురు మనోజ్ఞ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందింది. ఈ మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి వారి నివాసానికి స్వయంగా వెళ్లి పరామర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కాసం మహిపాల్ రెడ్డి, సుడుగు మహిపాల్ రెడ్డి, మురళి పంతులు, గంప కృష్ణ తదితరులు ఉన్నారు

## నర్స్ వృత్తికి వన్నెతెచ్చిన మహనీయురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్



- వేణు కుమార్

నవతెలంగాణ-నాచారం

నర్సు వృత్తికి వన్నెతెచ్చిన మహనీయురాలు ఫ్లోరెన్స్ నైటింగేల్ అని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణు కుమార్ అన్నారు. శుక్రవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి వేడుకలుర, అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నాచారం ఈఎస్ఐ స్మృతిలోని న్యూ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో నర్సులు చేసే సేవలు అంతకంటే మనోధైర్యాన్ని అందిస్తాయన్నారు. మానవసేవే మాధవసేవ అని భావించిన ఆమె ఎంతో గుండె నిబ్బరంతో చిమ్మ చీకట్లో కూడా చిరు దీపం వెంట తీసుకొని వెళ్లి రోగులకు సేవలు అందించిందన్నారు. రోగుల ముఖం మీద చిరునవ్వు ఆమె చేతిలో దీపంలాగా వెలిగించిందని చెప్పారు. ప్రజలకు ఆరోగ్య రక్షణలో సేవలు అందిస్తూ వైద్య వత్తిని ప్రేమిస్తున్న వారందరికీ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం ఈఎస్ఐ నర్సులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కీసర ఎంపీపీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. చీర్యాల లక్ష్మీ నసింహ్మా స్వామి ఆలయంలో స్వామి వారిని వారు దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు స్వామి వారి ఆశీర్వాదం అందజేసి మహా ప్రసాదాలను అందించి స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఎంపీపీ కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ఎంపీపీ దంపతులకు స్వామి వారి ఆశీర్వాదం అందజేసి ప్రసాదాలను అందజేశారు. మండలం లోని ప్రజ ప్రతి నిధులు, అధికా రులు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున్న తరలి వచ్చి ఎంపీపీకి పుట్టినరోజు శుభాకాంక్షలు అందరు కలిసి తెలియజేశారు.





## దళితుల ఆర్థిక పురోగతికి 'దళిత బంధు'

- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-నాచారం

దళితుల ఆర్థిక పురోగతికి తెలంగాణ ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాచారం అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బంధు పథకం యూనిట్ భువనచంద్ర సిమెంట్, స్టీల్ దుకాణాన్ని ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందర్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలు ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని దళిత బంధు పథకాన్ని సీఎం కేసీఆర్ ముందుచూపుతో తీసుకురావడంతో దళిత కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటును అందిస్తుందన్నారు. దళిత బంధు పథకం దేశంలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వం తీసుకురాలేదని అన్నారు. దళిత బంధు పథకం దేశానికే ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో భువనచంద్ర సిమెంట్, స్టీల్ దుకాణం నిర్వహకుడు మాజీ కౌన్సిలర్ తుంగ తిరుపతి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు సాయిజెన్ శేఖర్, కాటిపల్లి రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ముత్యం రెడ్డి, సుగుణాకర్, గౌడేల్లి రామకష్ణ, పాండురంగన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షులుగా చిగుళ్ల శ్రీనివాస్

నవతెలంగాణ-నాచారం

ఉప్పల్ నియోజకవర్గం భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షులుగా మల్లాపూర్‌కు చెందిన చిగుళ్ల శ్రీనివాస్ (హమాలీ శ్రీను)ను నియమిస్తూ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జీ రాంబాబు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్న చిగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం కార్మిక వాడలకు నిలయంగా పేరు ఉన్నందున రాబోయే కాలంలో యూనియన్‌ను నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా కార్మిక వర్గంలో నిర్మించేందుకు కషి చేస్తానని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో కార్మిక హక్కులు, పారిశ్రామిక రంగం ప్రగతికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక అవకాశాలు కల్పించిందని అన్నారు. తనకు బాధ్యతలను అప్పగించినందుకు మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి,



తెలంగాణ ఆటో రవాణా రంగం రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య,కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి లకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో భవిష్యత్తులో ఉప్పల్ నియోజకవర్గంలో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ బలోపేతానికి కషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, గరిక సుధాకర్, బేతాళ బాలరాజు, మేకల ముత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ కష్ణ కన్వెన్షన్,వోర్ల కన్వెన్షన్, సుర్వి గార్డెన్స్‌లో జరిగిన వివాహ వేడుకకు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాల్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, సంపత్, సాయిబాబా గౌడ్, రాజు గౌడ్, భానుచందర్ ,ముత్యాలు ,వెంకట్ రెడ్డి, నజీర్ ,పరశురాం గౌడ్ ,సాగర్ గౌడ్ ,తన్వీర్, శ్రీనివాస్ గౌడ్ ,పాండుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.**



## పేదలకు అండగా బీఆర్ఎస్

- కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్

నవ తెలంగాణ- నేరేడ్ మెట్

పేదలకు ఎల్లవేళలా బీఆర్ఎస్ అండగా ఉంటుందని కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ అన్నారు. వెంకటాపురంకు చెందిన టైల్స్ రాజు కొడుకు, కూతురు ఇటీవల ఆకాల మరణం చెందారు. దీంతో వారి కుటుంబీకులు ఆర్థికంగాతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేటర్ రూ. 10,000 తో వంటసామాగ్రిని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్ గౌడ్, విజయశేఖర్, జనార్దన్, అరుణ్ గౌడ్ , కుట్టి పాల్గొన్నారు.



## 12 ఫలితాల్లో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ హవా

నవతెలంగాణ-నాచారం

ఎస్ఎస్‌సీఈ 2022-23 విద్యా సంవత్సరం ఫలితాల్లో నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మెన్ మల్కా కొమరయ్య, డైరెక్టర్ పల్లవి, సీఓఓ యశస్వి మాట్లాడుతూ నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 12వ తరగతి బోర్డు ఫలితాలలో ప్రభంజనం సష్టించిన విద్యార్థులకు యాజమాన్యం తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అద్భుతాలను సాధించవచ్చని రుజువు చేశారన్నారు. నిత్యం చదువుతోపాటు సామాజిక స్పహ పరిశోధనాత్మక విద్యను అందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు కతజ్ఞతలు తెలిపారు. నాచారం డీపీఎస్ విద్యార్థులు సంక భావన కామర్స్ విభాగంలో 98. 4 శాతం, అంతార అగర్వాల్ సైన్స్ విభాగంలో 97.2 శాతం, ఆర్యన్ కుమార్ సాహూ హ్యూమనిటీస్ విభాగంలో 96.4శాతం మార్కులు సాధించి స్కూల్ టాపర్స్‌గా నిలిచారన్నారు. వీరితోపాటు మరో 19 మంది విద్యార్థులు 95 శాతం, 87 మంది విద్యార్థులు 90 శాతానికిపైగా, 246 మంది విద్యార్థులు 80 శాతం, 398 మంది 70 శాతం, 470 మంది 60 శాతం మార్కులు సాధించారన్నారు. ఫ్యాషన్ డిస్టిక్, కెమిస్ట్రీ, పొలిటికల్ సైన్స్, బయాలజీ, సైకాలజీ, బిజినెస్ స్టడీస్, లీగల్ స్టడీస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, పెయింటింగ్ సబ్జెక్టులలో జాతీయ ర్యాంకులు సాధించి నాచారం డీపీఎస్ ఫలితాలలో అగ్రగామిగా నిలిపారని చెప్పారు. నూతన విద్యా విధానంలో భాగంగా విద్యార్థులు ఒకేషనల్, శాస్త్ర సాంకేతిక కమ్యూనికేషన్ విభాగాలలో అద్భుతమైన ఫలితాలను సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీతా రావు, వైస్ ప్రిన్సిపాల్ నందిత సుంకర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థుల హవా

నవతెలంగాణ కంటోన్మెంట్

సీబీఎస్ఈ 10, 12 తరగతి ఫలితాల్లో బోయిన్‌పల్లి పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 100 శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించించి. 12వ తరగతిలో స్కూల్ టాపర్‌గా కామర్స్ స్ట్రీమ్ నుంచి హరి కీర్తన 97 శాతం, సైన్స్ స్ట్రీమ్లో స్ఫూర్తి 92 శాతం, మన్నన్ నిరాల్ కుమార్ 92 శాతంతో అగ్రస్థానంలో నిలిచారు. కామర్స్ స్ట్రీమ్‌లో నలుగురు విద్యార్థులు 90 శాతం అంతకంటే ఎక్కువ స్కోరు సాధించారు. 11 మంది విద్యార్థులు 80 శాతం, అంతకంటే ఎక్కువ స్కోరు సాధించారు. 22 మంది 70 శాతం, అంతకంటే ఎక్కువ స్కోర్లు సాధించారు. 16 మంది విద్యార్థులు 60 శాతం, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. మిగతా వారందరూ 40 శాతం పైన స్కోర్లు సాధించారు. సైన్స్ స్ట్రీమ్ లో ఇద్దరు విద్యార్థులు 90శాతం, అంతకంటే ఎక్కువ, ఐదుగురు విద్యార్థులు 80 శాతం అంతకంటే ఎక్కువ స్కోరు సాధించారు. 15 మంది 70 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు సాధించారు. 12 మంది విద్యార్థులు 60 శాతం ఎక్కువ మార్కులు సాధించారు. మిగతా వారందరూ 50 శాతం మార్కులు సాధించారు. ఇక 10వ తరగతికి సంబంధించి 97 శాతంతో లక్ష్య లఖోటియా, శ్రావ్య బద్రీ పాఠశాల టాపర్లుగా ఉన్నారు. గణితంలో ముగ్గురు విద్యార్థులు, ఇన్ఫోటెక్‌లో ఇద్దరు, సోషల్లో ఒకరు, ఇంగ్లిష్‌లో ఏడుగురు, తెలుగులో నలుగురు, సైన్స్‌లో ఒకరు సెంటమ్ సాధించారు. మొత్తమ్మీద 32 మంది విద్యార్థులు 90% పైన, 53 మంది విద్యార్థులు 80% పైన, 49 మంది విద్యార్థులు 70% పైన, 69 మంది 60% పైన మిగిలిన 32 మంది 50% పైన స్కోర్లు సాధించారు. చైర్మెన్ మల్కా కొమరయ్య, డైరెక్టర్ పల్లవి, సీఓఓ మల్కా యశస్వి, ప్రిన్సిపాల్ శైలజా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సింధు జయరాజ్, ఉపాధ్యాయుల దూరదష్టి ఈ సంవత్సరం అత్యుత్తమ ఫలితాలకు కారణమైంది.



## కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే ప్రజలకు సంతోషం

- నందికంటి శ్రీధర్

నవతెలంగాణ- నేరేడ్ మెట్

కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే తెలంగాణ ప్రజలు అన్ని విధాలా సంతోషంగా ఉంటారని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం మచ్చ బొల్లారంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర నిర్వహించారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ కావాలి - మల్కాజ్ గిరి ప్రజలకు నంది కంటి కావాలని నినాదాలు చేస్తూ గడపగడపకు కాంగ్రెస్ కార్యకర్తలు విస్తతంగా ప్రచారం చేశారు. అనంతరం నందికంటి శ్రీ ధర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆరోగ్యశ్రీ ద్వారా రు.5 లక్షల బీమా, రైతులకు రు.2 లక్షల రుణ మాఫీ, రు.500 లకే గ్యాస్ సిలెండర్ అందజే స్తుందని హామీనిచ్చారు. ఈ సారి ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గుత్తి రామచందర్ సీనియర్ నాయకులు డోలి రమేష్, శ్రీనివాస్ గౌడ్, సి.ఎల్. యాదగిరి, కాంగ్రెస్ మచ్చ బొల్లారం డివిజన్ అధ్యక్షులు పవన్, శ్రీనివాస్, సూర్య ప్రకాష్ రెడ్డి, శివకుమార్, రాజు, పాతాలు, పాండు, వీనస్ మేరీ, ఫయీం, విజయ లక్ష్మి, శుభాశిని, నాజియా పాల్గొన్నారు..



## వివేకానంద హైస్కూల్ ఉత్తమ ఫలితాలు

నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఉత్తమ్ నగర్‌లో ఉన్న వివేకానంద హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించారు. యాతం తరిణి శ్రీ ఆకాంక్ష 9.8 జీపీఏ సాధించగా, తాటి భార్గవి 9.3 జీపీఏ సాధించారు. వీరిని స్కూల్ ప్రిన్సిపాల్ సుధా, కరస్పాండెంట్, వైస్ ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.



## రాష్ట్ర ముఖ్య సలహాదారు సోమేశ్ కుమార్‌ను కలిసిన ముజీబ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ (ముజీబ్) నూతనగా రాష్ట్ర ముఖ్య సలహాదారుగా బాధ్యతలు చేపట్టిన సోమేశ్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సోమేశ్ కుమార్‌కి శుభాకాంక్షలు తెలియచేస్తూ, రాష్ట్ర చీఫ్ సెక్రెటరీగా పని చేసిన అనుభవంతో రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా తీసుకెళ్తారని ఆశించారు. సోమేశ్ కుమార్ మాట్లడుతూ తాను చీఫ్ సెక్రెటరీగా ఉన్నప్పుడు ఉద్యోగులందరూ ఎల్లవేళలా తనకు సహకరించారనీ, ఇక ముందు కూడా అలాగే తన వెంట ఉండాలని కోరుతూ.. సంఘం చేస్తున్న కార్యక్రమాలను కొనియాడారు.

## త్వరలో మహిళా సంఘాలకు రుణాలు : కార్పొరేటర్

నవతెలంగాణ-ఓయూ



మహిళా పొదుపు సంఘాల రుణం కోసం బ్యాంకర్లతో శుక్రవారం సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ సమావేశం ఏర్పాటు చేశారు. సీతాఫలమండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ మహిళా పొదుపు సంఘాలు, కెనరా బ్యాంక్ ఖైరతాబాద్ బ్రాంచ్ వారితో సమావేశం అయ్యారు. మహిళా పొదుపు సంఘం సభ్యులకు దాదాపు 15 మహిళా గ్రూపులకు రుణాలు ఇప్పించేందుకు కార్పొరేటర్ బ్యాంకర్లతో మాట్లాడారు. త్వరలోనే రుణాలు మంజూరు చేస్తామని బ్యాంక్ అధికారులు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో యూసీడీ అధికారి ధనుశ్రీ, మహిళా పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# వేతనాల్లో జాప్యం..

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో కోత
- ఈఎస్ఐ, ఈపీఎఫ్, ప్లే స్లిప్స్ కరువు
- చోద్యం చూస్తున్న ఓయూ అధికారులు
- కాంట్రాక్టర్స్ తీరుపై పోరుబాటలో సీఐటీయూ

నవతెలంగాణ-ఓయూ



అసలే చాలీ చాలని వేతనాలు.. మరో వైపు వెట్టి చాకిరీ.. అయినా సకాలంలో అందని వేతనాలు.. పని చేయించుకుంటున్న గుత్తేదారులు (కాంట్రాక్టర్స్).. నెల రోజులు గడిచినా సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సర్దుబాటు కోసం అప్పులు తెచ్చుకుని ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతుంటే వారిని హెచ్చరించాల్సిన ఓయూ అధికారులు చోద్యం చూస్తుండటంతో విసికిపోయిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సీఐటీయూ మద్దతుతో ఉద్యమ బాట పట్టారు. ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాల్సిన కాంట్రాక్టర్స్ 20 తారీకు వరకు వేతనాలు ఇవ్వక పోవడం శోచనీయం. ఓయూలో మెస్, హాస్టల్స్‌లో సుమారు 382 మంది ఉద్యోగులు సైబెక్స్, సెక్యూర్, వెంకటేశ్వర, ఆయా సంస్థ కాంట్రాక్టర్ల పరిధిలో పని చేస్తున్నారు. వీరికి దాదాపు మూడు నెలల నుంచి సమయానికి వేతనాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### వేతనాల్లో కోత సరే.. అమలు ఎక్కడ..?

ప్రతి అవుట్ సోర్సింగ్ ఉద్యోగికీ విధిగా సదరు సంస్థలు ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు చేయాలని కానీ ఇక్కడా అమలు కాక పోవడంతో పాటు సదరు ఉద్యోగుల వేతనాల్లో కోత విధిస్తూన్నా రు. ఇందుకు సంబంధించిన మెసేజ్‌లు, ప్లే స్లీప్స్ కాంట్రాక్టర్స్ ఇవ్వడం లేదని వేతన జీవులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉద్యోగుల హక్కులను కాలరాయడంతోపాటు టెండర్స్‌లో ప్రతి నెలా 5వ తేదీన లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా 20వ తేదీ వరకు ఇవ్వడం లేదని వారు మొరపెట్టుకుంటున్నారు. సమయానికి వేతనాలు రాకపోవటంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను పోషించడం ఇబ్బందికరంగా మారిందంటున్నారు.

### ప్రతినెలా 10వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలి



ఉద్యోగులకు ప్రతి నెలా సమయానికి వేతనాలు ఇవ్వాలి. 10వ తేదీలోపు చెల్లించాలి. సకాలంలో వేతనాలు రాకపోవ డంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు.

**టి.మహేందర్, అధ్యక్షులు, ఓయూ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)**

### సమాచారం సరిగా ఇవ్వడం లేదు



మాకు ఇఎస్ఐ, పీఫ్ డబ్బులు కట్ అవుతున్నాయి. కానీ ఇప్పటి వరకు ఇందుకు సంబంధించిన సమాచారం సరిగా రావటం లేదు. ఆరోగ్యం బాగా లేక హాస్పిటల్‌కి వెల్దామంటే ఈఎస్ఐ హార్డ్ కాపీలు కూడా సరిగా ఇవ్వటం లేదు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

**అనసూయ, ఉపాధ్యక్షురాలు, యూనియన్ (సీఐటీయూ)**

### ఇబ్బందులు పడుతున్నాం

జీతాలు సమయానికి రాకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నాం. మాకు ఇప్పటి వరకు పే స్లిప్స్ కూడా ఇవ్వటం లేదు. పిఫ్ సమాచారం సరిగా లేదు. జీతాలు ఎంత కట్ అవుతున్నాయి.. ఎంత వస్తున్నాయో తెలియక ఆందోళన పడుతున్న పరిస్థితి ఉంది. పే స్లిప్స్ ఇస్తే మాకు అన్ని విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

**నరేష్, యూనియన్, సహాయ కార్యదర్శి, (సీఐటీయూ)**



## మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ రాజ్
- తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ మూడో రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో ఎస్.బాల్ రాజ్ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ 3వ రాష్ట్ర మహా సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ రాష్ట్రంలో నేటికీ జీఓ 4 ప్రకారం అనేక మున్సిపాల్టీల్లో కార్మికులకు 11వ పీఆర్సీ విడుదలై సుమారు రెండేండ్లు గడుస్తున్నా ఏరియర్స్ చెల్లించలేదన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, ఏరియర్స్ చెల్లించేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ గుర్తింపు కార్డులు లేక అనారోగ్య సమస్యల పరిష్కారం కోసం కార్మిక కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈఎస్ఐ గుర్తింపు కార్డులు అందించాలనీ, పీఎఫ్ చెల్లింపులు సంక్రమంగా జరిపించాలన్నారు. కార్పొరేషన్, మున్సిపాల్టీలు, పురపాలక సంఘాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులరైజ్ చేసే వరకు కనీస వేతనాల చట్టాన్ని అనురిస్తూ కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం, కార్యదర్శి మందా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూనియన్ 3వ రాష్ట్ర మహా సభలు జూన్ 6, 7వ తేదీల్లో మేడ్చల్ పట్టణం జేఎల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రెండు రోజుల పాటు ఈ మహా సభలకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1,000 మంది మున్సిపల్ కార్మికులు ప్రతినిధులుగా హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చిస్తామనీ, పలు తీర్మానాలను ప్రవేశ పెడుతామని తెలిపారు. ఈ రాష్ట్ర మహాసభల సందర్భంగా జూన్ 6వ తేదీన మేడ్చల్ పట్టణంలో జరిగే బహిరంగ సభకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నండూరి కరుణకుమారి, యూనియన్ రాష్ట్ర నేతలు పి.వెంకటయ్య, కె.రవిచంద్ర, కె.జయచంద్ర, పి.నర్సింగరావు, బొడ్డుపల్లి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-అంబర్‌పేట

ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈ బోర్డు పరీక్షల్లో 100 శాతం ఫలితాలను సాధించి పాఠశాలకు మరోసారి ప్రశంసలు తీసుకొచ్చారు. 10 మంది విద్యార్థులు ఎ, 1 గ్రేడ్‌లు సాధించారు. 37 మంది విద్యార్థులు ఎ 2 గ్రేడ్‌లు సాధించారు. 42 మంది విద్యార్థులు బి 1 గ్రేడ్‌లు సాధించారు. 36 మంది విద్యార్థులు బి 2 గ్రేడ్‌లు సాధించారు. 16 మంది విద్యార్థులు సి 1 గ్రేడ్‌లు సాధించారు. స్కూల్ టాపర్ గా రాశి బన్సాలీ 475/500 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలవగా, కరణ్ జైస్వాల్ 472/500 స్కోరుతో మొదటి స్థానంలో నిలవగా, 467/500తో నేతి రిషిక్ మూడో స్థానంలో నిలిచాడు. ఫెసిలిటేటర్ల మార్గనిర్దేశంతో విద్యార్థుల నిరంతర కృషితో వందశాతం ఫలితాలు సాధించగలుగుతున్నాం. అన్ని సబ్జెక్టులలో అదనపు తరగతులతో సరైన, ప్రణాళికా బద్ధమైన పునర్విమర్శ రూపకల్పన తయారు చేసి విద్యార్థుల అత్యద్భుతమైన సామర్థ్య ప్రదర్శనకు సహాయ పడింది. పాఠశాల స్వీయ క్రమశిక్షణ నిబంధనల ఫలితంగా, సమయ పాలన ప్రాముఖ్యతను గ్రహించి వారి ఉపాధ్యాయుల భోధనపై ఏకాగ్రతతో దృష్టి పెట్టడంపై, ప్రతి విద్యార్థి సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తుంది. వైస్ చైర్ పర్సన్ ప్రార్థన మణికొండ విద్యార్థులకు వ్యక్తిగతంగా కౌన్సెలింగ్ చేస్తూ వారి భవిష్యత్ ప్రయత్నాలలో స్వీయ క్రమశిక్షణ, అంకితభావం విలువలను అర్థం చేసుకున్నారు. కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులంద రికీ ఉపాధ్యాయులు మార్గదర్శకంగా నిలిచారు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామాంజుల, అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఫాతిమా సత్తార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

నవతెలంగాణ-అడిక్‌మెట్

ప్రభుత్వానిదే రాజకీయ పాలన, గవర్నర్ల జోక్యం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిహార గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సుప్రీం కోర్టు తీర్పుపై పత్రికా ప్రకటన ద్వారా స్పందించారు. రాజ్యాంగానికి లోబడి పార్లమెంటరీ విధానంలో పరిపాలన సాగిస్తున్న మన దేశంలో గవర్నర్ ఇష్టారాజ్యం కేంద్రానికి లోబడటం చెల్లదంటూ ప్రజా ప్రభుత్వానిదే పాలన అధికారమని రాజకీయ జోక్యం రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీం తీర్పును ప్రజాస్వామ్యాన్ని కోరుకునే పౌరులు నాయకులు తీర్పును అభినందిస్తున్నారని తెలిపారు. ఈ తీర్పు సమాజ భవిష్యత్తులో రాజకీయ శాస్త్రంలో ఒక పాటంగా నిలుస్తుందన్నారు. సుప్రీం తీర్పు దేశంలోనే సమైక్య వ్యవస్థను కాపాడుతుందన్నారు. గవర్నర్లుగా ఎన్నికైన వారు స్థానిక ప్రభుత్వ నిర్ణయాలకు కట్టుబడి ఉండాల్సిందే అన్నారు. ప్రభుత్వాధికారులపై శాసన కార్య నిర్వహణపై ప్రజా ప్రతినిధులతో కూడిన ప్రభుత్వానికి ఉంటుందని గుర్తు చేశారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటాయని ప్రజాస్వామ్య సమైక్య స్ఫూర్తి రాజ్యాంగ మూల స్వరూపంలో భాగమని ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు చేతుల్లో ఉండడం న్యాయమని ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రభుత్వాన్ని కాదని పాలన అధకారం కేంద్రానికి అప్పగించడం అనే చర్య రాజ్యాంగానికి విరుద్ధంగా భావించి సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి రాష్ట్ర గవర్నర్లు తమ అధికార పరిధిలోకి కట్టుబడి నడుచుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి కోర్టు తీర్పును గౌరవించుతుందని భావిస్తున్నామన్నారు.

## 'పది'లో జియాగూడ గౌతమ్ మాడల్ స్కూల్ ప్రభంజనం

నవతెలంగాణ-ధూల్‌పేట్



జియాగూడలోని గౌతమ్ మాడల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభంజనం సృష్టించారు. అమ్రాజ్ ఐశ్వర్య 9.8 జీపీ, డబ్బికర్ కీర్తన 9.2 జీపీ, గోంగూల్ అపూర్వ 9.2 జీపీలు సాధించగా, స్కూల్‌లోని విద్యార్థులందరూ 100శాతం ఉత్తీర్ణతతో విజయం సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను స్కూల్ యజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవీనా జైశ్వాల్ మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు 9.8, 9.2 జిపిలను సాధిస్తూ 100శాతం ఉత్తీర్ణత పొందారున్నారు. స్కూల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత వెనుక ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. ఉన్నత విద్య రానున్న కాంపిటీషన్లో ఎదుర్కొనే విధంగా విద్యా బోధనలు అందిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

## గుర్తింపు లేని పాఠశాలలను వెంటనే రద్దు చేయాలి

- విద్యా శాఖ నిబంధనలు బేఖాతర్
- ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా సమితి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



అధిక ఫీజులు, అడ్మిషన్లు నిర్వహిస్తూ గుర్తింపు లేకుండా పాఠశాలలను నడుపుతున్న విద్యా సంస్థలను వెంటనే రద్దు చేసి వాటిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా సమితిల ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణిని కలిసివినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.చైతన్య యాదవ్, కార్యదర్శి గ్యార నరేష్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు వసీముద్దీన్ మాట్లాడుతూ జీవో 1కు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు యథేచ్ఛగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయన్నారు. అనధికార విద్యా సంస్థలను నిర్వహిస్తూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయన్నారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాల్లో ఇప్పటికే అక్రమ మార్గాన అధిక ఫీజులను వసూలు చేస్తున్న టెక్నో, ఈ టెక్నో, ఒలింపియాడ్, ఇంటర్నేషనల్ తదితర విద్యాశాఖ అనుమతి పొందని పేర్లతో విద్యార్థులను దగా చేస్తూ రూ.లక్షల ఫీజులను వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ గుర్తింపు లేని విద్యా సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలనీ, అవసరమైతే ఆయా పాఠశాలల యజమాన్యాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యా శాఖ అధికారి రోహిణి సానుకూలంగా స్పందిస్తూ గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు చేపడతామనీ, విద్యా సంస్థల్లో పుస్తకాలు, యూనిఫాం తదితర వస్తువులు అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారని వారు పేర్కొన్నారు.

## రిజిస్టర్డ్ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఈఎన్‌టీ హాస్పిటల్ యూనిట్ నియామకం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రిజిస్టర్డ్ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఈఎన్‌టీ హాస్పిటల్ యూనిట్ అధ్యక్షురాలుగా స్వర్ణలత, ప్రధాన కార్యదర్శిగా పుష్పలత, కోశాధికారిగా మాధవి, జాయింట్ సెక్రెటరీగా చిన్నమ్మ నియమితులైనట్టు రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.సుజాత రాథోడ్ శుక్రవారం తెలిపారు. నర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## స్టాఫ్ నర్స్ నుంచి నర్సింగ్ ఆఫీసర్‌గా పేరు మార్చాలి



- ఉస్మానియా హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ సుజాత రాథోడ్
- ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రభుత్వం స్టాఫ్ నర్స్ నుంచి నర్సింగ్ ఆఫీసర్‌గా పేరు మార్చాలని ఉస్మానియా హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ సుజాత రాథోడ్ అన్నారు. శుక్రవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ 203 జన్మదినం సందర్భంగా ఉస్మానియా హాస్పిటల్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, నర్సింగ్ సూపర్డెంట్ సుజాత రాథోడ్ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుజాత రాథోడ్ మాట్లాడుతూ రోగుల పట్ల ప్రేమతో సేవలందించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ కీర్తి నేటికీ సజీవంగా ఉందనీ, ఆమె బాటలో నర్సింగ్ వృత్తిని ఎంచుకున్న వారు పయనించాలని కోరారు. ప్రభుత్వం స్టాఫ్ నర్స్ నుంచి నర్సింగ్ ఆఫీసర్‌గా పేరు మార్చాలని విజ్ఞప్తి చేశారు. గతంలో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు నర్సింగ్ డైరెక్టరేటు ను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారనీ, వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. నర్సింగ్ రిక్రూమెంట్‌ను వెంటనే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్సులు జయమ్మ, శిరీష, రాణి, కపవరం, మేరీ, సద్గుణ, స్టాఫ్ నర్సులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు నమ్మి ఇన్వెస్టర్లు ఆందోళన చెందవద్దు

- హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈఓ డాక్టర్ నౌహెరా షేక్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



రూ.లక్ష కోట్ల విలువైన హీరా గ్రూప్ కంపెనీపై అసత్య ప్రచారాలు నమ్మి ఇన్వెస్టర్లు ఆందోళన చెందవద్దనీ, పెట్టుబడిదారులకు ఎల్లప్పుడూ తాను అండగా నిలబడతానని హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈఓ డాక్టర్ నౌహెరా షేక్ అన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ హీరా గ్రూప్ అనేది సమకాలీన ప్రపంచంలో నమ్మకం, విశ్వాసానికి పర్యాయపదం అన్నారు. తనపై నమ్మకం ఉంచాలని హీరా గ్రూప్ పెట్టుబడిదారులకు పోస్ట్-రిలీజ్ స్టేట్‌మెంట్‌లో వాగ్దానం చేశామన్నారు. కొద్ది రోజుల సమయం ఇస్తే ప్రతి పెట్టుబడిదారుడికీ తిరిగి చెల్లిస్తామని తెలిపారు. ఇన్వెస్టర్లకు గతంలో తాను ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకోవడానికి హీరా గ్రూప్ 50 వేల కంటే ఎక్కువ పెట్టుబడిదారులకు డేటా లేకుండా తిరిగి చెల్లించిందన్నారు. అయినప్పటికీ, ప్రతి పెట్టుబడిదారుడికీ నాలుగు వాయిదాల్లో 16 నెలల్లోపు తిరిగి చెల్లిస్తానని వాగ్దానం చేసినందున, హీరా గ్రూప్ కంపెనీలపై విశ్వాసం ఉంచినందుకు మద్దతుదారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇంతలో ట్రోల్స్, నకిలీ వార్తలను వ్యాప్తి చేయడం ద్వారా పెట్టుబడిదారులను కొందరు తప్పుదారి పట్టించడానికి ప్రయత్నించారని తెలిపారు. చాలా మంది పెట్టుబడిదారులు కంపెనీలో కనీసం వాటాను పొందడానికి సుప్రీంకోర్టు సెక్యూరిటీ విలువను డిపాజిట్ చేయడానికి వెల్లువెత్తుతున్నారని తెలిపారు. కంపెనీ నికర విలువను లెక్కించడానికి తాను ఎప్పుడూ ప్రయత్నించలేదన్నారు. హీరా గ్రూప్ నికర విలువను కొన్ని ఏజెన్సీలు రూ.1 లక్ష కోట్లు అని అంచనా వేశాయని తెలిపారు. నౌహెరా షేక్ ఆపేలో ఇన్వెస్టర్లందరికీ ఒకే ఇన్‌స్టాల్‌మెంట్‌లో తిరిగి చెల్లించడానికి తన వద్ద తగినంత వనరులు ఉన్నాయన్నారు. కానీ ప్రతిదానికీ ఒక విధానం ఉంటుందనీ, చట్టాన్ని గౌరవించే పౌరులుగా దేశం నిర్దిష్ట నియమాలు, నిబంధనలను అనుసరించాలనీ, ఏ చట్టాన్ని ఎప్పుడూ ఉల్లంఘించబోనని చెప్పారు. ఇన్వెస్టర్ల డేటాను అందజేయాలని భారత సుప్రీంకోర్టు ఆదేశించిందనీ, కానీ ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదన్నారు.

## వంద మంది నేతలు ఆమ్ ఆద్మీలో చేరిక



- ఆమ్ ఆద్మీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ వెలడి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఆమ్ ఆద్మీ భావజాలం, నిజాయితీ, దేశభక్తి, మానవత్వం చూసి రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సుమారు వంద మంది నేతలు, కార్యకర్తలు ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారని ఆ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ వెల్లడించారు. శుక్రవారం హిమాయత్‌నగర్, లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర మాజీ కార్యదర్శి శ్రీకాంత్, సినీ నిర్మాత సామాజిక నాయకులు రాజీవ్, బీసీ సంఘం నాయకులు వడ్డెర నరసన్న, ఏబీవీపీ నాయకులు కరుణాకర్ తదితరులను డాక్టర్ దిడ్డి సుధాకర్, బుర్ర రాము గౌడ్, భూక్యా శోభన్ కండువాలు కప్పి ఆమ్ ఆద్మీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ డబ్బు లేకుండా ఎన్నికల్లో పోటీ చేసి నిజాయితీగా పోరాడి గెలవగలమని ఆమ్ ఆద్మీ పార్టీ నిరూపించిందన్నారు. సామాన్య ప్రజల సౌలభ్యం కోసం ఉచిత పాఠశాలలు, నీరు, విద్యుత్, మెరుగైన రహదారి కనెక్టివిటీ మొదలైన వాటి వరకు అవినీతిని సహించకపోవడం నుంచి అనేక అంశాల్లో తన సామర్థ్యాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ నిరూపించుకుందని పేర్కొన్నారు. ఢిల్లీ ఆప్ పాలనా విధానం పట్ల ప్రజలు ఆకర్షితులవుతూ దేశవ్యాప్తంగా ఆప్‌లో చేరుతున్నారని చెప్పారు. ఆప్‌లో చేరి దేశంలో రాజకీయ భవిష్యత్తును రూపొందించడంలో సహాయపడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ రాష్ట్ర నాయకులు డాక్టర్ పప్పుల సుధాకర్, సయ్యద్ గఫార్, సర్దార్ రణధీర్ సింగ్ రాణా, ప్రవీణ్ కుమార్ యాదవ్, రీక్షన్ రావణ్, కొడంగల్ శ్రీనివాస్, టి.రాకేష్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## 16 లక్షల ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి



- చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అడిక్‌మెట్

కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలనీ, పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలనీ, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్.మారేష్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహావిష్కరణ గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఇది ప్రజస్వామ్య దేశం అనీ, అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి, వారి జనాభా ప్రకారం వాటా ఇవ్వాలన్నారు. అప్పుడు దేశంలో సమైక్యత, సమగ్రత, శాంతి ఉంటుందన్నారు. అందుకు బీసీలకు రావాల్సిన వాటా కోసం మరోసారి అధ్యయనం జరగాలన్నారు. బీసీలకు రాజ్యాంగ బద్ధమైన హక్కులు-వాటా కల్పించాల్సిన సమయం ఆసన్నమైనదన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలనీ, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు, రిజర్వేషన్లు కల్పించాలనీ, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, భూపేష్ సాగర్, టి.రాజ్ కుమార్, నందగోపాల్ పాల్గొన్నారు.

## సీబీఎస్ఈలో అమ్మాయిలదే హవా





నవతెలంగాణ-బంజారాహిల్స్

సీబీఎస్ఈలో అమ్మాయిలదే హవా సాగింది. బంజారాహిల్స్ మెరీడియన్‌లో శౌర్య త్రిపాఠి 500 మార్కులకు గాను 482 సాధించి టాపర్‌గా నిలవగా నియా గోల్, అధుశ్రీ తోట్ల, అస్మిత, నిషి రాణా టాపర్లుగా నిలిచి మెరీడియన్ స్కూల్ హైదరాబాద్ నగర విద్యార్థులుగా చరిత్ర సృష్టించారు. విద్యార్థులు ఆ దిశగా మార్కులు సాధించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి ఉందని యజమాన్యం ప్రకటించారు.

## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ఫ్లోరెన్స్ నైటింగేల్ 203 జన్మదినం సందర్భంగా కింగ్ కోఠి జిల్లా హాస్పిటల్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్ఎంఓ డాక్టర్ సాధన హాజరై క్యాండిల్ వెలిగించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఆంజనేయులు, నర్సింగ్ సూపరింటెంట్ ఎస్తేర్, హెడ్ నర్స్ పాలిన, స్టాఫ్ నర్స్ మేరీలిన్, ఝాన్సీ, సీహెచ్ మాధవి, నర్సులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబరాక్, సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఓయూ

కల్యాణలక్ష్మి, షాదీముబరాక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ శుక్రవారం సితాఫల్‌మండీలోని క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా ఉన్నారనీ, వారి సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. దళారీల ప్రమేయాన్ని నివారించేందుకు నేరుగా ప్రజలతో తాము సాన్నిహిత్యాన్ని ఏర్పరుచుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాల్లో ఎవరు డబ్బులు అడిగినా సీతాఫల్‌మండిలోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. బౌద్ధనగర్ డివిజన్‌కు చెందిన లబ్దిదారులకు 25 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నేత కిషోర్ కుమార్, సీనియర్ నాయకులు కంది నారాయణ, బీజంకి రాజేష్, పాక సాయి, మహిళ నాయకులు, జలంధర్ రెడ్డి, రాజ సుందర్, అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన పహాడి షరీఫ్ మాజీ సర్పంచ్



నవతెలంగాణ-బడంగ్ పేట్

జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పహాడి షరీఫ్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్లా బిన్ అవద్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన హత్ సే హత్ జోడో యాత్ర శుక్రవారం మామిడిపల్లి చౌరస్తాకు చేరుకుంది. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ.. ధనార్జన కోసమే పని చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నచ్చక పార్టీ మారినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా వివర్స్ సెల్ అధ్యక్షుడు మస్న యాదగిరి, కాంగ్రెస్ నాయకులు, మహిళలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోట శంకర రావుకు ఎన్‌టీఆర్ పురస్కారం

నవతెలంగాణ-కల్చరల్

విఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి వేడుకను ఈ నెల 15 న శ్రీ త్యాగరాయ గానసభ లోని లలిత కళా వేదిక పై నిర్వహిస్తున్నామని ప్రముఖ మహిళా సంస్థ రాగ రాగిణీ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్ష కార్యదర్శిలు రమణ కుమారి, సుబ్బు లక్ష్మి గాన సభ వద్ద జరిగిన నేటి పత్రికా విలేకరుల సమావేశంలో తెలిపారు. వందల నాటకాల్లో విలక్షణ పాత్రలు, పలు సినిమాల్లో విలన్ పాత్రలు పోషించిన కోట శంకరరావును ఎన్. టీ.ఆర్ స్మారక పురస్కారంతో సత్కరిస్తామని చెప్పారు. ముఖ్య అతిథిగా శాసన మండలి పూర్వ సభ్యుడు రుద్రరాజు పద్మ రాజు పాల్గొంటారని, కళా పోషకుడు సి.రామకష్ణ అధ్యక్షత వహిస్తారన్నారు. తెలుగు భాషా ప్రచార కర్త శైలజ,గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఎన్.టీ.ఆర్ నటించిన చిత్రాలలోని పాటలు సత్య ప్రసాద్ వ్యాఖ్యానంలో రమణ కుమారి,శశికాంతి అంబా దాసు, దినకర్,విజయ కుమార్ లు అలపిస్తారని వివరించారు.

### అంత్యక్రియలు చేయలేక..
## సోదరుడి మృతదేహాన్ని ముక్కలుగా నరికిన అన్నా చెల్లెలు..!

- గోనె సంచిలో కుక్కి దర్గా వద్ద పడేసిన వైనం
- సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకున్న పోలీసులు
- లంగర్‌హౌస్‌లో ఘటన

నవతెలంగాణ-మెహిదీపట్నం

హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌లో దారుణం చోటుచేసుకుంది. చనిపోయిన సోదరుడి అంత్యక్రియలకు డబ్బులు లేవని మృతదేహాన్ని ముక్కలుగా నరికి గోనెసంచిలో కట్టిపడేసి లంగర్‌హౌస్ దర్గా వద్ద పడేశారు ఓ అన్న చెల్లెలు. సమాచారం అందుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెరుగుపల్లి రాజు, తమ్ముడు అశోక్(40), చెల్లి స్వరూప కాళీ మందిర్ ఎస్ఎస్ఎల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. దివ్యాంగుడైన అశోక్ మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం దెబ్బతినింది. దాంతో అతని అన్న రాజు, చెల్లి స్వరూప ఇద్దరూ కలిసి సోదరుడికి గతంలో డాన్ బాస్కో హాస్పిటల్‌లో చికిత్స చేయించారు. అయినా కూడా అశోక్ బతికే ఛాన్స్ లేదని, ఇంటికి తీసుకుని వెళ్లాలంటూ వైద్యులు సూచించారు. దాంతో రాజు, స్వరూప లు అశోక్‌ని ఇంటికి తీసుకువెళ్లారు. అయితే గురువారం అశోక్ ఇంట్లో మృతి చెందాడు. అతని దహన సంస్కారానికి డబ్బులు లేక గురువారం అర్ధరాత్రి సమయంలో మృతదేహాన్ని అన్న చెల్లెలు ముక్కలు ముక్కలుగా చేసి గోనెసంచిల్లో పెట్టి ఆటోలో తీసుకువచ్చి లంగర్‌హౌస్ దర్గా దగ్గర ఫుట్‌పాత్‌పై పడేసి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత గోనె సంచుల నుంచి రక్తం బయటకు వస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గోనె సంచులను తెరిచి చూడగా మతదేహం ముక్కలు ముక్కలుగా కనిపించింది. కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి అన్న చెల్లెలును అదుపులోకి తీసుకున్నారు. దాంతో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. మద్యపానానికి బానిసైన తమ సోదరుడు మరణించాడని, అతని అంత్యక్రియలకు డబ్బులు లేక శవాన్ని పారవేసేందుకు ఈ విధంగా ముక్కలుగా నరికామని నిందితులిద్దరూ చెప్పారు. అయితే నిందితులు చెప్పే విషయం నిజమేనా? కాదా? అనే దానిపై పోలీసులు మరింత లోతుగా విచారణ చేపడుతున్నారు. రాజు, స్వరూప పై 302,201 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

## బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బీఆర్ఎస్ పార్టీతోనే సమగ్ర అభివద్ధి సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ, జలవాయు విహార్, అడ్డగుట్టలలో రూ 1.37 కోట్లతో వ్యయంతో చేపట్టే యూజీడీ పైప్ లైన్, స్ట్రామ్ వాటర్ డ్రైన్ 600 ఎంఎం పైప్ లైన్ (వరద నీటి కాలువ) నిర్మాణ పను లను ఆయనతో పాటు కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకంలో, మున్సిపల్ మంత్రి కేటీఆర్ దిశా నిర్దేశంలో అభివద్ధి పనులు పూర్తి స్థాయిలో చేపట్టడం జరుగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో అభివద్ధి పనులు ముమ్మ రంగా పూర్తి చేసి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగా మిగా నిలబెడుతామన్నారు. భాగ్య నగర్ కాలనీ సాయి రెసిడెన్సీ రోడ్డులో రూ.12 లక్షల వ్యయంతో చేపట్టబోయే యూజీడీ పైప్ లైన్ నిర్మాణ పనులు, జలవాయు విహార్ గాంధీ పార్క్ వద్ద రూ.50 లక్షల వ్యయంతో చేపట్టబోయే స్ట్రామ్ వాటర్ డ్రైన్ 600 ఎంఎం పైప్ లైన్ (వరద నీటి కాలువ) నిర్మాణ పనులు, అడ్డగుట్ట రోడ్డు నంబర్ 8 పోలి మేరాస్ వద్ద రూ.75 లక్షల వ్యయంతో చేపట్టబోయే స్ట్రామ్ వాటర్ డ్రైన్ (వరద నీటి కాలువ) నిర్మాణ పనులకు శంకు స్థాపన చేసినట్లు తెలిపారు. కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలలో అభివద్ధి పనులు పక్కగా పూర్తి చేస్తాం అన్నారు. మౌలికవసతులు కల్పనకు పెద్దపీట వేస్తామ న్నారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, స్ట్రామ్ వాటర్ డ్రైన్ (వరద నీటి కాలువ) నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు డీజీఎం వెంక టేశ్వర్లు, ఏఈ రాజీవ్, మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు మహాదేవ్, దేవి, భాగ్యనగర్ కాలనీ, జలవాయు విహార్, అడ్డగుట్ట కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ జన్మదిన వేడుకలు అంగ రంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై కేక్ కట్ చేయించారు. అనంతరం కార్పొరేటర్‌ను ఆశీర్వదిం చారు. అనం తరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మహి ళా నాయకురాళ్లు, యూత్ సభ్యులు, కార్యకర్తలు, స్థానిక బస్తీ వాసులు, కాలనీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


## పదిలో మెరిసిన ప్రభుత్వ పాఠశాల విద్యాకుసుమాలు




నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

పదో తరగతి ఫలితాల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తూ విద్యార్థుల ఆత్మస్థైర్యంతో పదిలో అద్భుత ఫలితాల పరం పర కొనసాగించారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరా రం కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు జావిద్ అన్నారు. పాఠశాలలో ఉత్తమ ఫలితా లు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 123 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 100 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 81.3 శాతంతో విజయ బావుటా ఎగరవేశా రన్నారు. తమ విద్యార్థిని అఫ్షాన్ జబీన్ జీపీఏ 10 బై 10 సాధించడంతోపాటు ఎం .సహస్ర జీపీఏ 9.5 సాధించి ఈ ప్రాంతానికే తలమానికంగా నిలిచారన్నారు. జీపీఏ 9.0 ఎనిమిది మంది విద్యార్థులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు.తల్లిదండ్రుల ప్రోత్సాహం ,తో పాటు విద్యార్థుల కృషి ,పట్టుదల, తమ ఉపాధ్యాయుల అకుంఠితదీక్ష బోధనతో ఈ ఫలితాలు సాధించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఉన్నత చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలు ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సూరారం కాలనీ 107 సర్వేనెంబర్ లో ఉన్న వివిధ బస్తీలు... తెలుగు తల్లి నగర్, మైత్రి నగర్, బాలాజీ నగర్, ప్రశాంత్ నగర్, శ్రీ సాయి నగర్, ఏకలవ్య నగర్, సిద్ధార్థ నగర్ నివాసులకు 58, 59 జీవో కింద అప్లై చేసుకున్న వారికి పట్టాలు ఇప్పించాలని కోరుతూ అశోక్ బందం ఎమ్మెల్యే కేపీ వివేకానందను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పట్టాలు ఇప్పించేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మైత్రి నగర్ అధ్యక్షులు గట్టు అశోక్, నరసింహ, లక్ష్మణ్, ఎన్ కుమార్, రామకృష్ణ, రవి ,శేషు, అంజయ్య, మాధవి , లక్ష్మి, తెలుగు తల్లి నగర్ ఒగ్గుల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఐనే కాదు వెనకాల ఉన్న వారిని గుర్తించి శిక్షించాలి

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్




నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ మండలంలోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం చేస్తూ ఉండడంతో పాటు, 2500 అక్రమ నిర్మాణాలను, వాటి కోసం మూడు లక్షల రూపాయల లంచం వసూలు చెయ్యడం లాంటి ఆరోపణలతో ఆర్ఐ పరమేశ్వర రెడ్డి ని ఉద్యోగం నుండి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ సస్పెండ్ చెయ్యడం అవినీతి అధికారులందరికి చెంపపెట్టు లాంటిదని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ. ఉమా మహేష్ అన్నారు. అయితే ఇంత పెద్ద వ్యవహారం కేవలం ఆర్ఐ ఒక్కడితోనే సాధ్యం కాదని అతని వెనకాల ఉన్న వారిని కూడా పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు శుక్రవారం జగద్గిరి గుట్ట సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత 8 నెలలుగా ప్రభుత్వ భూములు రక్షించండి లేక పేదలకైనా పంచండి అంటూ సుమారు 20 సార్లు సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడం జరిగిందని.. అయితే ప్రజావాణిలో పట్టించుకోకపోవడం వల్ల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికి మేలుకోవడం శుభపరిణామం అన్నారు. కేవలం సస్పెండ్ చేసి మళ్ళీ ఉద్యోగం ఇస్తే లాభం లేదని మొత్తానికి ఉద్యోగం నుంచి తొలగించాల న్నారు . ఈ శిక్ష కేవలం ఆర్ ఐ కే కాకుండా అతనికి సహకరించిన, ప్రేరేపించిన వారిని కూడా పడాలని డిమాండ్ చేశారు. అధికారులను శిక్షించి 2500 అక్రమ నిర్మాణాలు కట్టిన కబ్జాదారులను వదిలిపెడితే బాగుం డదన్నారు. కోరారు. ఒకవేళ అధికారులను మాత్రమే శిక్షించి కబ్జాదారులను వదిలేస్తే సీపీఐ ఉరుకోదని హెచ్చరించారు. అధికారులు ఇప్పటికైనా రాజకీయ ఒత్తిడికి తలొగ్గి పనిచేస్తే ఏమి జరుగుతుందో గమనించి బుద్ధి తెచ్చుకోవాలని హితు వు పలికారు. అక్రమ కట్టడాలను కూల్చివేసి కబ్జాదారులను శిక్షించాలన్నారు .

## ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు

- రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఎస్‌వోటీ పోలీసుల దాడులు
- ఇద్దరు బుకీలతోపాటు ముగ్గురు నిందితుల అరెస్టు




నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తుండగా ఎల్‌బీ నగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. ఈ మేరకు ఇద్దరు బుకీలతోపాటు ముగ్గురుని అరెస్టు పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.3.50లక్షల నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపిన వివరాల మేరకు వనస్థలిపురంకు చెందిన ఎన్.నరేష్ యాదవ్, ఏ.అంజయ్యతోపాటు ప్రధాన బుకీ సచిన్ దిలిప్ దాలియాలు గుట్టుచప్పుడు కాకుండా ఐపీఎల్ మ్యాచ్‌లపై ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్టుగా కొనసాగుతున్న క్రికెట్ బెట్టింగ్‌లపై ఎస్‌వోటీ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. డీసీపీ కే.మురళీధర్ ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ ఏ.సుధాకర్ విచారణ చేపట్టారు. ఈ క్రమంలో షాహినాథ్‌గంజ్‌కు చెందిన శైలేందర్ అగర్వాల్ ప్రధాన బుకీతోపాటు సరూర్‌నగర్‌కు చెందిన యూ.శ్రీధర్, కే.గణేష్ అనే ఇద్దరు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు.

## మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులకు శుభాకాంక్షలు



నవతెలంగాణ-బాలానగర్

ఏఐసీసీ ఆదేశాల మేరకు ఇటీవల నూతనంగా నియమించిన కొంపల్లి, దిండిగల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులకు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డితో కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్న శివారెడ్డి

## ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న సెయింట్ ఏంజిల్స్ హై స్కూల్



నవతెలంగాణ-నాచారం

నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్య బోధన చేస్తూ ఉత్తమ ఫలితాలను సాధించడంలో సెంట్ ఏంజెల్స్ హై స్కూల్ ఎప్పుడూ ముందుంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ షకీలా భాను తెలిపారు. తెలంగాణ ప్రభు త్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో నాచారం సెయింట్ ఏంజిల్స్ పాఠశాల విద్యార్థిని హల్లిరాజ్ కిరణ్మయి 10/10 జీపీఏ సాధించి స్కూల్ టాపర్ గా నిలిచింది. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ షకీలా భాను, ఉపాధ్యాయ బృందం కిరణ్మయిను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా నాచారం, ఉప్పల్ మండలానికి చెందిన ప్రముఖులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాత్రికేయులు, విద్యార్థిని కిరణ్మయి కి అభినందనలు తెలిపారు.

## నేడు 'స్వయంసిద్ధ' ఆవిష్కరణ





నవతెలంగాణ - హైదరాబాద్

భండారు విజయ, పి. జ్యోతి సంపాదకత్వంలో వెలువడుతున్న ఒంటరి మహిళల జీవన గాథలు - కథా సంకలనం 'స్వయంసిద్ధ' పుస్తకాన్ని శనివారం డా. సి. మృణాళిని చే ఆవిష్కరించనున్నారు. రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో డా. జతిన్ కుమార్, డా. గీతాంజలి, డా. చల్లపల్లి స్వరూపరాణి, డా. మామిడి హరికృష్ణ పాల్గొననున్నారు.

## ఎమ్మెల్యే కనుసన్నల్లో భూకబ్జాలు


- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుల కనుసన్నలలోనే ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం ఒక ప్రకటనలలో ఆరోపించారు. ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యం వహించిన కుత్బుల్లాపూర్ ఆర్ఐ పరమేశ్వర్ రెడ్డిని సస్పెండ్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల కన్నుసన్నల్లో పనిచేసే ఏ అధికారికైనా ఇదే గతి పడుతుందని ఆయన అన్నారు. గాజులరామారం విలేజిలో 2500 అక్రమ నిర్మాణాల్లో జరిగాయని, కబ్జాదారుల నుండి ఒక్కో నిర్మాణానికి మూడు లక్షల రూపాయలు వసూలు చేశారని స్వయంగా కలెక్టర్ తెలిపారని అన్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తే కబ్జాదారులకు పేదలు కట్టిన లక్షల రూపాయలు తిరిగి వారికి ఇప్పించవలసిన బాధ్యత ఎమ్మెల్యే వివేక్ దేనని అన్నారు. ఎమ్మెల్యే వివేక్ అనుచరులే భూకబ్జాలకు పాల్పడుతున్నారని, రాష్ట్రంలోనే అతిపెద్ద భూకుంభకోణం అని ఆరోపించారు. కుత్బుల్లాపూర్‌లో పెద్ద ఎత్తున జరుగుతున్న భూకబ్జాల వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ట



నవతెలంగాణ-శామీర్ పేట

మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో వైదిక నిర్వాహకులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో క్యాతం మధుకృష్ణ-కవిత దంపతులు, రాఘవేందర్-కరుణ దంపతులు హోమాధి క్రతువుల్లో కూర్చోగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి హోమం, మంట పారాధన 10:15 నిమిషాలకు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య యంత్ర ప్రతిష్ట , వినాయకుని విగ్రహం పున్ర ప్రతిష్ట, ధ్వజస్తంభం ప్రతిష్టా మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రతిష్టా మహోత్సవం లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ సింగం ఆంజనే యు లు, ఉపసర్పంచ్ వైద్యనాథ్, హనుమాన్ టెంపుల్ ఇన్‌చార్జ్ సింగం పవన్ కుమార్, వార్డు సభ్యులు సురేష్, శివాలయం కమిటీ చైర్మెన్ వీరేశం గుప్తా, మండల ఆర్యవైశ్య సంఘం మాజీ చైర్మెన్ గంగిశెట్టి శ్రీనివాస్ గుప్తా, నాయకులు బండి జగన్నాథం మడమైన సత్యనారాయణ, జహంగీర్, మేర శ్రీశైలం, కిసరి నర్సింలు, చిత్తయ్య గౌడ్ , గౌటే శ్రీనివాస్, లగిశెట్టి అరుణ్, డప్పు రతన్ ఆలయ పూజారి తమ్మలి రమేష్, నందగిరి ఉపేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.




**అల్వాల్ సర్కిల్ ఉప కమిషనర్ నాగమణికి స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ప్రమోషన్ లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆమెను ఏసీపీ విజయ శ్రీ పూలబొకే, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు**

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



## బండి సంజయ్.. బహిరంగ చర్చకు సిద్ధమా..?

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి బహిరంగ లేఖ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆత్మ గౌరవ దీక్ష పేరుతో అబద్దాల దీక్ష చేపట్టి ప్రజలను తప్పు దోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ నాయకు లపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండపడ్డారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోనీ మున్సిపల్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపైన దీక్ష చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అబద్దాలతో పబ్బం గడుపుకునే బీజేపీ అధ్యక్షుడు సంజయ్ దీక్ష పేరుతో అన్ని అబద్దాలు చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకు రాలేదన్నారు. దీక్షలో అసత్య ప్రచారాలు చేసిన బండి సంజయ్ విలేకరుల సమక్షంలో బహిరంగ చర్చకు రావడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందని చెప్పిన మాట వాస్తవమా అని నిలదీశారు. అలాగే తెలంగాణ రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఇస్తున్న నిధుల్లో సగం నిధులు కూడా తిరిగి రాష్ట్రానికి ఇవ్వని మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం నుంచి స్మార్ట్ సిటీ పేరుమీద జీహెచ్ఎంసీకి రూ. 500 కోట్లు రావాలని.. దాదాపు 5 సంవత్సరాలుగా రూ. 2500 కోట్లు రావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్‌లు ఇస్తుంటే నిన్ను గెలిపించిన కరీంనగర్ ప్రజల్లో ఎంతమందికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చావనీ ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని బండి సంజయ్‌కు సూచించారు.

## ఘనంగా కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు
- వైద్యశిబిరాలు, దుస్తుల పంపిణీ కార్యక్రమాలు



నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం బాలానగర్ డివిజన్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధ వరం కృష్ణారావుతో పాటు నియోజకవర్గ కార్పొరేటర్లు ముఖ్య అతిథులుగా హాజరై కార్పొరేటర్‌ను ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజానాయకుని పుట్టినరోజు సందర్భంగా రాజు కాలనీ, వినాయక్ నగర్, నవజీవన్ నగర్, చరబండ రాజు నగర్, పోలీస్ క్వార్టర్స్, ఇందిరానగర్, రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తలు క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిని పులమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ కార్మిక విభాగం శ్రీనివాస్ రాజు, మహమ్మద్ ఖాజా ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి రగ్గులు పంపిణీ చేశారు. అదే విధంగా సోషియల్ వర్కర్ మధులత ఆధ్వర్యంలో లైన్స్ క్లబ్ బాలానగర్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డా. రవికుమార్, సిబ్బంది రాకేష్, ఎండీ. మోయిజ్ తదితరుల పాల్గొని చికిత్సలు నిర్వహించి మందులు అందజేశారు.

## టెన్త్ ఫలితాల్లో టీవీఆర్ మోడల్ హై స్కూల్ విజయ దుందుభి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

పదో తరగతి ఫలితాల్లో అపురూప కాలనీ 'టీవీఆర్ మోడల్ హై స్కూల్' విద్యార్థులు విజయ దుందుభి మోగిం చారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి మండల మొత్తం మీద విజయఢంకా మోగించారు. 146 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధిం చారు. ఆరుగురు విద్యార్థులు బర్మోట ఆర్తి శర్మ, గోపవరపు సాయినాథ్ రెడ్డి, మణికొండ శ్రీ మహతి, మరిపడిగా నవీన, ముక్కి కావ్య, శ్రీ మూర్తి శతి 10/10 జీపీఏ సాధించారు. 35 మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించడం విశేషం. మిగతా విద్యార్థులు అంతా 8.0 జీపీఏ సాధించి మరో మారు పూర్వ వైభం తీసుకొచ్చారని మేనేజింగ్ డైరెక్టర్ టి వంశీకష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వంశీకష్ణ రెడ్డి మాట్లాడుతూ... ప్రతిష్టమైన అకాడమిక్ ప్రణాళిక, విద్యార్థుల నిర్విరామ కృషి, తల్లిదండ్రుల, అధ్యాపకుల ప్రోత్సాహం వలన ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాలకనుగు ణంగా నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా టీవీఆర్ విద్యాసంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజే యడంతో పాటు అందుకు విద్యార్థులను సిద్ధం చేసిన అధ్యాపక బందానికి కత జ్ఞతలు తెలియజేశారు. 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను టీవీఆర్ విద్యాసంస్థల చైర్మెన్ కోటిరెడ్డి అభినందించారు.



## సీపీకి ఘనంగా సత్కారం

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో రంజాన్, గణేష్‌ఉత్సవాలతోపాటు అన్ని మతాలకు చెందిన పండుగలు ప్రశాంత వాతావరణంలో జరగడంలో నగర సీపీ సీవీ ఆనంద్ ఎంతో కృషి చేసినందుకుగాను సెంట్రల్ జోన్ పీస్‌కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని సీసీసీలో సీపీని ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్ర మంలో కమిటీ ప్రధాన కార్యదర్శి క్రిష్ణా శర్మా, అధ్యక్షులు శశికాంత్ అగర్వాల్, తేజు కుమారి తది తరులు పాల్గొన్నారు.

# నవచిత్రం

## కాంబినేషన్లు.. కాదు కంటెంట్ ముఖ్యం

ఈ సమ్మర్ సీజన్‌ని క్యాష్ చేసుకోవాలని ఆశించిన నిర్మాతలకు నిరాశే ఎదురవ్వడం బాధాకరం. సమ్మర్ అంటే మేకర్స్‌కి కలెక్షన్ల వర్షం కురిపించే సీజన్. ఎంత పోటీ ఉన్నప్పటికీ ఈ సీజన్‌లో తమ సినిమాలను విడుదల చేసేందుకు మేకర్స్ పక్కా ప్లాన్‌తో ఉంటారు. ఆ ప్లాన్‌కి అనుగుణంగా విపరీతమైన ప్రమోషన్లతోనూ హడావుడి చేసి, పబ్లిక్‌ని థియేటర్ వరకు రప్పించడానికి చేసే ప్రయత్నాల్లోనూ సఫలం అవుతున్నారు.

అయితే వచ్చిన చిక్కల్లా ఇక్కడే... మండే ఎండల్ని సైతం లెక్క చేయక థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులకు మాత్రం సినిమాలు చిర్రెత్తిస్తున్నాయి. దీంతో బాగా ఆడుతుంది.. పక్కా బ్లాక్‌బస్టర్ అంటూ హీరోలు, దర్శక, నిర్మాతలు ప్రమోషన్లలో చెప్పిన మాటలు కేవలం మాటలుగానే మిగిలిపోతున్నాయి. దీనికి ఈనెలలో విడుదలైన సమ్మర్ సినిమాలే ప్రత్యక్ష సాక్ష్యాలు.

'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు' పాటకు ప్రతిష్టాత్మక ఆస్కార్ వచ్చిన దగ్గర్నుంచి మన తెలుగు సినిమా వైపు యావత్ సినీ ప్రపంచం చూస్తోంది. జాతీయంగా, అంతర్జాతీయంగా తెలుగు సినిమా రెప రెపలాడుతున్న ఇటువంటి తరుణంలో మన దగ్గర వస్తున్న సినిమాలు బాగుండాలి లేదా కనీసం ఫర్వాలేదనిపించుకోవాలి. అంతేకానీ.. వామ్మో ఏంటీ ఈ సినిమాలనిపించుకుంటే ఎలా?, దీని వల్ల నిర్మాతలు, పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు.. వీళ్ళే కాదు సినిమాని నమ్ముకున్న అందరూ రోడ్డున పడటం ఖాయం. కంటెంట్ ఉన్న కథల మీద కాకుండా కాంబినేషన్ల మాయలో పడి సినిమాలు తీస్తే ఫలితాలు ఎలా ఉంటాయో రీసెంట్‌గా విడుదలైన 'రామబాణం', 'ఉగ్రం', 'కస్టడీ' తదితర చిత్రాలు చెప్పకనే చెప్పాయి. కనీసం ఇప్పటికైనా నిర్మాతలు కేవలం క్యాషియర్లుగా ఉండకుండా గతంలో మాదిరిగా కమాండ్ ఉన్న నిర్మాతల్లా వ్యవహరించి సరైన కథలను ఎంపిక చేసుకోవాలి.







గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో 'లక్ష్యం', 'లౌక్యం' రెండు సినిమాలు వచ్చాయి. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాల్ని సాధించాయి. మళ్ళీ ఇదే కాంబినేషన్‌లో 'రామబాణం' రూపొంది, ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆల్‌రెడీ హిట్ కాంబినేషన్ కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఆ అంచనాలతో థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులను ఈ సినిమా ఏ మాత్రం మెప్పించలేక పోయింది. దీంతో గురి తప్పిన రామబాణంగా నిర్మాతకి ఆర్థికంగా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. గతంలో అల్లరినరేష్, విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో 'నాంది' సినిమా విడుదలై మంచి విజయం సాధించింది. ఇదే కాంబినేషన్‌లో 'ఉగ్రం' తెరకెక్కడంతో సహజంగానే అంచనాలు పెరిగాయి. అయితే ఈ సినిమా విషయంలోనూ బిగ్గెస్ట్ మైనస్ కథే కావడం గమనార్హం.

ఇక శుక్రవారం అక్కినేని నాగచైతన్య 'కస్టడీ' సినిమాతో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రేక్షకుల ముందుకొచ్చారు. 'మానాడు', 'గోవ', 'సరోజ' వంటి భిన్న చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న తమిళ దర్శకుడు వెంకట్ ప్రభు. ఈయన సినిమా అంటే కచ్చితంగా బాగుంటుందని మన తెలుగు ప్రేక్షకులు సైతం ఫిక్సయ్యారు. అయితే దీనికి భిన్నంగా అత్యంత పేలవమైన కథతో నాగచైతన్య, వెంకట్‌ప్రభు కాంబినేషన్ అందర్నీ నిరాశపర్చింది.

ఈ మూడు సినిమాల విషయంలో జరిగింది ఒక్కటే.. కథ మీద కంటే కాంబినేషన్ మీదే మేకర్స్ ఫోకస్ చేశారు. దీంతో ఆకట్టుకోవాల్సిన కాంబినేషన్లు ప్చ్.. అని ప్రేక్షకుల్ని పెదవి విరిచేలా చేశాయి.

పై సినిమాల మాదిరిగానే గతంలో పూరీజగన్నాథ్, విజయ్ దేవరకొండ కాంబినేషన్‌లో 'లైగర్' సినిమా వచ్చింది. ఇది ప్రేక్షకుల నిరాదరణతో బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచింది. దీంతో ఈ సినిమాని తీసుకున్న ఎగ్జిబిటర్లు భారీగా నష్టపోయారు. తమకు రావాల్సిన డబ్బుని దర్శక, నిర్మాత పూరీజగన్నాథ్ ఇస్తానని చెప్పి 6 నెలలైనా ఇవ్వకపోవడంతో శుక్రవారం ఫిల్మ్‌ఛాంబర్ ముందు రిలే నిరాహార దీక్షకు దిగారు. వీళ్ళ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా మేకర్స్ స్పృహతో సినిమాలు తీయకపోతే భారీగా నష్టపోవడం ఖాయం.

## ట్రాప్‌లో చిక్కింది ఎవరు?



అజయ్

అజయ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న మర్డర్ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ 'చక్రవ్యూహం' -ది ట్రాప్ అనేది ఉపశీర్షిక. చెట్కూరి మధుసూధన్ దర్శకత్వంలో సహస్ర క్రియేషన్స్ బ్యానర్‌పై సావిత్రి నిర్మిస్తున్న ఈ సినిమా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూన్ 2న విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మేకర్స్ టీజర్‌ను గ్రాండ్‌గా విడుదల చేశారు. ఇటీవల విడుదలైన 'విరూపాక్ష' సినిమాలో తన విలక్షణమైన నటనతో అందరిని ఆకట్టుకున్న అజయ్ ఈ సినిమాలో పవర్ ఫుల్ పోలీస్ రోల్‌లో కనిపించనున్నారు. 1:05 నిడివి గల ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది. అద్భుతమైన విజువల్స్‌తో అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ఈ టీజర్ అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు మధు సూధన్ మాట్లాడుతూ,'సూపర్ స్టార్ కృష్ణ విడుదల చేసిన మా చిత్ర ఫస్ట్‌లుక్‌కు ప్రేక్షకుల నుండి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. టీజర్‌కి కూడా మంచి స్పందన లభించడం హ్యాపీగా ఉంది' అని తెలిపారు.

## అన్ని వర్గాలనూ మెప్పించే సూపర్ హీరో

త్వరలోనే తెలుగులో రాబోతున్న సూపర్ హీరో చిత్రానికి 'ఏ మాస్టర్ పీస్' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. 'శుక్ర', 'మాట రాని మౌనమిది' చిత్రాల దర్శకుడు సుకు పూర్వాజ్ డైరెక్షన్‌లో సినిమా బండి బ్యానర్ పై శ్రీకాంత్ కండ్రాగుల నిర్మిస్తున్న రెండవ చిత్రమిది. లేటెస్ట్‌గా ఈ మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. టైటిల్‌కు తగ్గట్టుగానే ఓ మాస్టర్ పీస్ లాంటి సూపర్ హీరో సినిమా రాబోతోందని, అలాగే ఇప్పటి వరకూ హాలీవుడ్‌లో వచ్చిన సూపర్ హీరోస్ చిత్రాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉండీ ఈ సినిమా ఉండ బోతుందని పోస్టర్ చెప్పకనే చెప్పింది. అరవింద్ కృష్ణ సూపర్ హీరోగా నటిస్తోన్న ఈ మూవీ టైటిల్‌లోని ఏ అక్షరం నిప్పులు చిమ్ముతూ వలయాకారంలో ఉంది. ఆ వలయంలోని శక్తి హీరోకూ ఉందనే అర్థం వచ్చేలా అతని కుడిచేతికి సైతం అదే కనిపిస్తోంది. అతని వెనక శివలింగంతో పాటు.. నెలవంక నుంచి పౌర్ణమి వరకూ చంద్రుడి పరిణామ క్రమం కూడా ఉంది. పోస్టర్‌లో ఎక్కువ ఆసక్తి కలిగిస్తోన్న అంశం కూడా ఇదే. అంతేకాదు హాలీవుడ్ రేంజ్ కంటెంట్‌తో పెద్దలతో పాటు పిల్లలకు కూడా నచ్చేలా ఈ సూపర్ హీరో పాత్రను డిజైన్ చేశారని వేరే చెప్పక్కర్లేదు. 'శుక్ర', 'మాట రాని మౌనమిది' చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న సుకు పూర్వాజ్ ఈ సినిమాని తనదైన శైలిలో నిర్మాత సపోర్ట్‌తో రాజీపడకుండా తెరకెక్కిస్తున్నారు.



అరవింద్ కృష్ణ

## ఆద్యంతం ఆహ్లాదకరం..



గౌతమి

స్వప్న సినిమా నిర్మాణంలో సంతోష్ శోభన్, మాళవిక నాయర్ ప్రధాన పాత్రలలో రూపొందిన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'అన్నీ మంచి శకునములే'. మిత్ర వింద మూవీస్‌తో కలిసి ప్రియాంక దత్ ఈ చిత్రాన్ని నందిని రెడ్డి దర్శకత్వంలో నిర్మించారు. ఈనెల 18న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటి గౌతమి మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో నా పాత్ర పేరు మీనాక్షి. చాలా లవ్లీ క్యారెక్టర్. ఒక డ్రీమ్ మదర్, వైఫ్, ఫ్రెండ్ ఎలా ఉండాలని వుంటుందో మీనాక్షి పాత్ర అలా ఉంటుంది. తను ఫ్యామిలీని అద్భుతంగా బ్యాలెన్స్ చేస్తుంది. కథాపరంగా కూడా ఆద్యంతం ఆహ్లాదకరంగా ఉండే సినిమా ఇది. ఇంటిల్లిపాది హ్యాపీగా చూడొచ్చు. ఇందులో రాజేంద్రప్రసాద్, నరేష్, షావుకారు జానకీ, ఊర్వశి ..ఇలా అందరితో కలిసి నటించడం చాలా హ్యాపీగా ఉంది. అలాగే మహిళా దర్శకురాలు, మహిళా నిర్మాత.. చేసిన సినిమా కావడం కూడా విశేషమే. ప్రస్తుతం బోయపాటి శ్రీను సినిమా చేస్తున్నాను. అలాగే ఒక వెబ్ సిరీస్ పూర్తయింది. అలాగే అమెజాన్ కోసం మరో వెబ్ సిరీస్ చేస్తున్నాను. ఇంకా కొన్ని ప్రాజెక్ట్స్ ఉన్నాయి.



# సూర్య శతక ప్రతాపం

- 49 బంతుల్లోనే 103 నాటౌట్
- గుజరాత్‌పై ముంబయి గెలుపు

నవతెలంగాణ-ముంబయి

సూర్యకుమార్ యాదవ్ (103 నాటౌట్, 49 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) శివమెత్తాడు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లపై ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 49 బంతుల్లో శతకం సాధించిన సూర్యకుమార్ యాదవ్ ముంబయి ఇండియన్స్‌కు ఒంటిచేత్తో భారీ స్కోరు అందించాడు. సూర్యకుమార్ యాదవ్ వన్‌మ్యాన్ షోతో ముంబయి ఇండియన్స్ తొలుత 20 ఓవర్లలో 5 వికెట్లకు 218 పరుగులు భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు ఇషాన్ కిషన్ (31, 20 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ శర్మ (29, 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), విష్ణు వినోద్ (30, 20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. 219 పరుగుల భారీ ఛేదనలో గుజరాత్ టైటాన్స్ చేతులెత్తేసింది. ఛేదనలో తిరుగులేని రికార్డున్న గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 191 పరుగులే చేసింది. 27 పరుగుల తేడాతో ముంబయి ఇండియన్స్ ఘన విజయం సాధించింది. సీజన్లో ఏడో విజయంతో ముంబయి ఇండియన్స్ (14) పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది.

**రషీద్ పోరాటం వృథా :** భారీ ఛేదనలో టైటాన్స్ ముందే చతికిల పడింది. సాహా (2), గిల్ (6), హార్దిక్ (4), అభినవ్ మనోహర్ (2), రాహుల్ తెవాటియ (14) విఫలమయ్యారు. విజయ్ శంకర్ (29), డెవిడ్ మిల్లర్ (41) మెరిసినా 103 పరుగులకే గుజరాత్ 8 వికెట్లు చేజార్చుకుంది. ఈ పరిస్థితుల్లో రషీద్ ఖాన్ (79 నాటౌట్, 32 బంతుల్లో 3 ఫోర్లు, 10 సిక్స్‌లు) సిక్సర్ల వర్షం కురిపించాడు. ధనాధన్ ఇన్నింగ్స్ నమోదు చేసిన రషీద్ ఖాన్ టైటాన్స్ గౌరవప్రద ఓటమి అందించాడే కానీ..పరాజయం తప్పించలేకపోయాడు. 20 ఓవర్లలో 8వికెట్లకు టైటాన్స్ 191 పరుగులు చేసింది. ముంబయి బౌలర్లలో ఆకాశ్ (3/37), పియూశ్ చావ్లా (2/36), కుమార్ కార్తికేయ (2/37) రాణించారు.

**సూర్య విశ్వరూపం :** సొంతగడ్డపై తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన ముంబయి ఇండియన్స్ ఆది నుంచి దూకుడుగా ఆడింది. ఓపెనర్లు ఇషాన్ కిషన్ (31), కెప్టెన్ రోహిత్ శర్మ (29) తొలి వికెట్‌కు మెరుపు ఆరంభాన్ని అందించారు. పవర్‌ప్లేలో ముంబయి ఇండియన్స్ ఏకంగా 61 పరుగులు పిండుకుంది. మ్యాచ్ గుజరాత్ టైటాన్స్ చేజారుతున్న తరుణంలో స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ మ్యాజిక్ చేశాడు. వరుస ఓవర్లలో రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్‌లను అవుట్ చేసి గుజరాత్ టైటాన్స్‌ను ముందంజలో నిలిపాడు. కానీ సూర్యకుమార్ యాదవ్ విధ్వంసం ముంగిట రషీద్ ఖాన్ మాయజాలం నిలువలేదు. రషీద్ ఖాన్ మరో ఇద్దరు బ్యాటర్లు నేహల్ వధేరా (15), టిమ్ డెవిడ్ (5)లను అవుట్ చేసినా.. ముంబయి ఇండియన్స్ దూకుడు ఏమాత్రం తగ్గలేదు. ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 32 బంతుల్లోనే అర్థ సెంచరీ కొట్టాడు. శతకం కోసం సూర్యకుమార్ యాదవ్ మరింత వేగంగా పరుగులు పిండుకున్నాడు. 11 ఫోర్లు, ఆరు సిక్సర్ల అండతో 49 బంతుల్లోనే సెంచరీ బాదాడు. ఆరో వికెట్‌కు కామెరూన్ గ్రీన్ తోడుగా 18 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యం నమోదు చేసిన సూర్యకుమార్ యాదవ్.. గుజరాత్ టైటాన్స్ కండ్లుచెదిరే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. విష్ణు వినోద్, వధేరాలు సైతం ధనాధన్ వేటలో ఏమాత్రం వెనక్కి తగ్గలేదు.

**ఐపీఎల్‌లో నేడు**
హైదరాబాద్ X లక్నో
వేదిక : ఉప్పల్, సమయం : రా: 7.30
ఢిల్లీ X పంజాబ్
వేదిక : ఢిల్లీ, సమయం : రా: 7.30
స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రసారం



ఆటలు

# హుసాముద్దీన్‌కు కాంస్యం

- గాయంతో సెమీస్ బౌట్‌కు దూరం
- టీమ్ ఇండియా కాంస్య తీన్‌మార్



**తాష్కెంట్:** ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ తీన్‌మార్. బాక్సింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్ చరిత్ర లోనే తొలిసారి మూడు పతకాలు సాధించిన భారత్..తాష్కెంట్‌లో కంచు మోత మోగించింది. తెలంగాణ బాక్సర్ మహమ్మద్ హుసాముద్దీన్ సహా దీపక్ బొరియా, నిషాంత్ దేవ్‌లు కాంస్య పతకాలతో చరిత్ర సృష్టించారు. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ బాక్సర్ మహమ్మద్ హుసాముద్దీన్ (57 కేజీలు) అప్రతిహత విజయాలకు మోకాలి గాయం చెక్ పెట్టింది!. మోకాలి గాయం కారణంగా సెమీఫైనల్ బౌట్‌కు హుసాముద్దీన్ బరిలోకి దిగలేకపోయాడు. ఉత్కంఠగా సాగిన క్వార్టర్ ఫైనల్లో హుసాముద్దీన్ మోకాలు గాయానికి గురయ్యాడు. గాయం తీవ్రత దృష్ట్యా సెమీఫైనల్ బౌట్‌లో హుసాముద్దీన్ బరిలోకి దిగటం మంచిది కాదని వైద్య బృందం సూచించింది. దీంతో భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) శుక్రవారం అతడిని సెమీస్ పోటీకి నుమతించలేదు. సెమీఫైనల్లో ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చిన హుసాముద్దీన్ కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో హుసాముద్దీన్‌కు ఇదే తొలి పతకం కావడం విశేషం. 'గాయం కారణంగా హుసాముద్దీన్ సెమీఫైనల్ బౌట్‌కు ఫిట్‌నెస్ సాధించలేదు. క్వార్టర్స్‌లో హుసామ్ మోకాలికి గాయం అయింది. వాపు ఇంకా తగ్గలేదు. అతడిని బౌట్‌కు అనుమతించలేదు' అని బీఎఫ్ఐ ఒక ప్రకటనలో తెలిపింది. మరో రెండు సెమీఫైనల్స్ బౌట్లలో దీపక్ భోరియా (51 కేజీలు), నిషాంత్ దేవ్ (71 కేజీలు) ఓటమి పాలై కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన. 2019లో మన బాక్సర్లు ఓ రజతం, ఓ కాంస్యం గెలుచుకోగా.. ఈ సారి మూడు కాంస్య పతకాలు ఖాతాలో వేసుకున్నారు. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి ఇప్పటి వరకు విజేందర్ సింగ్ (2009 కాంస్యం), వికాస్ కృష్ణన్ (2011 కాంస్యం), శివ థాపా (2015 కాంస్యం), గౌరవ్ బిధురి (2017 కాంస్యం), అమిత్ పంఘల్ (2019 రజతం), కౌశిక్ (2019 కాంస్యం), ఆకాశ్ కుమార్ (2021 కాంస్యం) పతకాలు గెలిచారు.

## జూన్‌లో ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్

### ఆరంభ సీజన్‌కు వేదికగా జైపూర్ సిటీ




**న్యూఢిల్లీ :** భారత క్రీడా విపణిలోకి మరో స్పోర్ట్స్ లీగ్ అడుగుపెట్టనుంది. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్) తొలి సీజన్ వచ్చే నెలలో ఆరంభం కానుంది. జూన్ 8-25 వరకు ప్రీమియర్ హ్యాండ్ బాల్ లీగ్ షెడ్యూల్ చేసింది. చారిత్రక అరంగ్రేట సీజన్‌కు పింక్ సిటీ జైపూర్ ఆతిథ్యం ఇవ్వనుంది. జైపూర్‌లోని సవాయ్‌మాన్‌సింగ్ ఇండోర్ స్టేడియంలో ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. పీహెచ్‌ఎల్‌లో ఆరు జట్లు బరిలోకి దిగనున్నాయి. రాజస్థాన్ పాట్రియాట్స్, గర్విట్ గుజరాత్, మహారాష్ట్ర ఐరెన్‌మెన్, గోల్డెన్ ఈగల్స్ ఉత్తర్‌ప్రదేశ్, తెలుగు టాలన్స్, ఢిల్లీ పంజర్స్‌లు తొలి సీజన్‌లో టైటిల్ కోసం పోటీపడనున్నాయి. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ ఏర్పాట్లపై శనివారం రాజస్థాన్ స్పోర్ట్స్‌కౌన్సిల్ అధ్యక్షురాలు కృష్ణ పూనియా మాట్లాడారు.'జైపూర్ వేదికగా హ్యాండ్‌బాల్ లీగ్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్‌తో దేశీయ క్రీడాకారులకు గొప్ప లబ్ది చేకూరనుంది. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్‌తో జాతీయస్థాయిలో హ్యాండ్‌బాల్ మరింత ఆదరణ లభిస్తుంది' అని పూనియా తెలిపారు.

## గోపీచంద్ అకాడమీలో యోనెక్స్ స్టోర్

### అందుబాటులోకి అత్యుత్తమ ఉపకరణాలు



**నవతెలంగాణ-హైదరాబాద్:** భారత బ్యాడ్మింటన్ హబ్ హైదరాబాద్‌లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్రీడా ఉపకరణాలను అందించేందుకు ప్రముఖ షటిల్ ఉపకరణాల ఉత్పత్తుల సంస్థ యోనెక్స్ ముందుకొచ్చింది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్ల కార్ఖానా పుల్లెల గోపీచంద్ అకాడమీలో యోనెక్స్ సంస్థ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను ఆరంభించింది. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీ ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులతో కలిసి బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ గోపీచంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్‌తో పాటు సన్‌రైజ్ స్పోర్ట్స్ ఎండీ విక్రమాదిత్యధర్ పాల్గొన్నారు. 'కొన్నేండ్లుగా భారత బ్యాడ్మింటన్‌తో కలిసి నడుస్తున్నాం. రానున్న కాలంలోనూ భారత్ సాధించబోయే విజయాల్లో భాగం అవుతామని' సన్‌రైజ్ స్పోర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ విక్రమాదిత్యధర్ అన్నారు. 'భారత బ్యాడ్మింటన్‌లో యోనెక్స్‌ది చెరగని ముద్ర. ప్రతిష్టాత్మక టోర్నీలు ఒలింపిక్స్, కామన్వెల్త్, ఆసియా గేమ్స్, ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో భారత షట్లర్లు విజయాలు సాధించటంః మరువలేనిది' అని పుల్లెల గోపీచంద్ అన్నారు. భారత్‌లో దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయి నుంచి బ్యాడ్మింటన్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా యోనెక్స్ కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు.

## నిఖత్ జరీన్‌కు పురస్కారం




**ముంబయి :** ప్రపంచ బాక్సింగ్ చాంపియన్, భారత బాక్సింగ్ సూపర్‌స్టార్ నిఖత్ జరీన్‌ను మరో పురస్కారం వరించింది. ఇటీవల న్యూఢిల్లీ వేదికగా జరిగిన ఐబీఏ ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో పసిడి పతకం సాధించిన తెలంగాణ ముద్దుబిడ్డ నిఖత్ జరీన్.. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో దిగ్గజ బాక్సర్ ఎంసీ మేరీకోమ్ అనంతరం వరుసగా రెండోసారి స్వర్ణం సాధించిన భారత తొలి మహిళా బాక్సర్‌గా చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పసిడి పతకమే లక్ష్యంగా సాగుతున్న నిఖత్ జరీన్ శనివారం ముంబయిలో జరిగిన ఓ అవార్డుల కార్యక్రమంలో ఐబీఎల్‌ఏ 'స్పోర్ట్స్ లీడర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకుంది.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

# 'అ'సమగ్ర శిక్ష




## ప్రధాన పోస్టులన్నీ ఖాళీ

- ఫైనాన్స్, ప్లానింగ్ అన్ని ఒకరికే
- నెలలో స్కూళ్లు ప్రారంభం
- పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టేనా?

**నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి**

పేద విద్యార్థులకు విద్యనందించడంలో కీలకంగా ఉన్న సమగ్ర శిక్షా కార్యాలయం ఖాళీలతో వెక్కిరిస్తోంది. జిల్లాలోని కీలకమైన ప్రధాన పోస్టులన్నీ ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా సమగ్ర శిక్ష గాడి తప్పుతోంది. మరో నెల రోజుల్లో స్కూళ్లు ప్రారంభం కానున్నాయి. జూన్ 1వ తేదీ నాటికే విద్యార్థులకు పుస్తకాలతో పాటు యూనిఫామ్స్ అందజేయాలని సర్కారు ఆదేశించింది. కానీ జిల్లాలో అనుకున్న లక్ష్యం చేరలేని పరిస్థితి నెలకొంది. ఇక కీలకమైన బాధ్యతలన్నీ ఒకరికే అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫైనాన్స్ విభాగంతో పాటు ప్లానింగ్, క్వాలిటీ, ఐఅండ్ఈ తదితర విభాగాల బాధ్యతలను ఒకరికే అప్పగించారు. ఇక కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీ ఉండటంతో ప్రస్తుతం ఉన్న సిబ్బందిపై అధిక పని భారం పడుతోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

నిజామాబాద్ జిల్లాలో సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్లానింగ్ కోఆర్డినేటర్, క్వాలిటీ అండ్ ఓఎస్సీ(ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్), ఐఅండ్ఈ (ఇన్‌క్ల్యూజివ్ ఎడ్యూకేషన్) కోఆర్డినేటర్, ఫైనాన్స్ అండ్ అకౌంట్ ఆఫీసర్ నాలుగు కీలకమైన పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో ఉన్న అధికారులు ఇటీవల కాలంలో పదవీవిరమణ పొందారు. వీరి స్థానంలో ఇప్పటికీ కొత్త వారిని భర్తీ చేయలేదు. ఫలితంగా సమగ్ర శిక్ష లక్ష్యం నెరవేరడం లేదు. ప్లానింగ్ కో ఆర్డినేటర్.. జిల్లాలో ఎంతమంది విద్యార్థులున్నారు? టీచర్ల సంఖ్య ఏంటి? తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటారు. అలాగే మన ఊరు-మన బడి పనులను పర్యవేక్షిస్తున్నారు. దాంతోపాటు జిల్లాలో ఎన్ని స్కూళ్లు ఉన్నాయి.. ఏ స్కూళ్లో ఏ సౌకర్యాలు అవసరం తదితర వివరాలు సేకరించి అవసరమైన పనులు చేయిస్తుంటారు. కానీ ఇంతటి కీలకమైన స్థానం భర్తీకి నోచుకోలేదు. ఇక క్వాలిటీ అండ్ ఓఎస్సీ కో ఆర్డినేటర్.. జిల్లాలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. టీచర్లకు అవసరమైన శిక్షణ ఇవ్వడం, పాఠ్యాంశాల బోధనలో కొత్త మెళకువలు నేర్పడం చూస్తుంటారు. అలాగే బడి బయట ఉన్న పిల్లలకు సంబంధించి సర్వే చేయడం, వారందరినీ స్కూళ్లలో చేర్పించడం చేస్తుంటారు.

ఐ అండ్ ఈ కోఆర్డినేటర్ ప్రత్యేక అవసరాల పిల్లల చదువులకు సంబంధించి సమన్వయ కర్తగా వ్యవహరిస్తుంటారు. వీటన్నింటితో పాటు మరో కీలకమైన ఫైనాన్స్ అండ్ అకౌంట్ ఆఫీసర్ పోస్టు సైతం ఖాళీగా ఉంది. స్కూళ్లకు సంబంధించిన గ్రాంట్లు, జీతభత్యాలు తదితర ఆర్థిక అంశాలకు సంబంధించిన ఫైనాన్స్, అకౌంట్ ఆఫీసర్ పోస్టు కూడా ఖాళీగా ఉండటం గమనార్హం. కాగా, కీలకమైన ఈ స్థానాలకు సంబంధించిన బాధ్యలన్నీ ఒక్కరికే ఒకరికే అప్పగించడంతో సర్కారు అనుకున్న లక్ష్యం నెరవేరుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### లక్ష్యం నేరవేరేనా?

మరో నెల రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. గతేడాది పుస్తకాలు, యూనిఫామ్స్ ఇవ్వడంలో తీవ్రమైన జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో ఈ యేడాది జూన్1వ తేదీ వరకు అన్ని స్కూళ్లకు యూనిఫామ్స్ అందజేయాలని, పుస్తకాలు సరఫరా చేయాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. కానీ జిల్లాలో ఈ బాధ్యతలు చూడాల్సిన కీలకమైన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దాంతో జిల్లాలో ప్రభుత్వ విద్య గాడితప్పే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వెంటనే ఈ కీలకమైన పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరముంది. లేకపోతే ఇబ్బందులు ఏర్పడతాయి. అయితే నెలల తరబడి ఈ పోస్టులు ఖాళీగా ఉన్నా.. భర్తీ చేసేందుకు విద్యాశాఖాధికారులు ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# వృద్ధులను గౌరవించాలి

- సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్
- కరీంనగర్‌లో సీనియర్ సిటీజన్ డే కేర్ సెంటర్ ప్రారంభం



**నవతెలంగాణ - కరీంనగర్**

వృద్ధాప్యం శరీరానికి మాత్రమేనని మనస్సుకు కాదని, వృద్ధులను గౌరవించడం బాధ్యత అని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వృద్ధుల డే కేర్ సెంటర్‌ను బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు వెంకటే నేత, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సునీల్‌రావుతో కలిసి శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ వృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయడంతోపాటు వారి సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఎంతో కృషిచేసి, ఉద్యోగ విరమణ పొందిన వారికి అద్భుతమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించి, కాలక్షేపం కోసం వయోవృద్ధుల కోసం అన్ని జిల్లా కేంద్రాల్లో డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వృద్ధాప్యం శరీరానికి మాత్రమేనని మనస్సుకు కాదని, గడచిన జీవితంలోని అనుభవాలు, సలహాలు సూచనలతో నేటి తరానికి మార్గనిర్దేశం చేసి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. ప్రతి రోజూ డే కేర్ సెంటర్‌ను సందర్శించి కొంత సమయాన్ని గడపాలని సూచించారు.

మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. సమాజానికి వివిధ రంగాల్లో ఎంతో సేవ చేసిన వారిని గౌరవించడం, పూజించడం అదృష్టంగా భావిస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు సీనియర్ సిటిజన్, వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన రెస్క్యూ వాహనాన్ని, ఇదే భవనంలో ఏర్పాటు చేసిన వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, పోలీస్ కమిషనర్ సుబ్బారాయుడు, జిల్లా పరిషత్ సీఈఓ ప్రియాంక, డీడబ్ల్యూఓ సబిత, డీఎంహెచ్ఓ లలితా దేవి, ఆర్డీఓ ఆనంద్ కుమార్, కార్పొరేటర్ దిండిగాల మహేశ్వర్, సీనియర్ సిటిజన్స్ మోహన్‌రెడ్డి, కేశవరెడ్డి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఆరో తరగతితోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు సిహెచ్ రమణకుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు నుంచి పదో తరగతిలో ప్రవేశాలకు గతనెల 16న రాతపరీక్షను నిర్వహించామని తెలిపారు. 70,041 మంది విద్యార్థులు దరఖాస్తు చేస్తే, 55,957 మంది పరీక్ష రాశారని వివరించారు. ఆరో తరగతి ప్రవేశాలతోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల మెరిట్ జాబితాను రూపొందించామని పేర్కొన్నారు. పాఠశాలల వారీగా రూపొందించి సంబంధిత మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లకు పంపించామని వివరించారు. రాతపరీక్షకు హాజరైన అభ్యర్థులు ప్రవేశాల కోసం ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు ఫారం, హాల్‌టికెట్‌తోపాటు అవసరమైన ధ్రువపత్రాలను వెంట తీసుకెళ్లాలని కోరారు.

## నిర్మల్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ ఆమోదం

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హర్షం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

నిర్మల్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ ఆమోదం లభించడం పట్ల మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు 100 మెడికల్ సీట్ల ప్రవేశానికి నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రాథమిక అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. కాలేజీ మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు, ప్రత్యేక చొరవ చూపిన వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావుకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. 2023- 2024 నుంచి మెడికల్ కాలేజీలో తరగతులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. జిల్లా కేంద్రం నిర్మల్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఉత్తర్వులు జారీ చేయటంతో నిధులతో పాటు స్థలం కూడా కేటాయించిందని గుర్తు చేశారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో భర్తీ చేయనున్న 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియలో భాగంగా కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డి విడుదల చేశారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. 15, 16న మల్టీ జోన్ -1 అభ్యర్థులకు, 17, 18న మల్టీ జోన్ -2 అభ్యర్థులకు, 19న మల్టీ జోన్ 1,2 సూపర్ స్పెషాలిటీ అభ్యర్థులకు కోఠిలోని డీఎంఈ ఆడిటోరియంలో కౌన్సిలింగ్ జరగనున్నది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం డీఎంఈ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

# రొడ్డ అంజయ్య స్ఫూర్తితో ఉద్యమాలు

## సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

- 'ఉపాధి' పరిరక్షణకు ఐక్య పోరాటాలు: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు



**నవతెలంగాణ-చౌటుప్పల్**

రొడ్డ అంజయ్య స్ఫూర్తితో ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం, ప్రజాసమస్యలపైనా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో, పంతంగి గ్రామంలో శుక్రవారం వ్యకాస జిల్లా మాజీ అధ్యక్షులు రొడ్డ అంజయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంతంగిలో అంజయ్య స్థూపం వద్ద పార్టీ జెండాను సీతారాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. కూలి పెంచాలి, భూమి పంచాలి, కులవివక్షతను నిర్మూలించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అంజయ్య అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేశారని తెలిపారు. అంజయ్య సీపీఐ(ఎం) బలోపేతానికి ఎంతో కృషిచేశారని తెలిపారు.

అలాగే, కందాల రంగారెడ్డి స్మారక భవనంలో వ్యకాస జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన 'ఉపాధి హామీ చట్టం అమలు - సవాళ్లు' అంశంపై సదస్సులో వెంకట్రాములు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తేసే కుట్ర చేస్తుందని విమర్శించారు. కూలీలకు పనిముట్లు, నీడ కోసం టెంట్లు, నీరు, దూర ప్రాంతం పోతే ప్రయాణ చార్జీలు, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. గతేడాది సగటు పనిదినాల సంఖ్య 47 మాత్రమేనని, కనీసం ఏడాదిలో వంద రోజులు పని కల్పించాలని చట్టం చెబుతున్నప్పటికీ ప్రభుత్వం అందులో సగం కూడా కల్పించడం లేదన్నారు. 2023-24 బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, గతేడాది సవరించిన అంచనా కేటాయింపులో ఏకంగా 33 శాతం కోత పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కార్మికులకు వారం వారం డబ్బులు చెల్లించి, చట్టంలో ఉన్న వాటిని అమలు చేయాలని, రోజు కూలి రూ. 600 ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు.

వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య, ఉపాధ్యక్షులు ములకలపల్లి రాములు మాట్లాడుతూ.. రొడ్డ అంజయ్య.. వ్యవసాయ కూలీల కూలి రేట్ల పెంపు కోసం, సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా అనేక సమరశీల పోరాటాలకు నాయకత్వం వహించి ముందుండి పోరాడారని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేక పోరాటాల్లో తన పాత్ర ఉన్నదని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ.. అంజన్న విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలంతో ఈ ప్రాంతంలో అనేక ఉద్యమాల్లో పనిచేశారని తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనూరి నర్సిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మెన్ బత్తుల శ్రీశైలం, వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు గంగదేవి సైదులు, జల్లెల పెంటయ్య, జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌలు, జిల్లా సహాయ కార్యదర్శి గుంటోజీ శ్రీనివాస్ చారి, సిరిపంగి స్వామి, మండల ప్రధాన కార్యదర్శి బొజ్జ బాలయ్య, అంజన్న సతీమణి రొడ్డ రాములమ్మ, అశోక్, భగత్, బాలరాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# రిమ్స్‌లో వైద్యుల జాడేది?

**పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నచందంగా మారింది ఆదిలాబాద్‌లోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పరిస్థితి. పేదలకు వైద్యం అందించేందుకు ఏర్పడిన ఏడంతస్తుల భవనం అలంకార ప్రాయంగా మారుతోంది. ఆస్పత్రి ప్రారంభమై ఏడాది గడుస్తున్నా వైద్యుల పోస్టులు భర్తీ కావడం లేదు. కీలకమైన ఎనిమిది విభాగాల వైద్య సేవలు స్థానికంగానే లభిస్తాయని పాలకులు, ఉన్నతాధికారులు పలుమార్లు చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. మూడు నెలల కిందట ఐదు విభాగాల్లో ఘనంగా ప్రారంభించిన సేవలు అనతికాలంలోనే నిలిచిపోయాయి. నియామకమైన కొద్ది రోజులకే వైద్యులు వెళ్లిపోవడంతో ప్రస్తుతం రెండు విభాగాలు మాత్రమే సేవలందిస్తున్నాయి. ఇది వరకు కూడా జిల్లా వాసులకు ఇలాంటి పరిస్థితే ఎదురుకావడంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నాణ్యమైన సేవలు లభిస్తాయా అనేది అనుమానంగా మారుతోంది.**

## రెండు విభాగాల్లోనే సేవలు

- అందని కార్డియో, యూరాలజీ, అంకాలజీ సేవలు
- ఈ నెల 15న వైద్యుల నియామకం కోసం కౌన్సెలింగ్ : డీఎంఈ

**నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులకు అన్ని రకాల నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అప్పట్లో రిమ్స్ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. దీనికి అదనంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2011లో రూ.150కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరు చేశాయి. అప్పటి నుంచి కొనసాగుతూ వచ్చిన నిర్మాణం రెండేండ్ల కిందట పూర్తయింది. కీలకమైన కార్డియాలజీ, యూరాలజీ, అంకాలజీ, న్యూరోసర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, కార్డియోతొరాసిక్ సర్జరీ, నెఫ్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ వంటి ఎనిమిది కీలక విభాగాల్లో సేవలందించాలని సంకల్పించింది. తొలుత ఏడాది కిందట కార్డియో, అంకాలజీ, న్యూరోసర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ విభాగాల్లో సేవలు ప్రారంభించారు. సుమారు మూడు నెలలే కొన సాగిన ఈ సేవలు వైద్యులు అర్ధాంతరంగా వెళ్లిపోవడంతో పూర్తిగా నిలిచి పోయాయి. అనంతరం అధికారులు వైద్యుల నియామకాన్ని చేపట్టారు. ఐదుగురు వైద్యులు రావడంతో మళ్లీ మూడు నెలల కిందట సూపర్ సేవలు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. కానీ అనతికాలంలోనే కార్డియాలజీ, యూరాలజీ, అంకాలజీ వైద్యులు వెళ్లిపోవడంతో మళ్లీ సూపర్ సేవలకు విఘాతం ఏర్పడింది. ఇక్కడి వాతావరణం అనుకూలించక పోవడం, తక్కువవేతనాలు ఇస్తుం డటమే వైద్యులు కొనసాగేందుకు ఇష్టపడలేదని తెలుస్తోంది.

### వైద్యుల నియామకం ఉంటుంది

ఈ నెల 15వ తేదీ నుంచి వైద్యుల నియామకం కోసం కౌన్సెలింగ్ ఉంటుంది. సూపర్ స్పెషాలిటీలో ఎనిమిది విభాగాలు ఉన్నాయి. ఒక్కో విభాగానికి ఇద్దరేసి చొప్పున 16మంది వైద్యులు వచ్చేందుకు ఆస్కారం ఉంది.

**జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్**

### ప్రస్తుతం రెండే విభాగాల్లో వైద్యం

వచ్చిన వైద్యులు వచ్చినట్టే వెళ్లిపోవడంతో పేదలకు సూపర్ స్పెషాలిటీలో నాణ్యమైన వైద్యం కలగానే మారుతోంది. సుమారు మూడు నెలలపాటు ఐదు కీలక విభాగాల్లో సేవలు లభించగా.. ప్రస్తుతం న్యూరోసర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ విభాగాల్లోనే మాత్రమే సేవలు అందుతున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రి తరహా నిర్మించిన ఈ భవనంలో అన్ని రకాల సేవలు లభించేలా యంత్రాలు, పరికరాలు అమర్చారు. కేవలం వైద్యుల భర్తీనే సమస్యగా ఉంది. సాంకేతిక సిబ్బంది, టెక్నీషియన్లు, తదితర అన్ని రకాల సిబ్బంది అందుబాటులో ఉన్నారు. కానీ అవసరమైన వైద్యులు రావడం లేదు. ఇక్కడ అలాంటి పరిస్థితి ఉండటంతో ప్రజలు గత్యంతరం లేక హైదరాబాదు, నాగ్‌పూర్, యవత్మాల్, నిజామాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు.

### డీఎంఈ పైనే భరోసా..!

రెండు నెలల కిందట జిల్లాకు వచ్చిన డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఎడ్యూకేషన్ (డీఎంఈ) త్వరలోనే వైద్యుల పోస్టులను భర్తీ చేస్తామని హామీనిచ్చారు. ఇందుకు నెల 15న తేదీ నుంచి వైద్యుల నియామకం కోసం కౌన్సెలింగ్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రిలో ఎనిమిది విభాగాలు ఉండగా త్వరలో జరుగనున్న కౌన్సెలింగ్‌లో విభాగానికి ఇద్దరు చొప్పున కనీసం 16మంది వైద్యులైనా వస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 24 మంది సీనియర్ రెసి డెంట్లుగా పనిచేస్తున్నా పూర్తి స్థాయి వైద్యులు ఉంటేనే ప్రజలకు ఆరోగ్య సేవలపై భరోసా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## నాటి గడీలే.. నేటి ఫామ్‌హౌజ్‌లు

- కేసీఆర్ వెలిగిపోతుండు.. ప్రజలు నలిగిపోతుంద్రు
- రాష్ట్రంలో సీలింగ్ యాక్ట్ అమల్లో ఉందా? లేదా?
- కమీషన్ల కోసం ప్రాణహితను చంపేసిన కేసీఆర్:సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో కొనసాగిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర



**నవతెలంగాణ-షాబాద్**

రాష్ట్రంలో ఫామ్‌హౌజ్‌ల పేరిట నాటి గడీల పునర్‌నిర్మాణం జరుగుతున్నదని, ఇది తెలంగాణ పునర్నిర్మాణం ఎట్లా అవుతుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా భట్టి విక్రమార్క శుక్రవారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా హైతాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీసీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో భూ సంస్కరణల చట్టం, సీలింగ్ యాక్ట్ అమలులో ఉందా? లేదా? ప్రశ్నార్థకంగా మారిందా అన్న అనుమా నం వ్యక్తం అవుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చందనవెల్లిలో పేద ప్రజలు సాగు చేసుకోవడానికి సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన రెండు వేల ఎకరాల భూములను పంపిణీ చేసిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెజ్ పేరిట ఆ భూములను తిరిగి లాక్కుందని విమర్శించారు. గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ అనేక గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు పంపిణీ చేసిన లక్షల ఎకరాల భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం సెజ్‌ల పేరిట సంపన్నులకు కట్టబెట్టేందుకు బలవంతంగా తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజల సంపద దోపిడీ చేస్తూ ముఖ్యమంత్రి కుటుంబం వెలిగిపోతుందని, నాలుగు కోట్ల ప్రజలు రాజ్య హింసలో నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చందనవెల్లి భూనిర్వాసితుల పక్షాన సంబంధిత దర్యాప్తు సంస్థలకు సీఎల్పీ నేతగా తాను లేఖ రాస్తానని, గవర్నర్‌ని కూడా కలుస్తామని, అవసరమైతే రాష్ట్రపతికి కూడా ఈ అవకతవకలపై లేఖ రాస్తానని వెల్లడించారు. ధరణిని స్కామ్‌గా మార్చిన దాని రూపకర్త, మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్‌కుమార్ వీఆర్ఎస్ తీసుకున్న తర్వాత తిరిగి ప్రభుత్వం చీఫ్ అడ్వైజర్‌గా తెచ్చుకోవడం భూ కుంభకోణాల నుంచి కాపాడుకోవడం కోసమేనని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. తక్షణమే ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. కమీషన్ల కోసమే ప్రాణహిత ప్రాణం తీశారని ఆరోపించారు.

రంగారెడ్డి జిల్లాకు జూరాల నుంచి నీళ్లు ఇస్తామని కొన్నాళ్లు.. పాకాల నుంచి ఇస్తామని మరికొన్నాళ్లు.. రంగారెడ్డి పాలమూరు ఎత్తిపోతల ద్వారా నీళ్లు ఇస్తామని, కుర్చీ వేసుకుని అక్కడే ఉండి పనులు చేయిస్తానని చెప్పిన కేసీఆర్ పదేండ్లు కావస్తున్నా రంగారెడ్డి జిల్లాకు చుక్క నీరు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద మొదటి పంపు నిర్మాణమే ఇంకా కాలేదన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ భూసేకరణ జరగలేదన్నారు. 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో అత్యంత స్వల్పంగా రావడంతో బాధ్యత కలిగిన మంత్రిగా సబితాఇంద్రారెడ్డి కనిపించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, పీసీసీ అధికార మాజీ ప్రతినిధి పామెన భీంభరత్, చేవెళ్ల నియోజకవర్గం సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, షాబాద్ దర్శన్ పాల్గొన్నారు.

## ప్రజల బాధలు పట్టించుకోకుండా.. సలహాదార్లెందుకు?:వైఎస్ షర్మిల

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ప్రజల బాధలు పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల సలహాలు పాటించకుండా..కాలయాపన చేస్తూ..ప్రత్యేక సలహాదారులను నియమించకోవడమేంటని ప్రశ్నించారు. రైతుల సమస్యల గురించి కేసీఆర్‌కు చెవిటోని ముందు శంఖం ఊదినట్టుగా ఉన్నదని పేర్కొన్నారు. సలహాలు తీసుకోనప్పుడు సలహాదారులెందుకని ప్రశ్నించారు.

## కుల వృత్తులను ప్రోత్సహించాలి : దాసు సురేశ్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వ బీసీ కులవృత్తులను తగిన విధంగా ప్రోత్సహించటం లేదని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు.. గొల్ల కురుమ, పాడి రైతులు నిర్వహించే పాల ఉత్పత్తులను అగ్రవర్ణాలు, కార్పొరేట్ శక్తులు దోచుకుంటుంటే ప్రభుత్వం పట్టీపట్టనట్టు వ్యవహరించటం తగదని పేర్కొన్నారు. పాల ఉత్పత్తులను రసాయనాలతో కలుషితం చేసి ప్రజల, పసిపిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా గొల్ల కురుమ యాదవులకు చెందాల్సిన సంపదను కార్పొరేట్ కు ప్రభుత్వం కట్టబెడుతున్నదని విమర్శించారు.ప్రభుత్వం నిర్వహించే విజయ పాల ఉత్పత్తులను ప్రోత్సహించకుండా ఇతర వ్యాపార సంస్థలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు.

## ప్రగతిభవన్ నుంచే ధరణి ఆపరేటింగ్

### కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ధరణి పోర్టల్‌లో మార్పులుచేర్పులు ప్రగతిభవన్ నుంచే జరుగుతున్నాయని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. ధరణిని తీసుకొచ్చింది రైతులు, ప్రజల కోసం కాదనీ, అది గులాబీ లీడర్ల కోసమని విమర్శించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లక్షల ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. రాత్రికి రాత్రే భూములను నిషేధిత జాబితాలో చేర్చుతున్నారనీ, పరిష్కారం పేరుతో మధ్యవర్తులు, దళారులు రంగంలోకి దిగుతున్నారని ఆరోపించారు. ఒకప్పుడు గ్రామస్థాయిలో పరిష్కారమయ్యే భూములను నేడు ప్రగతిభవన్ కేంద్రంగా సెటిల్‌మెంట్ చేస్తున్నారని ఆరోపించారు. ధరణి సమస్యల పరిష్కారం కోసం క్యాబినెట్ సబ్ కమిటీ ఎందుకు వేశారు? అది రిపోర్టు ఇచ్చిందా? ఇస్తే ఏముంది? రాష్ట్ర ప్రభుత్వం ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంది? వాటన్నింటికీ రాష్ట్ర సర్కారు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. ధరణిపై ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయి? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? అనే విషయాలను చెప్పాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పార్టీ చేతుల్లో టీఆర్ఎస్ బందీ అయిందని విమర్శించారు. పాతబస్తీలో ప్రభుత్వ అధికారులు కూడా స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితి లేదని చెప్పారు. ఎమ్మెల్యే రాజాసింగ్ సచివాలయానికి వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారనీ, అసలు ఎమ్మెల్యేలనే లోపలికి వెళ్లనీయని సచివాలయం ఎందుకు అని నిలదీశారు. మధ్యప్రదేశ్ నుంచి పోలీసులు వచ్చి ఇక్కడి ఉగ్రవాదులను అరెస్టు చేస్తుంటే మన రాష్ట్రంలో వందల కోట్ల రూపాయలతో కట్టిన కమాండ్ కంట్రోల్ రూమ్ ఏం చేస్తున్నదని ప్రశ్నించారు.

బిజినెస్

## పారిశ్రామికోత్పత్తి పడక

- మార్చిలో 1.1 శాతమే పెరుగుదల



న్యూఢిల్లీ : దేశంలో అధిక ధరలు పారిశ్రామిక ఉత్పత్తిని దెబ్బతీస్తున్నాయి. డిమాండ్ లేమితో ఉత్పత్తుల కొనుగోళ్లు తగ్గుతున్నాయి. దీంతో అంతిమంగా తయారీపై ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత ఏడాది మార్చిలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) పెరుగుదల 1.1 శాతానికే తగ్గి.. ఐదు నెలల కనిష్టానికి పడిపోయింది. ఇంతక్రితం ఫిబ్రవరిలో ఇది 5.6 శాతం వృద్ధిని సాధించింది. 2022-23లో స్థూలంగా 5.1 శాతం పెరుగుదల నమోదు కాగా.. ఇంతక్రితం ఏడాదిలో 2021-22లో ఏకంగా 11.4 శాతం వృద్ధి జరిగింది. దీంతో పోల్చితే గడిచిన ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామిక ఉత్పత్తిలో మందగమనం చోటు చేసుకుందని స్పష్టమవుతోంది.

కేంద్ర గణంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం వెల్లడించిన డేటా ప్రకారం.. 2023 మార్చిలో తయారీ రంగం కేవలం 0.5 శాతం పెరుగుదలను మాత్రమే నమోదు చేసింది. గనుల రంగం 6.8 శాతం పెరగ్గా.. విద్యుత్ రంగం ఉత్పత్తి 1.6 శాతం తగ్గింది. కన్స్యూమర్ డ్యూరెబుల్స్ సూచీ వరుసగా నాలుగో మాసంలోనూ పడిపోయింది. ఈ సూచీ మార్చిలో 8.4 శాతానికి తగ్గి.. మూడు నెలల కనిష్ఠ స్థాయి వద్ద నమోదయ్యింది. "మార్చిలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి 1.1 శాతానికి పడిపోవడం చాలా నిరాశపర్చింది. మేము 3.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేశాము. ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగింపు నెల మార్చిలో సాధారణంగా పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుతుంది. కానీ.. ఈ సారి అలా జరగలేదు. ఐఐపీ పడిపోవడంతో పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) సూచీలను సమీక్షించాల్సి ఉంటుంది." అని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనామిస్ట్ మదన్ సబ్నవిస్ పేర్కొన్నారు.

**4.7 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం**

ప్రస్తుత ఏడాది ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 4.7శాతానికి తగ్గింది. దీంతో వరుసగా రెండో మాసంలోనూ ఆర్‌బిఐ అంచనాల కంటే తక్కువగా చోటు చేసుకోవడం విశేషం. గతేడాది ఇదే ఏప్రిల్‌లో ఏకంగా 7.8 శాతం పెరిగింది. 2023 మార్చిలో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ 5.66 శాతంగా చోటు చేసుకుంది. 2022-23లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ 5.2 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ అంచనా వేసింది. జూన్ త్రైమాసికంలో సగటున 5.4 శాతం, క్యూ2లో 5.4 శాతం, క్యూ3, క్యూ4లలో 5.2 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. దీని కంటే తక్కువగా చోటు చేసుకోవడంతో కీలక వడ్డీ రేట్లు తగ్గించడానికి వీలుంది.

## ట్రాక్టర్ అమ్మకాల్లో పతనం



చెన్నయ్ : దేశీయంగా ట్రాక్టర్ అమ్మకాల్లో పతనం చోటు చేసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గడంతో ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన ఏప్రిల్‌లో ట్రాక్టర్ విక్రయాలు 11 శాతం క్షీణించి 79,288 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. 2012 ఇదే మాసంలో 89,201 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. 2023 మార్చిలోనూ 82,856 యూనిట్ల అమ్మకాలు జరగ్గా.. దీంతో పోల్చిన గడిచిన నెల డిమాండ్‌లో తగ్గుదల చోటు చేసుకుంది. 2023 ఏప్రిల్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా ట్రాక్టర్ అమ్మకాలు 10 శాతం తగ్గి 35,938 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఎస్కార్ట్స్ కుబోటా ట్రాక్టర్ల అమ్మకాలు 5.5 శాతం తగ్గి 7,252 యూనిట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో ట్రాక్టర్ పరిశ్రమ ఒక్క అంకె వృద్ధితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేలా ఉందని ఆ రంగం వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## పోకో ఎఫ్5 5జీ విడుదల

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ తయారీదారు పోకో తన కీలకమైన ఎఫ్- సిరీస్‌లో సరికొత్త పోకో ఎఫ్5 5జీని ఆవిష్కరించినట్లు ప్రకటించింది. స్నాప్ డ్రాగన్ 7ప్లస్ జెన్2తో దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. 64 ఎంపి ప్రైమరీ కెమెరా, 8ఎంపీ, 2ఎంపీ మైక్రో కెమెరాలతో సహా సెల్ఫీ కోసం 16ఎంపి కెమెరాను అమర్చినట్లు తెలిపింది. 5000 ఎంఎహెచ్ బ్యాటరీతో కూడిన 8జీబి, 256 జీబి వేరియంట్ ధరను రూ.29,999గా, 12జీబి, 256 జీబి వేరియంట్ ధరను రూ.33,999గా నిర్ణయించింది. మే 16 నుంచి ఆన్‌లైన్‌లో లభ్యమవుతుందని తెలిపింది.

## ట్విట్టర్ చీఫ్‌గా లిండా యాకరినో..!



శాన్‌ఫ్రాన్సిస్కో:సోషల్ మీడియా దిగ్గజం ట్విట్టర్‌కు కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా లిండా యాకరినో నియమితులు కానున్నారని రిపోర్ట్‌లు వస్తోన్నాయి. ట్విట్టర్‌కు ఓ మహిళను బాస్‌గా తీసుకురానున్నామని ప్రస్తుత సిఇఒ ఎలన్ మస్క్ తెలిపారు. అయితే మస్క్ ఆమె పేరు చెప్పకపోయినప్పటికీ.. మీడియాలో యాకరినో పేరు చక్కర్లు కొడుతోంది. యాకరినో ప్రస్తుతం ఎన్‌బిసి యూనివర్సల్‌లో అడ్వర్టైజింగ్ అండ్ పార్ట్‌నర్ షిప్స్ విభాగం ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమెతో మస్క్‌కు ఎప్పటి నుంచో పరిచయం ఉందని.. తనతో చర్చలు జరుపుతున్నారని సమాచారం.

## టాస్క్‌తో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఒప్పందం



హైదరాబాద్ :ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం మద్దతు ఇస్తున్న టాస్క్‌తో కలిసి పని చేయనున్నట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. కొత్త గ్రాడ్యూయేట్లకు, పోస్టు గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)తో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించింది. ఈ ఒప్పందంపై హైదరాబాద్‌లో టాస్క్ సిఇఒ శ్రీకాంత్ సిన్హా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ టాలెంట్ అక్విజిషన్ హెడ్ రంగ సుబ్రమణి యన్ సంతకాలు చేశారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులకు టాస్క్ సహాయాన్ని అందిస్తుంది. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు, ఇంటర్వ్యూలకు అన్ని రకాల లాజిస్టికల్ మద్దతును టాస్క్ కల్పిస్తుంది.

## రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- లేకపోతే తీవ్ర పరిణామాలు:బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కుల దురహంకారంతో గొల్లకురుమలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్ బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం మాట్లాడారు. లింగయ్య యాదవ్ మాట్లాడుతూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు నేరచరిత్ర ఉందా? ఓటుకు నోటు దొంగ రేవంత్ చెప్పాలని ప్రశ్నించారు. గొల్ల కురుమలకు క్షమాపణ చెప్పాలనీ, లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. యెగ్గే మల్లేశం మాట్లాడుతూ, తలసాని శ్రీనివాస్ యాదవ్ ను రేవంత్ రెడ్డి కులం పేరుతో దూషించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్కారం లేని రేవంత్‌ను వచ్చే ఎన్నికల్లో గొల్లకురుమలు ఓడిస్తారని హెచ్చరించారు. రేవంత్ దురహంకారానికి మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

## అవార్డుల దరఖాస్తుల గడువు మే 31 వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర హస్త కళాభివృద్ధి సంస్థ ఇచ్చే స్టేట్ అవార్డ్స్ - 2022కు దరఖాస్తు చేసుకునే గడువును మే 31 వరకు పొడిగించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తులను టీఎస్ హ్యాండిక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లేదా గోల్కొండ హ్యాండిక్రాఫ్ట్స్ ఎంపోరియం, లేదా సంస్థ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040- 2761 1957లో సంప్రదించొచ్చు.

# పన్ను మినహాయింపులు సులభతరం చేయండి

## ఐటీ శాఖకు సీఏలు, స్వచ్ఛంద సంస్థల విజ్ఞప్తి




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆదాయ పన్ను మినహాయింపులను మరింత సులభతరం చేయాలని పలువురు చార్టెడ్ అక్కౌంటెంట్లు, స్వచ్ఛంద, దేవాలయ, విద్యా సంస్థల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో అనేక సమస్యలు ఎదురవుతున్నాయనీ, వాటిని పరిష్కరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆదాయపన్ను శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మాసాబ్ ట్యాంక్‌లోని ఐటీ టవర్స్ కార్యాలయంలో కేంద్ర ఆదాయపన్ను శాఖ (మినహాయింపులు) ముఖ్య ప్రధాన కమిషనర్ శ్రీమతి రేణు జౌహ్రీ (ఢిల్లీ)తో 'ముఖాముఖి' కార్యక్రమం నిర్వహించారు. ఏపీ, తెలంగాణ ఆదాయపన్నుశాఖ (మినహాయింపులు) కమిషనర్ బీ బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీ కోటేశ్వరమ్మ (జేసీఐటీ), కొరివి సుధ, ధృవ్ అష్టా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఐటీ ఫైలింగ్స్‌లో సమస్యలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. 2020 నుంచి ఐటీ నిబంధనల్లో మార్పులు వచ్చాయనీ, వాటిపై అందరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మెంబర్స్ ఆఫ్ బార్ అసోసియేషన్ తరపున చార్టెడ్ అక్కౌంటెంట్ వేణుగోపాలరావు ఆదాయపన్ను శాఖ రిటర్న్స్ దాఖలులు ఏర్పడుతున్న సమస్యల్ని ఏకరువు పెట్టారు. పెద్ద సంఖ్యలో హాజరైన ట్రస్టులు, దేవాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల ప్రతినిధులు తమ సందేహాలను వ్యక్తం చేశారు. దీనిపై రేణుజౌహ్రీ స్పందిస్తూ, కొన్ని నిబంధనలను ప్రభుత్వం ముందస్తుగా ఏర్పాటు చేసిందనీ, ఐటీ మినహాయింపులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకే కొన్ని కఠిన నిబంధనలు విధించినట్టు చెప్పారు. వాటికి అనుగుణంగానే ఐటీ రిటర్న్స్‌ను దాఖలు చేయాలని సూచించారు. తమ పరిధిలో ఉన్న అంశాలను పరిష్కరిస్తామనీ, అంతకుమించి ఉన్న అంశాలను కేంద్ర ప్రభుత్వానికి రాతపూర్వకంగా సిఫారసు చేస్తామని చెప్పారు. ఆదాయపన్ను చెల్లింపులు పెరగాలనీ, స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టుల పేరుతో నిధుల దుర్వినియోగం జరిగితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# స్పాట్‌లో పాల్గొన్న అధ్యాపకులకు రెమ్యూనరేషన్ ఇవ్వాలి

## ఇంటర్ బోర్డు సీవోఈకి టీపీటీఎల్ఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న అధ్యాపకులకు రెమ్యూనరేషన్ వెంటనే ఇవ్వాలని తెలంగాణ ప్రయివేట్ టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇంటర్ ఫలితాలు విడుదలైనా ఇప్పటి వరకు రెమ్యూనరేషన్ ఇవ్వక పోవడం సిగ్గుచేటని విమర్శించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి (సీవోఈ) జయప్రద బాయ్‌ని శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్‌కుమార్, నాయకులు చందు, కె విజయ్‌కుమార్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌లో అంతకు ముందు ప్రాక్టికల్స్ నిర్వహణలో పాల్గొన్న అధ్యాపకులకు రెమ్యూనరేషన్ ఇప్పటి వరకు ఇవ్వక పోవడంవల్ల వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రయివేటు కాలేజీల్లో పనిచేసే అధ్యాపకులందరికీ ఇబ్బంది ఉందని పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో ప్రయివేటు అధ్యాపకులకు జీతాల్లేక, రెమ్యూనరేషన్ రాక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గతంలో ఏరోజుకారోజు రెమ్యూనరేషన్ ఇచ్చే పద్ధతిని కొనసాగించాలని కోరారు. అధ్యాపకులకు ప్రాక్టికల్, స్పాట్ రెమ్యూనరేషన్‌తోపాటు టీఏ, డీఏలు చెల్లించాలని సూచించారు.

# ఖమ్మం జిల్లా ఆస్పత్రికి బీఎఫ్‌హెచ్ఐ గుర్తింపు

## రాష్ట్రంలో ఆ సర్టిఫికెట్ సాధించిన ఆరో దవాఖానా

- దేశంలోనే అత్యధిక అక్రిడిటేషన్లతో జాతీయ రికార్డు
- తల్లిపాలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖమ్మం జిల్లాస్పత్రికి 'బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ హాస్పిటల్' గుర్తింపు దక్కింది. ముర్రుపాలు అందించడం, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించేలా అవగాహన కల్పించే దవాఖానాలకు 'బేబీ/బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ హాస్పిటల్ ఇనిషియేటివ్' (బీఎఫ్‌హెచ్ఐ)లో భాగంగా ఈ సర్టిఫికెట్ అందజేస్తారు. ఖమ్మంతో కలిపి ఇప్పటి వరకు రాష్ట్రంలో ఆరు దవాఖానాలు బీఎఫ్‌హెచ్ఐ గుర్తింపును పొందాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో బాన్సువాడలోని ఎంసీహెచ్ మొదటి బీఎఫ్‌హెచ్ఐ సర్టిఫికెట్ సాధించింది. ఆ తర్వాత జనగాం ఎంసీహెచ్, గజ్వేల్ ఏరియాస్పత్రి, సూర్యాపేట ఎంసీహెచ్, జహీరాబాద్ ఏరియాస్పత్రి ఈ గుర్తింపు పొందాయి. తద్వారా దేశంలోనే అత్యధిక బీఎఫ్‌హెచ్ఐ అక్రిడేటెడ్ ప్రభుత్వ దవాఖానాలున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించింది. బిడ్డ పుట్టిన అరగంటలోనే ముర్రుపాలు తాగించాలనీ, బిడ్డకు ఆరు నెలల వయసు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. తద్వారా ఐదేండ్లలోపు పిల్లల మరణాలను 22 శాతం నివారించవచ్చు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తల్లిపాల వినియోగం, శిశు మరణాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఒకవైపు ఎంసీహెచ్‌లు, ఎస్ఎన్‌సీయూలు వంటి సదుపాయాలు కల్పించింది. మరోవైపు 'బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా' (బీపీఎన్ఐ) సహకారంతో 30 మంది మాస్టర్ ట్రైనీలకు శిక్షణనిచ్చింది. ఇలా శిక్షణ ఇప్పించిన తొలిరాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. ఆయా ట్రైనీలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలకు శిక్షణ ఇస్తున్నారు. వారు గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

**ప్రత్యేక చర్యలివే**

తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించేందుకు వైద్యారోగ్యశాఖ అనేక చర్యలను తీసుకున్నది. ప్రసవమైన గంటలోపే ఆపరేషన్ థియేటర్‌లో లేదా ప్రసూతి గదిలో శిశువులకు ముర్రుపాలు అందిస్తే.. తల్లుల కేస్‌షీట్‌లో ప్రత్యేకంగా ఆకుపచ్చ రంగులో ఉండే బ్రెస్ట్ ఫీడింగ్ స్టాంపులు వేస్తున్నారు. తద్వారా ఎంత మంది పిల్లలకు ముర్రుపాలు అందాయో పర్యవేక్షించేందుకు అవకాశం కలిగింది. రెండు కాంప్రహెన్సివ్ లాక్టేషన్ మేనేజ్మెంట్ సెంటర్లు (సీఎల్ఎంసీ), రెండు లాక్టేషన్ మేనేజ్మెంట్ యూనిట్లను (ఎల్ఎంయూ) స్థాపించారు. ఈ క్రమంలో ప్రభుత్వ దవాఖానాల్లో అత్యధిక డెలివరీలు జరుగుతున్న 41 కేంద్రాలను ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ ప్రత్యేకంగా లాక్టేషన్ వర్కర్లను నియమించింది. వీరు మూడు షిఫ్టుల్లో అందుబాటులో ఉంటారు. వీరు తల్లిపాల గురించి ఏఎన్సీ, పీఎన్సీ చెకప్‌ల సమయంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తారు. ఆపరేషన్ థియేటర్లలో, ప్రసూతి గదిలో ఉండి నవజాత శిశువులకు ముర్రుపాలు అందేలా చూస్తారు. మొదటి దశలో 50 ప్రభుత్వ దవాఖానాలకు బీఎఫ్‌హెచ్ఐ గుర్తింపు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ క్రమంలో ఇప్పటికే ఆరు దవాఖానాలు అక్రిటిడేషన్ సాధించగా, మరో తొమ్మిది దవాఖానాలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటికి కూడా త్వరలోనే గుర్తింపు వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సర్టిఫికెట్ కాలపరిమితి మూడేండ్లు.

**మంత్రి హరీశ్ రావు అభినందనలు**

ఖమ్మం జిల్లాస్పత్రికి బీఎఫ్‌హెచ్ఐ అక్రిడేషన్ రావడం పట్ల వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. సిబ్బందికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పడానికి ఇది మరో నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇలాంటి ప్రత్యేక కార్యాచరణ ఫలితంగా నవజాత శిశుమరణాలు, ఐదేండ్లలోపు పిల్లల మరణాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు.

# ఇక ఎర్రటెండలే

- రెండ్రోజుల్లో 45 నుంచి 46 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు !
- రెడ్‌జోన్‌లో 13 జిల్లాలు
- వీణవంకలో 44.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎర్రటెండలు మండిపోతున్నాయి. వచ్చే మూడు, నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగి 45 నుంచి 46 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉంది. 45 డిగ్రీలు దాటిన ప్రాంతాలను వాతావరణ శాఖ రెడ్‌జోన్‌లో ఉన్నట్టుగా చూపుతున్నది. వచ్చే రెండు రోజుల్లో రాష్ట్రంలో 13 జిల్లాల్లో 45 డిగ్రీలు దాటే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల 46 డిగ్రీలకు కూడా చేరుకునే అవకాశముంది. రెడ్‌జోన్ హెచ్చరిక జాబితాలో కరీంనగర్, జగిత్యాల, జయశంకర్‌భూపాలపల్లి, పెద్దపల్లి, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఖమ్మం, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలున్నాయి. హైదరాబాద్‌లోనూ 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగటం, ఉక్కపోత తీవ్రం అవుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కరీంనగర్ జిల్లా వీణవంకలో శుక్రవారం అత్యధికంగా 44.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. చాలా ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటాయి. మైలపల్లి(పెద్దపల్లి) 44.5 డిగ్రీలు, రామగుండం(పెద్దపల్లి) 44.5 డిగ్రీలు, కొల్లూరు(కామారెడ్డి)44.3 డిగ్రీలు, అర్లి(టి)(ఆదిలాబాద్) 44.3 డిగ్రీలు, గూడూరు(జగిత్యాల)44.2 డిగ్రీలు, వెల్లటూరు(జగిత్యాల)44.2 డిగ్రీలు, లక్మాపూర్(నిజామాబాద్) 44.1 డిగ్రీలు, రాఘవపేట(జగిత్యాల) 44.1 డిగ్రీలు, కమాన్‌పూర్(పెద్దపల్లి)లో 44.0 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# సీవీ ఆనంద్‌కు అతిఉత్కృష్ట సేవా పతకం

## అభినందించిన పీస్ కమిటీ సభ్యులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ అనంద్‌కు అతి ఉత్కృష్ట సేవా పతకం లభించింది. విధి నిర్వహణలో ఆయన చూపిన ప్రతిభకు గుర్తింపుగా కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఈ అవార్డును ప్రకటించింది.

ఈ సందర్భంగా హైదరాబాద్ పీస్ కమిటీ సభ్యులు సీవీ అనంద్‌కు అభినందనలు తెలిపారు. పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్ శరత్‌శ్యాం ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు చెప్పారు. ఆయనతో పాటు పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ ఉపాధ్యక్షులు డాక్టర్ యూసఫ్ హమీదీ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మజహ్రుద్దీన్, సౌత్ వెస్ట్ జోన్ అధ్యక్షులు మౌజం, సెంట్రల్ జోన్ అధ్యక్షులు శశికాంత్, సౌత్‌జోన్ అధ్యక్షులు ఖాజా అబ్దుల్ మొయిజ్, వెస్ట్‌జోన్ అధ్యక్షురాలు తేజు తదితరులు కమిషనర్ సీవీ అనంద్‌కు అభినందనలు తెలిపారు.

# యాసంగి జొన్న పంటను కొంటాం

- సీఎం నిర్ణయం పట్ల వేముల హర్షం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పండిన యాసంగి జొన్న పంటకు మద్దతు ధర చెల్లించి రాష్ట్ర ప్రభుత్వమే సేకరిస్తుందని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రైతుల పక్షాన సీఎంకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రైతు పక్షపాతిగా ఉన్న సీఎం ఎప్పుడూ రైతుకు కష్టం రానివ్వరనీ, రైతులను కంటికి రెప్పలా కాపాడుకునే మనసున్న నేత అని కొనియాడారు. రైతు సంక్షేమం కోసం కేసీఆర్ మరెవరూ కనీసం ఆలోచన చేయలేరని తేల్చి చెప్పారు. రైతుకు భరోసా కల్పించడంలో కేసీఆర్ తర్వాతే ఎవరైనా అని తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్ పరిధిలో జొన్న పంటను పండించిన రైతులకు లబ్ధి చేకూరనున్నదని వేముల ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎంసెట్ ఇంజినీరింగ్‌కు 94.64 శాతం హాజరు

- రేపటితో ముగియనున్న రాతపరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో శుక్రవారం ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 14వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ఎంసెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ కె విజయకుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగానికి తొలిరోజు ఉదయం నిర్వహించిన మొదటి విడతకు 34,507 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, 32,656 (94.64 శాతం) మంది హాజరయ్యారు. మొదటి విడతకు 1,851 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో విడతకు 34,242 మంది దరఖాస్తు చేయగా, 32,464 (94.80 శాతం) మంది పరీక్ష రాశారు. రెండో విడతకు 1,779 మంది గైర్హాజరయ్యారు. ఎంసెట్ ఇంజినీరింగ్ రాతపరీక్షలు ఆదివారంతో ముగియనున్నాయి. ఈ పరీక్షల నిర్వహణ తీరును ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కట్టా నర్సింహారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

## టీఎస్‌పీఎస్సీ అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా జగదీశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా ఎన్ జగదీశ్వర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నాపత్రాల లీకేజీతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. అందులో భాగంగానే టీఎస్‌పీఎస్సీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా బిఎం సంతోష్‌ను గతనెల 21వ తేదీన నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా ఎన్ జగదీశ్వర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. డిప్యూటేషన్‌పై వచ్చిన ఆయన రెండేండ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం ఆయన గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్నారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి, జవాబుదారీతనం పెంచి, నియామక ప్రక్రియను బాధ్యతాయుతంగా పూర్తి చేసేందుకు పలు సంస్కరణలు చేపట్టింది. అందులో భాగంగా ఇటీవల అదనంగా టీఎస్‌పీఎస్సీలో పది పోస్టులను మంజూరు చేసింది.

## 15న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

- కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్లలో సర్కారు నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 15న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టాలని కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తడిసిన ధాన్యాని కొనుగోలు చేయాలని ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో మొదట్లో రూ. 2200 పలికిన మొక్కజొన్నను ఇప్పుడు దళారులు రూ.1,400 కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. తూకం వేయగానే రైతుకు ట్రాక్ షీట్ ఇవ్వాలని కోరారు. మిల్లర్లతో రైతులకు ఎటువంటి సంబంధం ఉండకూడదని సూచించారు. మక్కలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రుణాలను రీషెడ్యూల్ చేయడంతో వెంటనే రుణమాఫీ చేయాలని కోరారు.

## అహంకారపూరిత మాటలు మానుకో

- మంత్రి తలసానికి కాంగ్రెస్ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీపై, రేవంత్ రెడ్డిపై అహంకార పూరితంగా మాట్లాడం మానుకోవాలని మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌ను కాంగ్రెస్ హెచ్చరించింది. శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షు లు అంజన్ కుమార్ యాదవ్, నాయకులు మల్లు రవి, ఈ అనిల్‌కుమార్, అద్దంకి దయాకర్, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు విలేకర్లతో మాట్లాడా రు. తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించుకున్నామనీ, ఎవరో ఒకరితో రాష్ట్రం సాధ్యం కాలేదని చెప్పారు. తలసాని తల పొగరు మాటలు యదవులకు పూసి కుల రాజకీయలకు పాల్పడుతున్నారని చెప్పారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ తర్వాత ప్రజల్లో వచ్చిన అదరణను చూసి బీఆర్ఎస్ అందోళన చెందుతుందన్నారు. దేశ వ్యాప్తంగా పర్యటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు పొలిటికల్ టూరిస్ట్‌లేనా? అని ప్రశ్నించారు.

## జస్టిస్ అభిషేక్‌రెడ్డికి వీడ్కోలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సుప్రీంకోర్టు సిఫార్సులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీ ఉత్తర్వులతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ అభిషేక్‌రెడ్డి పాట్నా హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు శుక్రవారంనాడాయనకు ఘనంగా వీడ్కోలు చెప్పింది. చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అధ్యక్షతన సమావేశమైన ఫుల్‌కోర్ట్ ఆయన సేవల్ని కొనియాడింది. అనంతరం జస్టిస్ అభిషేక్‌రెడ్డి దంపతులకు చీఫ్ జస్టిస్ భూయాన్ దంపతులు జ్ఞాపికను అందజేశారు. హైకోర్టు బార్ అసోసియేషన్ కూడా అభిషేక్‌రెడ్డిని సన్మానించింది.

# మహిళా జేపీఎస్ ఆత్మహత్య

- భర్త వేధింపులే కారణం : ఎస్ఐ
- పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు




నవతెలంగాణ-ఖానాపురం

సెలవుల అనంతరం విధుల్లో చేరిన రోజే జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోని(31) ఆత్మహత్య చేసుకుంది. దీనికి ఆమె భర్త వేధింపులే కారణమని పోలీసులు చెబుతుండగా.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సోని ఆత్మహత్య చేసుకుందంటూ తోటి కార్యదర్శులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ పిట్టల తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం..

ఖానాపురం మండలం రంగాపురం గ్రామ జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరి సోని శుక్రవారం విధులకు హాజరై గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల పెంపకంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో జేపీ ఎస్ సోని భర్త ప్రసాద్ ఫోన్ చేసి ఆమెను నానా దుర్భాష లాడుతూ వేధించారు. కాగా కొన్ని రోజులుగా ప్రసాద్ సోనిని అనుమానిస్తూ.. మానసికంగా వేధిస్తున్నాడు. ఉద్యోగం మానేయాలని ఒత్తిడికి గురిచేశాడు. శుక్రవారం కూడా అదే విధంగా ఫోన్ చేసి వేధించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నర్సరీ కోసం తెచ్చిన పురుగుల మందు తాగింది. సమీప గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సమాచారం అందించింది. అనంతరం కార్యాలయం నుంచి తన ద్విచక్ర వాహనంపై నర్సంపేటలో ఉంటున్న నివాసానికి బయలుదేరగా.. మార్గమధ్యలో కొత్తూరు గ్రామం వద్ద స్పృహ కోల్పోయి పడిపోయింది. అంతకు ముందు సోని ఫోన్ చేసిన సమీప పంచాయతీ కార్యదర్శి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో నర్సంపేటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు సోని అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకున్నారు. తన కూతురు మృతికి భర్త ప్రసాద్ కారణమంటూ ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోని మృతదేహాన్ని నర్సంపేటలోని మార్చురీకి తరలించారు. కాగా, సోనికి ఏడేండ్ల కూతురు ఉంది.

**జేపీఎస్‌ల ఆందోళనలో స్వల్ప ఉద్రిక్తత**

జేపీఎస్ సోని మృతి సమాచారం తెలుసుకున్న తోటి జేపీఎస్‌లు మార్చురీ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటూ నినాదాలు చేస్తూ అక్కడనే బైటాయించారు. జేపీఎస్‌ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చురీ వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో ఏసీపీ సంపత్‌రావు, సీఐ సూర్యప్రకాష్ అక్కడికి చేరుకొని సోనీ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జేపీఎస్‌ల ప్రతినిధులతో చర్చించి నచ్చజెప్పారు.

సోని మృతికి కుటుంబ కలహాలే కారణమని, దీనిని జేపీఎస్‌ల సమస్యగా చిత్రీకరించొద్దని సూచించారు. అయినా జేపీఎస్‌లు తమ ఆందోళన కొనసాగించారు. సోని తల్లిదండ్రుల వాంగ్మూలం తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీపీ సంపత్ రావు తెలిపారు. మార్చురీ వద్దకు జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన, ఎంపీడీవో సుమనవాణి, ఎంపీఓ పసరగొండ రవి తదితరులు చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**

సోని మృతదేహాన్ని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సందర్శి ంచారు. ఆమె తల్లిదండ్రులను ఓదార్చి సంఘటన విచారణ కరమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు కారణాలపై పోలీసులచే విచారణ జరిపించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ వేములపల్లి ప్రకాశరావు నివాళి అర్పించారు.